# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 7, జులై 2026

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 7

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: 040–27175050
Cell: 9348212354


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| మహోన్నతం – గురుపూర్ణిమ | 7 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| అమృతోత్పాదకుడు కూర్మావతారుడు | 24 |
| మార్గదర్శకులు – మహర్షులు | 28 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| జయదేవుని 'గీత గోవిందము' (సీరియల్) | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 46 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 53 |
| నవవిధ భక్తిమార్గాలు | 58 |
| జగన్నాథుని రథయాత్ర | 61 |
| మీ ప్రశ్న మా సమాధానం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


ఎడిటోరియల్

# హరినామక్షేత్రం శంకుస్థాపనోత్సవం

తిరుమల వేంకటేశ్వరుడు తన హరినామక్షేత్ర ఆలయ శంకుస్థాపనకు ఎట్టకేలకు ఆజ్ఞ ఇచ్చారు. అందులకు స్వామివారికి మరియు ఆశీర్వదించిన వారి భక్తులకు శతకోటి ప్రణామాలను అర్పిస్తున్నాను. తేది 02-07-2026 గురువారం ఉదయం 8.46 గంటలకు చిన్నగుండవెల్లి లోని మా తోటబావి వద్ద తిరుమల వైఖానస బ్రాహ్మణులచే శంకుస్థాపన చేయబడును. దీనిని స్వామివారి ఆదేశానుసారం వెండివాకిలి వరకు తిరుమల ప్రతిరూప ఆలయముగా నిర్మిస్తున్నాము. మరియు ఇక్కడ అఖండ హరినామస్మరణ జరుగునట్లు ఏర్పాట్లు కూడా చేయబడుతోంది. ఇది మన జీవితములో ఒక ముఖ్యమైన ఘట్టముగా భావించాలి. దీనిని సాధించుటకు తిరుమల శ్రీవారు మాకు ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇస్తున్న విషయం విదితమే. దీనిని సాధించుటకు ఇంతవరకు నేను రెండు సంకల్పాలు తీసుకోవలసి వచ్చింది. మొదటిది 16 సంవత్సరాలు 7 కోట్ల చొప్పున మొత్తం 111 కోట్ల జప సమర్పణ, రెండవది మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాలను జరపడం.

మొదటి సంకల్పం చక్కగా నెరవేర్చినప్పటికీ నన్ను నేను సంస్కరించుకొనుటలో లోపం ఏర్పడింది కాబట్టి రెండవ సంకల్పం తీసుకోవలసి వచ్చింది. 2021 సంవత్సరం జులైలో ఈ రెండవ సంకల్పమైన 111 శ్రీనివాస కళ్యాణాలను ప్రారంభించినప్పటికీ, 7 కోట్ల జప సమర్పణ కార్యక్రమమును కొనసాగిస్తూ వచ్చాము. చివరికి భాగవత ఆశీర్వాదమును కూడగడుతూ, తగిన సాధన చేస్తూ మరియు భక్తవత్సలుడు, దయామయుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షాల వలన హరినామక్షేత్రం శంకుస్థాపన వరకు వచ్చినందుకు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మరియు ఆయన యావద్భక్తులకు, శ్రీవేంకటేశం పాఠకులకు శతకోటి ప్రణామాలర్పిస్తున్నాను.

శ్రీవేంకటేశం పాఠకులకు మరియు 'దిశా నిర్దేశం' చదివిన వారందరికీ ఈ హరినామక్షేత్ర ప్రాశస్త్యము ఎంతటిదో తెలుస్తుంది. స్వామివారు ఈ స్థలాన్ని ఎంచుకుని, క్రిందికి దిగివచ్చి గత 26 సంవత్సరాల నుండి నాకు శిక్షణ ఇస్తున్నారంటే... ఈ క్షేత్ర మాహాత్మ్యం భవిష్యత్తులో ఒక దివ్యదేశం వలె ఉండునని తెలుస్తుంది. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన ఒక అంశను ఇక్కడ స్థిరీకరించబోతున్నాడు. తర తరాల భక్తులను తిరుమలలో లాగా సమ్మోహితులను చేసి రప్పించుకుందునన్నారు. భక్తులు వారి వారి కోరికలను తీర్చుకొనుటకు, ముఖ్యంగా సాధకులకు ఇది ఒక మహత్తరమైన క్షేత్రంగా విలసిల్లగలదనుటలో సందేహం లేదు.

భగవంతుడు ప్రత్యేకంగా కోరుకున్న ఈ ఆలయ నిర్మాణంలో ప్రతి భక్తుడు చేతనైనంత సహాయం అందించాలనేది స్వామివారి అభిమతం. దీని ప్రాశస్త్యాన్ని బహిర్గత పరచుటకు మరియు భక్తులను ఇందులో భాగస్వాములుగా చేర్చుటకు వారు ప్రసాదించిన వేలాది అనుభూతులను గత ఏప్రిల్ 2023 నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. ఈ నెలలో 40 వ భాగం ప్రచురించాము. స్వామివారు మనలను మానవులుగా సృష్టించాడు. కాని ఈ మానవ జన్మ క్షణభంగురము. ఏ క్షణము ఏమి జరుగుతుందో తెలియదు. మన సంపాదన, మనవారనుకున్న ఏ ఒక్కరూ మనతో రారు. మరియు స్వామివారికి సేవ చేసుకునే మహత్తర అవకాశము స్వామి కృపతో మనకు లభించింది. కాబట్టి ప్రతి భక్తుడు తనకు చేతనైనంత సహాయము ధన, వస్తు లేదా మరో రూపంగా ఈ హరినామక్షేత్ర నిర్మాణంలో పాలు పంచుకుని శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రులవుదాము. జన్మ జన్మలు వేచి చూచినప్పటికీ ఇలాంటి అవకాశం రాదనుట నిత్య సత్యము. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి రూపమైన తిరుమల శ్రీవేంకటేశ్వరుడి ఆదేశంతో అందరం కలిసి వారి ఆజ్ఞను సాకారం చేద్దాం! మన జన్మను ధన్యం చేసుకుందాం. నమో వేంకటేశాయ.

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్‌డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**




# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**– డా॥ కె.వి. రాఘవాచార్యులు**

**శ్లో॥ శ్రీమన్! కృపాజలనిధే! కృత సర్వలోక**
**సర్వజ్ఞ! శక్త! నతవత్సల! సర్వశేషిన్!**
**స్వామిన్! సుశీల! సులభాశ్రిత పారిజాత!**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం – అనపాయిని అయిన లక్ష్మీదేవిని కలిగి దయా సముద్రుడవై, సకల లోక సృష్టికర్తవై, సర్వజ్ఞుడవై, శక్తి సంపన్నుడవై, నమస్కరించిన వారి యెడ వాత్సల్యము గలవాడవై, సర్వశేషివైన ఓ స్వామీ! వేంకటేశా! సుశీలుడా, సులభుడా, ఆశ్రయించిన వారికి కల్పవృక్షమా! నీ పాదములను శరణముగా వేడుచున్నాను (పొందుచున్నాను). ఈ శ్లోకమున తవ (నీ) పదమును అధ్యాహారము చేసి, దానిని చరణౌ అను పదము ముందు చేర్చి తవ చరణౌ సమాసమునకు అర్థం చెప్పవలెను. ఈ విధంగానే 'చరణౌ శరణం ప్రపద్యే' అను మకుటము గల అన్ని శ్లోకములకు అర్థము చెప్పుకొనాలి. 'శ్రీమన్ నారాయణ చరణౌ శరణం ప్రపద్యే' అను ద్వయ మంత్రములోని పూర్వ వాక్యము యొక్క భావమే 'శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే' అను వాక్యము యొక్క భావముగా గ్రహించాలి.

**శ్లో॥ ఆనూపురార్పిత సుజాత సుగంధి పుష్ప**
**సౌరభ్య సౌరభకరౌ సమసన్నివేశౌ!**
**సౌమ్యౌ సదాఽనుభవనేఽపి నవానుభావ్యౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యం – వేంకటేశ్వరా! మంగళకరములై, ఒకదానితో ఒకటి పొందికగా తగియున్న అందమును కల్గినవి, ఎల్లప్పుడు సేవింపవలెనను భావము కల్గించునవి, పాదములను అర్చించిన పిదప 'ఇవి మంచి జాతికి చెందిన పుష్పములు అని సుగంధముచే తెలియజేయునవి' కాలి అందెల వరకు పూజింపబడిన పుష్పములు కలవి యగు నీ పాదములను శరణు పొందుచున్నాను.

# ముక్తిమార్గము



## గుండక్రియ

ప్రాణుల నేరమి గాదిది – బహుజన్మ పరంపరచే
ప్రాణులు సేసిన తమ తమ – పాపఫలము గాని ॥పల్లవి॥

1. హరి సకలవ్యాపకుఁడని – అందరుఁ జెప్పఁగ నెరిఁగియు
పరదైవంబుల గొలువక – పాయరు మానవులు,
నరపతి భూమేలఁగ భూ – వరు భజియింపఁగ నొల్లక
పరిసర వర్తుల వెంబడిఁ – బనిసేసిన యట్లు ॥ ప్రాణు ॥

2. పొందుగఁ దమతమ చేసిన – పూజలు మ్రొక్కులు గైకొన
అందముగాఁ బురుషోత్తముఁ – డాతఁడె కలఁడనియు,
అందరు నెరిఁగియు నితరులఁ – జెందుదు రున్నతశైలము
నందక చేరువ తరువుల – నందుకొనిన యట్లు ॥ ప్రాణు ॥

3. శ్రీవేంకటపతి యొక్కఁడె – చెప్పఁగ జగముల కెల్లను
దైవము నాతుమలోపలి – ధనమనఁగా వినియు,
సేవింపరు పామరు లీ – దేవుని మధురం బొల్లక
వావిరిఁ బులుసులు చేఁదులు – వలెనని కొనునట్లు॥ప్రాణు ॥



భావము – శ్రీమన్నారాయణుని ప్రాణులు సేవింపకుండుట వారి అజ్ఞానకృతమైన తప్పిదము కాదు. అనేక జన్మములలో వారొనర్చిన పాపకర్మముల ఫలమే వారినట్లు విష్ణుసేవా విముఖుల నొనర్చుచున్నది.

శృతి స్మృతులతో పాటు పరతత్త్వము నెరిగిన పెద్దలందరును శ్రీహరి అంతటా వ్యాపించి సర్వోత్కృష్టుడై ఉన్నాడని చెప్పియున్నారు. అది తెలిసియు మనుజులు ఇతర దైవముల కొలువు వదలిపెట్టకున్నారు. హరిసేవలో ప్రవృత్తి వారికి కలుగుట లేదు. ఇది యెట్లున్నదన – ఒక రాజు రాజ్యమును పాలించుచుండగా అతనిని సేవింపబోక అతని చెంతనున్న చిన్న చిన్న ఉద్యోగుల వెంటబడి సేవించినట్లున్నది. తాము చేసిన పూజలు, నమస్కారములు ప్రీతితో స్వీకరించి అనుగ్రహించుటకు పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువు సిద్ధముగా నున్నాడని అందరు నెరుంగుదురు. అయినను ఆయనను పూజింపక ఇతరులను భజించుచున్నారు. ఇది యెట్లున్నదన ఎత్తైన కొండ అందుబాటులో ఉన్నను దాని నధిష్ఠింపక చెంతనున్న చిన్న చెట్ల నందుకొన్నట్లున్నది. శ్రీవేంకటేశ్వరుడొక్కడే లోకమునంతటినీ పాలించు దైవము, జీవుల ఆత్మలలో నిగూఢమై ఉన్న ధనము గూడ ఆ పరమాత్ముడే యని వేదాంతులు అనేక విధముల చెప్పగా వినియు పామరులా దేవుని సేవించుట లేదు. ఇది యెట్లున్నదన తీపు వద్దని తొలగద్రోసి పులుపు, చేదు కావలెనని మెండుగా మెసవినట్లున్నది.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



కలియుగ ప్రత్యక్ష దైవమైన
తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆదేశానుసారం
శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో
శ్రీశ్రీశ్రీ దేవనాథ్ జీయర్ స్వామివారి
ప్రత్యక్ష పర్యవేక్షణ మరియు మంగళాశాసనములతో

**తిరుమల ప్రతిరూప ఆలయం**

# హరినామక్షేత్రం

## శంకుస్థాపన ఆహ్వాన శుభపత్రిక

**స్థలం: చిన్నగుండవెల్లి (సిద్దిపేట), తెలంగాణ**

**తేది: 02-07-2026**

భగవద్బంధువులారా!

శ్రీవేంకటాచలాధీశం శ్రియా ధ్యాసిత వక్షసమ్ ।
శ్రితచేతన మందారం శ్రీనివాసమహం భజే ॥

- శ్రీ వేంకటేశ్వర స్వామివారు అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవం. అడుగడుగు దండాలవాడు, ఆపదమొక్కులవాడు. స్వామివారు వైకుంఠం నుండి దిగివచ్చి తిరుమల క్షేత్రంలో అర్చామూర్తిగా వెలుగొందుతూ, అనేకానేక వినతులను అంగీకరిస్తూ మనలను అనుగ్రహిస్తున్నాడనుట నిత్యసత్యం.
- ఆ ఆనందనిలయ దివ్యవాసుడగు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆలయ ప్రతిరూపం చిన్నగుండవెల్లి (సిద్దిపేట), తెలంగాణలో విలసిల్లాలనే మహాసంకల్పం స్వామివారి సుస్వప్న ఆదేశం.

శ్రీ వేంకటేశ్వర స్వామివారి హరినామక్షేత్రం దివ్యాలయాన్ని సశాస్త్రీయంగా, వైదికంగా, శిల్పశోభాయమానంగా నిర్మించాలనే స్వామివారి ఆదేశానుసారం —
శ్రీ పరాభవ నామ సంవత్సర నిజ జ్యేష్ఠ కృష్ణపక్ష తృతీయ, గురువారం, శ్రవణా నక్షత్రయుక్త శుభ కర్కాటక లగ్నమునందు, అనగా 02-07-2026 తేదీన ఉదయం 8.46 గంటలకు శంకుస్థాపనకు వైఖానస భగవత్‌శాస్త్రోక్త ముహూర్తం నిర్ణయించబడినది.

**కార్యక్రమ వివరాలు**

**ఉదయం 8.46 గంటలకు:**
తిరుమల వైఖానస పండితులచే శంకుస్థాపనోత్సవం.

**ఉదయం 9.30 గంటలకు :**
ఈ క్షేత్రం ఏర్పాటు కోసం స్వామివారు చూపిన దివ్యలీలలు "దిశా నిర్దేశం" మూడవ సంపుటి పుస్తకావిష్కరణ.

**అనుగ్రహ భాషణం**

**ఉదయం 10.30 గంటలకు :**
సంకల్పించిన మొత్తం 111 కళ్యాణాలలో భాగంగా 105వ శ్రీనివాస కళ్యాణం అక్కడే నిర్వహించబడును.

**ముఖ్య అతిథులు**

| | | |
|---|---|---|
| శ్రీమాన్ **తన్నీరు హరీశ్‌రావు గారు** శాసన సభ్యులు, సిద్దిపేట | శ్రీమాన్ **డా. కె.వి. రమణాచారి గారు** (రిటైర్డ్ ఐ.ఏ.ఎస్., టి.టి.డి. మాజీ ఈవో) | శ్రీమాన్ **టి. గౌరీశంకర్ గారు** పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం |

ఈ దివ్య కార్యక్రమానికి భక్తజనులందరూ విచ్చేసి కార్యక్రమాన్ని వీక్షించి, స్వామివారి దివ్యానుగ్రహాన్ని పొందడంతో పాటు ప్రసాదాన్ని స్వీకరించవలసిందిగా ప్రార్థన.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

**గోవిందదాసులు**
(పుల్లగూర్ల సాయిరెడ్డి, సురేఖారెడ్డి దంపతులు)
93482 13454, 93488 11223



# మహోన్నతం – గురుపూర్ణిమ

: చింతలపాటి శివశంకర శాస్త్రి

శ్లో ॥ శంకరం శంకరాచార్యం గోవిందం బాదరాయణమ్
సూత్ర భాష్య కృతే వందే భగవంతే పునః పునః

పూర్వాషాఢ లేక ఉత్తరాషాఢ నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసమును ఆషాఢమాసం అని అంటారు. ఆషాఢం సాహిత్యానికి ప్రసిద్ధము. కాళిదాసు తన మేఘ సందేశ కావ్యంలో ''ఆషాఢస్య ప్రథమ దివసే'' ఆషాఢంలో మొదటి రోజు అని వర్ణిస్తాడు. ఆషాఢమాసం ఆధ్యాత్మికంగా ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నది. సనాతన సంస్కృతిలో ముఖ్యమైన పండుగలకు ఈ నెల పెట్టింది పేరు.

ఆషాఢ పూర్ణిమ... ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పూర్ణిమను ''గురుపూర్ణిమ''గా జరుపుకోవడం ఆచారం. గురుపూర్ణిమకే 'వ్యాసపూర్ణిమ' అని పేరు. భారతీయార్ష జీవన విధానం ఉపాసనామయం. అనుదినం, అనుక్షణం ఆరాధ్య దైవాలను, మార్గదర్శకులైన పూర్వులను, ప్రకృతినీ, పంచభూతాలను ఏదో ఒక పేరుతో పూజించడం, పూజా ప్రసాదమే జీవనమనీ భావించడం, విశ్వశ్రేయస్సును కాంక్షించడం భారతీయుల లక్షణం. ఇలా భారతీయులు ఆచరించే పర్వదినాలలో 'గురుపూర్ణిమ' ఒకటి. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో పూర్ణిమనాడు ఆచరించే పర్వదినమైన ఈ దినాన జగత్తుకే జ్ఞానభిక్షను పెట్టిన గురువు అయిన వ్యాస మహర్షిని తొలి గురువుగా పూజిస్తారు.

'గురు'వంటే వాక్కు – ఆయన బ్రహ్మ. గురువంటే మనస్సు. ఆయన విష్ణువు. గురువంటే హృదయం. ఆయన మహేశ్వరు. గురువంటే సాక్షాత్తు మనస్సు, వాక్కు, హృదయాల కలయికైన పరబ్రహ్మమే. అందుకే మన పూర్వులు, మహర్షులు –

**"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**

**గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః"**

అని పేర్కొన్నారు. మనో మాలిన్యమును వదిల్చి, మాటను సరళ సమీరం చేసి, హృదయాన్ని ఆత్మస్థావరం అని తెలిపే గురువు – ఈ మూడు స్థితులూ ఒకటైనవాడని అర్థం.

సత్యవతీ, పరాశరుల కుమారుడు వేదవ్యాసుడు. ''వ్యాసో నారాయణో హరిః'' శ్రీహరియైన శ్రీమన్నారాయణుడి ప్రతిరూపమే వేదవ్యాసుడు. వైదిక ధర్మ సంరక్షణార్థం భక్తి, జ్ఞాన, కర్మ మార్గలను విశ్వ హితానికై సాహిత్యం ద్వారా అందించడానికి ఆవిర్భవించిన విశ్వ గురువు. ప్రపంచానికి సనాతన ధర్మమార్గాలను, ఆధ్యాత్మిక భావనలను ఉపదేశించిన జగద్గురువు వేదవ్యాస మహర్షి.

వ్యాసునికే బాదరాయణుడను మరో పేరు ఉంది. వేదవ్యాసుడు జన్మించిన కొద్దికాలానికే తన మాతృమూర్తితో ''అమ్మా! తపస్సు కొరకు నేను బయలుదేరుతున్నాన''ని పలికాడు. అప్పుడు తల్లి వ్యాసునితో ''నాయనా! పుత్రునిధర్మం తల్లి తండ్రులకు సేవ చేయడం. అటువంటిది తల్లితండ్రుల సేవలను వదిలేసి, ఇప్పుడే బయలుదేరుతావా?'' అని అడిగింది. అందుకు సమాధానంగా వ్యాసుడు ''అమ్మా! నీవు తలచినప్పుడు నీ ముంగిట ఉంటానని'' పలికి తల్లి అనుమతితో తపస్సు నిమిత్తం బదరికాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ ఏకాంతంగా ఒక సమాధిని ఏర్పాటు చేసుకుని ఉండసాగాడు. బదరీ ఫలాలను తింటూ జీవనయాత్రను సాగిస్తుండటం వలన ఆయనకు బాదరాయణుడను పేరు వచ్చింది. ద్వీపంలో జన్మించడం వల్ల ద్వైపాయనుడని, నల్లని శరీరాకృతి కలవాడవడంతో ఇతనిని కృష్ణ ద్వైపాయనుడని అంటారు.

వేదాలు అపౌరుషేయాలు. వీటికి రచయితలు ఎవరంటే పరమాత్మే. లౌకికంగా వ్యక్తులు ఎవరూ సృష్టించలేదని అర్థం. చతుర్ముఖ బ్రహ్మ ముఖాల నుండి వెలువడిన వేదరాశిని దర్శించిన మహర్షులే వేద ద్రష్టలు. అయితే మొత్తంగా కలిసిపోయి చిందర వందరగా ఉన్న వాటిని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అని వేదాలను విభజించి లోకానికి మహోపకారం చేసిన వ్యాసుడు నిత్య పూజ్యుడై గురువైనాడు. వ్యాసుడు వేదాలను విభజించి ఊరుకోకుండా వేదాల చరమ భాగాలైన ఉపనిషత్తుల సారాన్ని బ్రహ్మసూత్రాలుగా రచించి లోకానికి పరమార్థాన్ని చూపాడు. జ్ఞానపు ముద్దల వంటి బ్రహ్మసూత్రాలు మానవ జీవన సార్థకతకు దోహదం చేస్తాయి. అందుకే వ్యాసుడు జగద్గురువు అయ్యాడు.

''నా నృషిః కురుతే కావ్యం''. ఋషి కానివాడు కావ్యము రాయలేడని పురాణోక్తి. వేదవ్యాస మహర్షి ఎన్నో కావ్యాలను రచించాడు. అందులో ముఖ్యమైనవి శ్రీమదాంధ్ర మహాభాగవతం, భారతము ముఖ్యమైనవి. అలాగే ఎన్నో పురాణాలను రచించాడు. ఆ పురాణాల ద్వారా ఎన్నో ధర్మాలను తెలిపాడు. రాగులు, విరాగులు, యతీశ్వరులు, బ్రహ్మచారులు, గృహస్థులు, వారూ వీరూ అనక ఎందరినో ఉద్దేశించి ఎన్నో ధర్మాలను సాంకర్యం లేకుండా బోధించాడు. ధర్మబోధనకు, పురాణ రచనకు వేదమే మూలం. వేదం ఒక్కటే మనకు ధర్మబోధకమైన ఉత్తమ గ్రంథం. వేదములోని ధర్మ సూక్ష్మాలను పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో వివరించేందుకే వ్యాసుడు పురాణాలను రచించాడు. పురాణాలలోని అనేక విషయాలను పూస గుచ్చినట్లుగా పురాణ వాఙ్మయంలో వివరించాడు. మానవాళికి ఎంతో మేలును కలిగించాడు. కనుకనే ఆయన సాక్షాత్తూ విష్ణు స్వరూపుడైన బాదరాయణుడయ్యాడు.

''పరోపకారార్థం ఇదం శరీరమ్'' అను సూక్తిని ఇతరులకు ఉపకారం చేసేందుకే, ఉపకరించేందుకే ఈ శరీరం ఉండాలి కాని అపకారం చెయ్యడానికి కాదు. ''ధన్యం శరీరం ఖలు తస్య దేహినో యస్య వ్యయః స్యాత్పర సౌఖ్య హేతవే'' అంటాడు వ్యాసుడు. ఎవరైతే ఎదుటివారికి మేలును కలిగిస్తారో అలాంటి మనిషి దేహం మాత్రమే ధన్యమైనది. ఎదుటివారికి కీడును కలిగించి, హింసించిన వారి దేహం ప్రయోజన శూన్యమైనది. అందుకని ప్రతి మానవుడు తాను శరీరాన్ని మాధ్యమంగా చేసుకుని, ఇంద్రియముల ద్వారా ఎలాంటి సుఖాన్ని పొందుతాడో ఆ విధంగానే ఇతరులకు సౌఖ్యాన్ని కలిగించాలన్న యోచనను నిరంతరం కలిగి ఉండాలన్నది వ్యాసుని అభిప్రాయం.

బహు విధాలైన యోగ ధర్మాలు, సాంఖ్య ధర్మములు, అనేక విధములైన దానములు, యమ నియమములు, భాగవత ధర్మాలు, భక్తి మార్గాలు – ఇలా ఎన్నింటినో తన భగవద్గీత రచన ద్వారా తెలియపరిచాడు. జ్ఞాన ధర్మాలు, ఉపాసనా విధులు, కర్మల యొక్క విధులు, బ్రాహ్మ్య, శైవ, వైష్ణవ, సౌర, శాక్తేయ అర్హత మతములు, షడ్ధర్మములు, తపస్సులను ఎన్నింటినో తెలియపరచిన వేదవ్యాసుడు మహానుభావుడు.

పూర్వకాలంలో గురుకులాలుండేవి. శిష్యులందరూ అమితమైన భక్తి శ్రద్ధలతో తమకు జ్ఞానాన్ని బోధించిన గురువులను పూజించి వారి ఆశీర్వాదాన్ని స్వీకరించేవారు.

గురువులు కూడా శిష్యులను తమ కన్నబిడ్డలవలె చూసుకునేవారు. అందుకే ఆ నాటి గురు శిష్య పరంపర సంబంధ బాంధవ్యాలు అవిచ్ఛిన్నంగా కొనసాగేవి. సాక్షాత్తు దేవదేవుడైన శ్రీరాముడు విశ్వామిత్రుని వద్ద విద్యను అభ్యసించి పరిపూర్ణుడయ్యాడు. శ్రీకృష్ణుడు కూడా తన చిన్నతనంలో గురు ఆశ్రమంలో విద్యనభ్యసించి గురు దక్షిణ ఏమి కావాలని అడిగాడు. అందుకు సాందీపుడు సముద్ర స్నానమాడబోయి, అందు మునిగిపోయి మరణించిన తన కుమారుని గురుదక్షిణగా తెచ్చి ఇమ్మని కోరాడు. అందుకు అంగీకరించిన కృష్ణుడు యమునిపై దండెత్తి, అతనిని తన రణ కౌశలంతో మెప్పించి, గురుపుత్రుని పొంది గురువుగారికి ఇచ్చి సంతోషాన్ని కలిగింపచేశాడు.

వ్యాసులవారు జ్ఞాన సంపన్నులు. వ్యాస పూర్ణిమ నాడు వారిని పూజిస్తే వచ్చే పుణ్యం అనంతం. ఆనాడు ప్రాతః కాలానే లేచి స్నానాదులు మొదలైన నిత్య కర్మలను పూర్తి గావించుకుని, బ్రాహ్మణులతో కలిసి ''గురు పరంపరా సిద్ధ్యర్థం వ్యాసపూజాం కరిష్యే'' అని సంకల్పం చెప్పుకుని శ్రీ పర్ణి వృక్షం మొదళ్ళలో ధౌత వస్త్రం పరచి తూర్పు నుండి పశ్చిమం, ఉత్తరం నుండి దక్షిణం వరకు గంధాదులతో పన్నెండు పన్నెండు రేఖలతో వ్యాస పీఠాన్ని ఏర్పాటు చేయాలి. పది దిక్కుల వైపు అక్షింతను చల్లి అష్టదిగ్బంధనం చేయాలి. తర్వాత బ్రహ్మ పరాపరశక్తి, వ్యాసుడు, శుకదేవుడు, గౌరీపాదు, గోవిందస్వామి, శంకరాచార్యులు మొదలైన వారిని ఆవాహనా మంత్రాలతో ఆహ్వానించి వారిని పూజించాలి.

మహాపురుషులు ఎన్నో శ్రమలకోర్చి అంతులేని జ్ఞానాన్ని మనకు ప్రసాదించారు. అటువంటి వారి ఋణం తీర్చుకోవడానికి అనువైన పర్వం వ్యాసపూర్ణిమ. ఈనాడు గురువులను పూజించి వారి ఆశీర్వాదములను తీసుకుని వారి అడుగు జాడలలో నడిచి మన తనువును ధన్యత గావించుకుందాం.

## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com





40వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల**

**శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**దిశా నిర్దేశం :**

సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 40 వ భాగపు లీలల ప్రచురణ. (జులై 2022 – అక్టోబర్ 2022).



### ఉత్తీర్ణుడగుటకు తీవ్ర సాధన – మాయను అడ్డు తొలగించుట

స్వామివారి సంకల్పాన్ని నెరవేర్చుటకు తగిన యోగ్యత సాధించు క్రమములో నన్ను ఎం.టెక్ లో చేర్పించి ఉత్తీర్ణుడవు కమ్మని ఆదేశించారు. గత కొంత కాలంగా ఎంత ప్రయత్నించినప్పటికీ ఉత్తీర్ణుడను కాలేదు. కాని గత సంవత్సరం నుండి లోకంలోని విషయ వాసనల పట్ల జాగ్రత్తగా ఉంటూ, స్వామిపట్ల మాత్రమే ఆలోచిస్తూ సంకల్పసిద్ధే లక్ష్యంగా జీవిస్తున్నాను. నేను అజాగ్రత్తగా ఉంటే సంకల్పసిద్ధికి విఘాతం కలుగునని భావించి, అలాంటి విషయాలను దగ్గరికి రానీయకుండా జాగ్రత్త తీసుకుంటున్నాను. కాని మనస్సు మాత్రం అప్పుడప్పుడు లౌకిక వ్యవహారముల యందు లాగుచుండేది. దీనిని గమనించి వెంటనే ఇది తగదని, తిరిగి దానిని స్వామివారి చెంతకు మరల్చుదును. ఈ విధమైన మనో సాధన సాగుచున్నది. మరో ప్రక్క ప్రతి శ్రీనివాస కళ్యాణము స్వామివారి చెంతకు చేరుటకు ఒక మెట్టుగా భావిస్తున్నాను.

తేది 30-07-2022 రోజున చిన్నగుండవెల్లిలో 21వ శ్రీనివాస కళ్యాణం, మరునాడు మా పక్క గ్రామమైన 'ఇర్కోడు'లో మరో కళ్యాణం ఏర్పాటు చేశాము. మా ఊరిలో కళ్యాణం రోజు తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి చిన్నగుండవెల్లిలో స్థిరనివాసం ఏర్పరచుకొమ్మని ఊరందరిచే ప్రార్థింప చేయాలనుకున్నాను. ఎట్టి పరిస్థితిలోనైనా స్వామి సంకల్పం నెరవేర్చాలనే నా మానసిక వ్యధను ఒక చక్కని కల ద్వారా ఈ క్రింది విధంగా సూచించాడు.

**తేది 27-07-2022 కల:** ఈ రోజు ఉదయం 4.45 గంటలకు ఈ కల వచ్చింది. అందులో నేను ఎం.టెక్ లో తప్పక ఈసారైనా ఉత్తీర్ణుణ్ణి కావలెనని




నా మార్గానికి అడ్డుగా ఉన్న దిష్టి బొమ్మను విసిరి వేయుట
(కల 27-7-2022)

పట్టుదలతో ఉన్నాను. గత కొన్నిసార్లు ఏమీ చదవక పరీక్ష రాయలేదు, ఉత్తీర్ణుణ్ణి కాలేదు. ఈసారైన ఉత్తీర్ణుడను కావలెననే పట్టుదల నాలో కనిపించింది. ఒక సందర్భంలో కళాశాలవారు ఎం.టెక్ విద్యార్థులకు ఊరు బయట, ఎన్.ఎస్.ఎస్ క్యాంపు లాంటిది పెట్టి ఒక ప్రదేశములో శిక్షణ ఇస్తున్నారు. నేను ఈ క్యాంపు వద్దకు పోవుచున్నాను. అప్పటికే ఆలస్యమైంది, కావున ఆత్రుతగా ఊరు బయట చూచాయగా ఈ క్యాంపు జరుగు స్థలము వద్దకు పోయాను. అక్కడ అన్నీ కొండలు, గుట్టలు, వ్యవసాయ పొలములు కనబడ్డవి. నేను ఒక వ్యవసాయ పొలము వద్దకు పోయి ఈ క్యాంపు ఎక్కడ జరుగుచున్నదని నలు దిక్కులా కలయచూశాను. దూరంగా ఒక ఎత్తైన కొండపై విద్యార్థులు కనపడి అలజడి వినపడింది. వెంటనే ఆ దిశగా ప్రయాణమవ్వాలనుకున్నాను. ఇంతలో స్వామివారు నాకు సహాయంగా ఒక దివ్యశక్తిని పంపారు. ఆ దివ్యశక్తి నన్ను ఆవహించింది. నన్ను ఒక అడుగు వెడల్పు, ఆరు అడుగుల పొడవున్న ఒక దివ్య ప్లేటుపైన బోర్లా పడుకోబెట్టింది. ఆ శక్తి నన్ను భూమిపై రెండడుగుల ఎత్తునుండి అత్యంత వేగంగా ఆ కొండ దగ్గరికి, ఈ వ్యవసాయ భూముల మధ్యనుండి దూసుకు పోవుచున్నది. ఆ దూసుకుపోవు క్రమములో ఆ చేనులో ఒక 15" ఇంచుల ఎత్తు కల ఒక దిష్టిబొమ్మ మనిషి లాగా కనబడ్డది. అది చీర, జాకెట్ ధరించి, తలపై తెలుపురంగు చింపిరి జుట్టు కలిగి నిలబడుటను చూచాను. నేను దానికి అత్యంత సమీపము నుండి మరియు దానిపై నుండి వేగంగా బోర్లా పడుకుని వెళ్ళుచున్నాను. నా దారిలో ఈ దిష్టిబొమ్మను మరియు దీని ప్రక్కన దీని బిడ్డను చూచాను. ఈ పెద్ద బొమ్మ కొన్ని సంవత్సరాల నుండి నేను ముందుకు పోకుండా అడ్డుకుంటున్నదట. ఇలా గత కొన్ని సంవత్సరాల నుండి నా మార్గానికి అడ్డు వస్తోంది కాబట్టి దానిపై నాకు కోపము ఉన్నది. నేను ప్రస్తుతం ఒక శక్తి ఆధారంగా అత్యంత వేగంగా, రెట్టింపు శక్తి కలిగి వెళ్ళుచున్నాను. కావున, ధైర్యముతో ఈ పెద్ద బొమ్మ జుట్టు పట్టుకొని ఆ మార్గము నుండి తీసి ప్రక్కనే ఉన్న ఎనుగులో విసిరి వెళ్ళిపోయాను. నీవు దారికి అడ్డు రావద్దని హెచ్చరిస్తూ వెళ్ళిపోయాను. ఆ తరువాత ఈ శక్తి నన్ను ఆ విద్యార్థులున్న ప్రాంతమున ఒక కొండ సమీపాన దించింది. చుట్టూ చూచాను ఎవ్వరూ లేరు. కాని కొండపై నుండి విద్యార్థుల అలజడి వినిపిస్తున్నది. ఈ కొండ ఎక్కుటకు బహు కష్టంగా ఉన్నది. చివరికి గట్టిగా ప్రయత్నించి, కొండరాళ్ళను పట్టుకొనుచు, ఒక్కొక్క అడుగు వేయుచు కొండ పైకి ఎక్కినాను. ఆ కొండపైన విశాలమైన స్థలములో ఎం.టెక్ చదువు నూతన విద్యార్థులను చూచాను. నా స్నేహితుల కోసం చూస్తే కనబడలేదు. సరేనని భావించి అసలు ఏయే విషయాలు చెప్పారు? పరీక్షలో దేనిగురించి ఎలా చదవాలి? వారిని అడిగి తెలుసుకున్నాను. ఎలాగైనా ఈసారి ఉత్తీర్ణుడను కావలెనని దృఢ నిర్ణయముతో ఉన్నట్లు తోచింది. కల చెదిరింది.

దీనర్థం – నేను ఏవిధంగానైనా స్వామివారి సంకల్పమును నెరవేర్చాలనే పట్టుదలతో ఉన్నాను. స్వామివారు కూడా ఎప్పటికప్పుడు తగిన సహకారం అందిస్తున్నారు. మరియు దైవశక్తికి వ్యతిరేకంగా ఎప్పటికీ ఒక దుష్టశక్తి ఉంటుంది. అలాంటి దుష్టశక్తిని స్వామి కృపతో నా దారినుండి ప్రక్కకు త్రోసివేయ గలిగాను. కావున ఇక సులభంగా స్వామిని చేరవచ్చనే సూచనలిచ్చారు.

## చిన్నగుండవెల్లిలో 21వ కళ్యాణం... ఆనందం... ప్రార్థన

తేది 30-07-2022 శనివారం రోజున మా సొంత గ్రామమైన చిన్నగుండవెల్లిలో వైఖానసాగమోక్తంగా 21వ శ్రీనివాస కళ్యాణమును చేశాము. ఇది నా జీవితములో అత్యంత మధురమైన, ముఖ్యమైన ఘటనగా భావించాను. నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను చిన్నగుండవెల్లిలో కళ్యాణం నిర్వహించుమని గతంలో ఆజ్ఞాపించారు. మరియు శ్రీ ఆండాళ్ మాత కూడా చిన్నగుండవెల్లిలోని తన ఇంటిలో పెండ్లికూతురుగా తయారై, స్వామివారితో కళ్యాణానికి సిద్ధంగా ఉంటానన్నది. తనకు చిన్నగుండవెల్లిలో ఇల్లు ఉన్నదన్నది. కావున నా ఇల్లే అమ్మవారి ఇల్లుగా భావించి, కళ్యాణానికి ముందు మా ఇంటిలో అమ్మవార్లను, మరియు అయ్యవారిని పెండ్లికూతురు, పెండ్లికొడుకుగా చేసి ఊరంతా 'నమో వేంకటేశాయ' రథంలో ఊరేగింపు చేశాము. మంగళ వాయిద్యాలు, మా ఊరి చప్పుళ్ళు, భజనలు, కోలాటాలతో అత్యంత ఉత్సాహంగా ఎదుర్కోళ్ళు కార్యక్రమం

జరిగింది. ఎంతో మంది భక్తులు రథం ముందు నీళ్ళు పోసి స్వామివారి కాళ్ళు కడిగి, హారతుల మధ్యన కళ్యాణ వేదికకు తీసుకెళ్ళాము. ఈ కళ్యాణం స్వామివారు నిర్ణయించగా ఆయన సేవకుడనైన నేను మీ సహకారముతో నిర్వహిస్తున్నానని ఊరు వారందరితో చెప్పాను. మరియు చిన్నగుండవెల్లిలో తిరుమల శ్రీవేంకటేశ్వరుడు స్థిర నివాసము ఏర్పరచుకోవాలని కోరుతూ అందరిచే ఏడు సార్లు స్వామివారిని ప్రార్థింపచేసి కళ్యాణం మొదలుపెట్టాము. కళ్యాణం చాలా ఆనందంగా, ఉత్సాహంగా జరిగింది. కళ్యాణం మధ్యలో అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అందరూ ఆనందించారు. దాదాపు 1200 మందికి పైగా కళ్యాణాన్ని వీక్షించారు.

మా ఊరిలో స్థిర నివాసము ఏర్పాటు చేసుకొమ్మని అందరిచే ప్రార్థింప చేయునప్పుడు నా ఒళ్ళు పులకరించింది. కాళ్ళు వణికాయి, స్థిరత్వం కోల్పోయాను. దీనికై స్వామివారిని 7 సార్లు అందరిచే ప్రార్థింప చేశాను. స్వామి ఆజ్ఞ ప్రకారం చేశాననే తృప్తి చెందాను. చాలా ఆనందించాను. జీవితంలో ఒక ఘట్టం ముగిసినట్లైంది.

## తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 20 వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

ఈసారి 'నమో వేంకటేశాయ' రథయాత్రను చేయకపోయినప్పటికీ, హైదరాబాద్ నుండి డైరెక్ట్ గా రథమును తిరుపతి వరకు తీసుకెళ్ళాము. తేది 18-08-2022 గురువారం సాయంత్రం స్వామివారి పాదాల మండపం వద్ద ఈ 20వ పర్యాయంగా 7 కోట్ల జపమును స్వామివారి పాదాలకు సమర్పించి ప్రార్థించాము. పిదప తేది 19-08-2022 శుక్రవారం గోకులాష్టమి నాడు ఎస్.వి డైరీఫాంలో ఉన్న శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద జప హోమాదులు నిర్వహించాము. జపము వ్రాసిన వారందరికీ స్వామివారి కృపా కటాక్షములు లభించాలని ప్రార్థించాము. ఆ తరువాత టిటిడి ఛైర్మన్ శ్రీమాన్ ఎస్.వి. సుబ్బారెడ్డి గారు యజ్ఞ పూర్ణాహుతి కావించిన తరువాత జపమును స్థూపములో సమర్పించారు. ఆ తరువాత 21 వ పర్యాయంగా 7 కోట్ల జప సంకల్పము కూడా అక్కడనే ప్రారంభించారు. ఆ తరువాత భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి జపమును తలా కొంత సమర్పించారు. మొత్తం మీద కార్యక్రమం చాలా ఆనందంగా జరిగింది. టి.టి.డి వారు ప్రసాద వితరణ కావించారు.

తెల్లవారి కొండకు వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాము. ఈసారి స్వామి దర్శన సమయమున స్వామివారి గుడి ఏవిధంగా ఉన్నదన్న కోణంలో పరిశీలించాను. నా కాలి అడుగులతో వీలైన స్థలములో కొలతలు తీసుకున్నాను. ఒక ఇంజనీరింగ్ మైండ్ తో ప్రతి ఇంచు పరిశీలించి వ్రాసి పెట్టుకున్నాను. స్వామివారు మా సురేఖను కూడా ఈసారి ప్రత్యేకంగా అనుగ్రహించారు. సురేఖకు ఎప్పటినుండో వేధిస్తున్న రెండు కోరికలు తీర్చాడు. మొదటిది : మా కొడుకుకు సంతానము కలగాలి. రెండవది : వారి అమ్మ తేది 18-02-2022 నాడు అమెరికాలో చనిపోయింది. వారి అమ్మ చనిపోవునప్పుడు తానే వారి అమ్మ నోటిలో తులసి తీర్థం పోయాలనే కోరిక సురేఖకు ఎన్నో రోజుల నుండి ఉండింది. కాని మా అత్త అమెరికాలో చనిపోయినప్పుడు, సురేఖ హైదరాబాద్ లో ఉండుట వలన ఈ కోరిక తీరలేదు. దానిని ఇప్పుడు స్వామివారు తీర్చారు. వీటిని చూద్దాం.

## సురేఖ కలలు

ఈసారి జప సమర్పణకు అమెరికా నుండి మా పెద్ద కొడుకు చి|| వేదాంత్, వాని భార్య చి|| సౌ|| పూజ కూడా వచ్చారు. తేది 19-08-2022 నాడు 20వ జప సమర్పణ కావించాము. తేది 20-08-2022 నాడు కొండపై స్వామి వారిని దర్శించుకున్నాము. సాయంత్రం తిరిగి వెళ్ళాలి కావున కొంత షాపింగ్ చేసి భోజనం తరువాత గది లోనికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న సమయాన సురేఖకు అనుకోకుండా నిద్ర వచ్చింది. అందులో ఒక కల వచ్చింది. ఈ గదిలో కొడుకు, కోడలు, నేను, సురేఖ నలుగురము విశ్రాంతి తీసుకుంటున్నాము. చి|| సౌ|| పూజ కుర్చీలో కూర్చుండి విశ్రాంతి తీసుకుంటుంది.

**తేది 20-08-2022 కల :** ఈ కలలో కూడా చి|| సౌ|| పూజ ఈ గదిలో కుర్చీ పైననే ఉండి తనకు ఎట్లానో, అసౌకర్యంగా ఉన్నదని అన్నదట. ఇంతలో మా వేదాంత్ "ఏమైనా విశేషంగా అనిపిస్తున్నదా?" అని అన్నాడట. వెంటనే ఈ మాటను సురేఖ కూడా పూజను అడిగిందట. దీనికి పూజ అవును అన్నట్లు తల ఊపిందట. కల చెదిరింది.

తిరుమల కొండపైన స్వామి దర్శనము తరువాత ఇలాంటి కల వచ్చింది. కావున మాకు శుభం కలుగునని, మా కొడుకుకు సంతానం కలిగే సమయం వచ్చిందని భావించాము. ఇది మా మనవడి గురించి స్వామివారు చూపిన 5వ లీల.

స్వామివారు ఒక్క లీల చూపితేనే జరిగి తీరుతుంది. కాని నాకు మనవడు పుడతాడని ఇంతవరకు దాదాపు అయిదారు సార్లు చెప్పారు కాని ప్రసాదించలేదు. ఇలా ఎందుకు జరుగుతోంది? స్వామివారికి ఆటంకమేమిటనే ఆలోచన మొదటిసారి నా మనస్సుకు వచ్చింది. కాని ఆ తరువాత రోజులలో దీనికి ఒక మహత్తరమైన కారణము ఉన్నదని గ్రహించాను. (కొన్ని భాగాల తరువాత అది తెలుస్తుంది.)

మేము తిరుపతి నుండి వచ్చిన తెల్లవారి రెండవ కోరికను కూడా స్వామివారు ఈ క్రింది విధంగా తీర్చారు.

**తేది 21-08-2022 :** తనకు ఈ ఉదయం ఒక కల వచ్చిందట. అందులో వారి అమ్మ కీ.శే శకుంతలాదేవి గారు మంచం మీద పడుకున్నదట. మరియు చివరి దశలో ఉన్నదట. ఆ... ఆ... అంటూ నోరు తెరిచి కళ్ళు మూసుకుని కొన ఊపిరితో చివరి దశలో ఉన్నది. దీనిని గమనించిన సురేఖ తులసినీళ్ళు, తులసినీళ్ళు అంటూ అరచిందట. ఎవరో ఒకరు తులసినీరు అందించగనే ఈమె వారి అమ్మ నోటిలో పోసింది. ఆ వెంటనే వారి అమ్మ కన్ను మూసింది. కల చెదిరింది.

సురేఖకు వీరి అమ్మ చివరి దశలో ఉన్నప్పుడు తాను దగ్గర లేనని గత కొంతకాలంగా వేదనకు గురి అవుతున్నది. వీరి అమ్మ అమెరికాలో తేది 18-02-2022 నాడు చనిపోయింది. ఈ కల ద్వారా శ్రీవేంకటేశ్వరుడు సురేఖ కోరికను తీర్చాడు. ఈ విధంగా మొత్తం రెండు కలలను ప్రసాదించి సురేఖను ఆనందపరచాడు.

## హరినామ క్షేత్రానికి 'ఏకాంగి'గా నియమించుట

ఈసారి తిరుమల స్వామివారిని దర్శించినప్పుడు ఒక ఇంజనీరింగ్ మైండ్ తో ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాను. మరియు వీలైన ప్రాంతములో కొలతలు తీసుకున్నాను. ఈ విధంగా మొదటిసారి హరినామక్షేత్ర నిర్మాణపు దిశగా అడుగు పడింది. స్వామివారు కూడా ఇదే దిశగా మరో అడుగు ముందుకు వేసి నన్ను హరినామక్షేత్రానికి 'ఏకాంగి'గా నియమించారు.

ఏకాంగి అంటే... శ్రీవైష్ణవ పరిభాషలో జీయర్ స్వామివారి ఆంతరంగిక సేవకుడు. ఒక ప్రత్యేకమైన వస్త్రమును ధరించి జీయర్ సేవలకంకితమై వారితో పాటు నిరంతరం జీవించువాడు. వారు మాత్రమే జీయర్ గదిలోనికి వెళ్ళుటకు అర్హులు.

2000 సంవత్సరం నుండి నేను స్వామివారి సాధన చేస్తున్నాను. కాలం గడిచిన కొద్దీ యోగ్యతను పరిగణన లోనికి తీసుకొని ఒక్కొక్క మెట్టు ఎక్కిస్తున్నారు. 2003 సంవత్సరంలో పాద సేవకుడిగా స్వీకరించి వారి సేవాభాగ్యాన్ని ప్రసాదించారు. 2012 లో ఆంతరంగిక సేవకుడిగా స్వీకరించి, నేరుగా స్వామివారి గది వద్దకు వెళ్ళగలిగే అధికారాన్ని ప్రసాదించారు. ఇప్పుడు 'ఏకాంగి'గా స్వీకరించి వారి గది లోనికి ప్రవేశాన్ని కలుగజేశారు. భక్తులను అనుగ్రహించుటకు స్వామివారికి అవసరమైన ఏర్పాట్లు చేయుట నా బాధ్యత. ఇది మరో భాగ్యం! దీనిని ఈ క్రింది లీల ద్వారా సూచించారు.

**తేది 23-08-2022 కల :** ఇంతకుముందే మాకు ఒక మంచి ఇల్లు ఉన్నదట. కాని మాకు అత్యంత దగ్గరివారి కోరిక మేర ఒక నూతన గృహమును నిర్మించు నిమిత్తము ఒక స్థలమును పరిశీలిస్తున్నాము. నేను మరియు నా భార్య సురేఖ కలిసి ఈ స్థలము వద్దకు వచ్చి చూస్తున్నాము. మాతో పాటు ఒక దగ్గరి మనిషి కూడా ఉన్నారన్న భావన కలిగింది, అంటే ముగ్గురం కలిసి చిన్నగుండవెల్లిలో ఈ స్థలమును పరిశీలిస్తున్నాము. మూడవ వ్యక్తి అదృశ్య రూపములో ఉన్నారు. ఇది ఊరికి వెలుపల ఉన్నది. దీని పరిసరాలలో ఎలాంటి ఇండ్లు లేవు. కాని కొద్ది దూరములో ఒక కాలనీ ఉన్నది. ప్రస్తుతం ఈ స్థలం వ్యవసాయ పొలము లాగానే ఉన్నది. పెద్ద జాగా ఒక వరద కాలువ ఈ పొలము గుండా పోయిన ఆనవాళ్ళు కనబడుతున్నవి. మిగిలినదంతా గడ్డి మొలిచి పచ్చిగా ఉన్నది. దీని గట్లను పరిశీలించాను. ఈ అజ్ఞాత వ్యక్తి మాత్రము, మీరు ఇక్కడ ఇల్లు కట్టుకోండి నాకు దగ్గరగా ఉంటుంది. మీరు 'ఏకాంగులు', నేను దగ్గరలోనే ఉంటాను, భయము లేదు అని చెప్పుచు మమ్ములను ఇక్కడ ఇల్లు నిర్మించుకొమ్మని ప్రోత్సహిస్తున్నారు. మేము కూడా సరేనని ఒప్పుకున్నట్లు అనిపించింది. కల చెదిరింది.

దీనర్థం: స్వామివారు మమ్ములను 'ఏకాంగి'గా స్వీకరించి హరినామక్షేత్రం ప్రక్కనే నివసించుమన్నారు. మరియు ఒంటరివని చింతించకంటూ మా రక్షణ బాధ్యతలు స్వీకరించారు.

## అనుభూతుల ప్రచురణకు ప్రేరణ

ఇది అక్టోబర్ 2022 నెల శ్రీవేంకటేశం కూర్పు సమయంలో జరిగింది. అక్టోబర్ నెల 'శ్రీవేంకటేశం' మాసపత్రిక కూర్పుకు అవసరమైన వ్యాసాలు లభించలేదు. చాలా బాధపడ్డాను, ఎలా...? అని స్వామివారిని ప్రార్థిస్తూ ఆలోచించే క్రమములో నా అనుభూతులను శ్రీవేంకటేశం మాసపత్రికలో ఏప్రిల్-2023 నుండి ధారావాహికంగా ప్రచురించాలనే భావం బలంగా ఏర్పడ్డది. దీని ద్వారా ప్రతి నెల ఎనిమిది-తొమ్మిది పేజీల వరకు నా అనుభూతులు వచ్చును. మిగిలినవి ఇతర వ్యాసాలు వేయవచ్చుననుకున్నాను. మరియు ఈ అనుభూతులను వచ్చే విజయదశమి, తేది 05-10-2022 నుండి చదువుట ప్రారంభించాలనుకున్నాను. జనవరి 2023 నుండి "తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం" అనే శీర్షికన వ్రాయుట ప్రారంభించి ఏప్రిల్ 2023 నుండి శ్రీవేంకటేశం మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించాలనే బలమైన కోరిక కలిగింది. దీనితో అనుభూతుల ప్రచురణకు స్వామివారు అనుమతించారని భావించాను.

## సాధనను వేగవంతం చేయుట

యోగ్యతను సాధించే క్రమములో ఇంతవరకు స్వామివారు నాలోని కొన్ని వికారాలు తొలగించారు. ఆ తరువాత 2వ

సంకల్పమైన 'శ్రీనివాస కళ్యాణాలు' ప్రారంభింపచేసి, అందులోని సమస్యలను తీర్చి, దానిని దారిలోనికి తెచ్చారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం చక్కగా నడుస్తోంది.

నా సాధనానుసారం స్వామివారు ఒక్కొక్క సమయానికి ఒక్కొక్కటి ప్రసాదిస్తున్నారు. ఏప్రిల్ 2021 లో హరినామ క్షేత్రాన్ని ప్రసాదించారు. ఏప్రిల్ 2022 లో దీనిని ఎక్కడ ఏ విధంగా నిర్మించాలనే విషయమును తెలియచేశారు. ఆగస్టు 2022 లో నన్ను ఈ క్షేత్రానికి 'ఏకాంగి'గా స్వీకరించారు. ఇప్పుడు సాధనను వేగవంతము చేసి యోగ్యతకు అవసరమైన మరికొన్ని వికారాలను నశింపచేయుటకు మరియు కొన్ని సుగుణాలను ఆపాదించుటకు మా జీవితంలో ఒక భయానక సుడిగుండమును ప్రవేశపెట్టారు. ఫలితంగా ఒక ధూళికణము సుడిగుండంలో ఏవిధంగా దారీ తెన్నూ తెలియక కొట్టుకుపోతుందో... ఆ విధంగా కొట్టుకున్నాము. ఏ మార్పు సాధించుటకు ఈ శిక్షణ ఇస్తున్నారో నిజానికి నాకు తెలియదు. కాని చూచాయగా ఇది కర్మఫలం అనుభవించుట, అరిషడ్వర్గాల నిర్మూలన, అల్పత్వం, సహనం అలవరచుకొనుట, సంపూర్ణ శరణాగతి, ఆత్మసమర్పణ స్థితి, స్థితప్రజ్ఞత మొదలగునవి సాధించుట కొరకు ఉండవచ్చని భావిస్తున్నాను. వీటిని నేను, నా భార్య ఇద్దరం అనుభవించేటట్లు చేసినప్పటికీ, నాకు ప్రసాదించిన శిక్షణ బహు కఠినంగా ఉన్నది. ఇంతకు ముందటి సాధనతో పోల్చితే ఇది ఎన్నో రెట్లు అధికం. సాధనలో క్రొత్త ఒరవడిని పరిచయం చేశారు. అభ్యాస వైరాగ్యాల ద్వారా సాధన చేసి యోగ్యత సాధించుకున్నారు. వాటిని తోచినంత వరకు క్లుప్తంగా వివరిస్తున్నాను.

స్వామివారి శిక్షణ మానసికంగా బహు కఠినంగా ఉంటుంది. అనుభవించిన వారికి తప్ప ఇతరులకు తెలియదు. సమస్యపై వ్యామోహాన్ని పెంచి ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకోలేని స్థితిని కల్పిస్తారు. ఫలితంగా స్వామివారిని తీవ్రంగా స్మరించేది. ఇలా కాలం గడిచిన కొద్దీ నా మానసిక ఆలోచనా ధోరణి మారిపోయింది. పాము కనబడగానే భయపడి కేకలు వేసినట్లు, సమస్యను చూచి బెదిరిపోయి శరీరములో వణుకు పుట్టింది. రక్షించమని స్వామివారిని తీవ్రంగా ప్రార్థించే వారిమి. ఈ తీవ్రత ఎంత ఉంటుందంటే శ్వాస తీసుకొనుటకు కూడా ఇబ్బందిగా ఉండేది. నా మనస్సు మరో విషయంపై మరల్చుటకు అవకాశం లేని విధంగా ఉండేది. ప్రభూ నేను ఈ బాధలను భరించలేను, తగ్గించుమని ఎన్నిసార్లు ప్రార్థించినా లాభం లేకపోయింది. నాకున్న సర్వదాస్తిని మరోమారు సమర్పించాను. మనిషి చివరి దశలో ఉన్నప్పుడు ఎలా స్మరిస్తారో అలా స్మరిస్తానన్నప్పటికీ కనికరించలేదు. ఒక ఉడుం పట్టు పట్టాడు. ఒక దశలో నాకు ఆస్తులు, అంతస్థులు ఏమీ వద్దు, ఉన్నదంతా సమర్పిస్తున్నాననన్నాను. కనికరించలేదు. ఈ స్థితి ఎంతగా దిగజారిందంటే ఏ ఆస్తిపాస్తులు లేని బిచ్చగాడు ఎంతో అదృష్టవంతుడని, అంతటి భాగాన్ని ప్రసాదించమని వేడుకున్నాను. మరో అడుగు ముందుకు వేసి, ఒక దశలో జీవితం చాలించాలనే స్థితికి వచ్చాను. కాని నన్ను నమ్మి నా ప్రభువు ఒక సంకల్పాన్ని అప్పజెప్పాడు, దానిని నెరవేర్చకుండా జీవితము చాలిస్తే అది నా ప్రభువుకు అవమానమని భావించి వెనుకడుగు వేశాను. కాని నా భార్య మాత్రం తనకు జీవితము చాలించాలని ఉన్నదని ఎన్నోసార్లు చెప్పింది. ఇలా రోజు రోజుకు మాకు పుత్రులపైన, ఆస్తిపాస్తుల పైన, సమస్త బంధుమిత్రుల పైన, లౌకిక విషయాల పైన వ్యామోహము నశింపచేసి వైరాగ్యం అలవరచుకొనుటకు శిక్షణ ఇచ్చారు. నేను కూడా దీనిని అంతిమ యుద్ధం లాగా స్వీకరించాను కాబట్టి అస్తిపంజరం లాగా సన్నబడ్డాను. నా భౌతిక రూపు చూచి నా మీద నాకే అసహ్యం వేసింది. ఈ సందర్భంగా శ్రీమాన్ అన్నమాచార్యులు అన్న ఒక చక్కని మాట ''వెతికితే మూడు కాళ్ళ కుందేలును సాధించవచ్చును. కాని హరిసేవ చేయుట అంతకంటే కష్టం'' అన్న మాటలు నిజమనిపించాయి. కేవలం మా లక్ష్యం మాత్రమే మా కళ్ళకు కనబడేది తప్ప మరేదీ కనబడలేదు. చివరికి నేను ఈ లోకంలో స్వామివారి సేవకు తప్ప మరో దానికి పనికిరాను అనే స్థితికి చేరుకున్నాను. ఈ శిక్షణ జులై 2022 నుండి మొదలైంది.

## కర్మఫలం అనుభవింప చేయుట

భగవంతుణ్ణి పొందగోరు సాధకుడు కర్మఫలం అనుభవించి తీరాలి. దీనిని నేను, నా భార్య వేర్వేరు మార్గాల ద్వారా అనుభవించాము. వాటిని క్లుప్తంగా వివరిస్తున్నాను!

**నాకు ప్రసాదించిన శిక్షణ :** నాకు వ్యాపారముపైన, నా భార్యకు కుటంబము పైన ఎక్కువ మక్కువ. దీనిని ఉపయోగించి స్వామివారు ప్రత్యేక పరిస్థితులను కల్పించి మా సాధన వేగమును ఎన్నో రెట్లు పెంచారు. క్షణము వదలక నిద్రలో కూడా స్వామివారిని స్మరించే పరిస్థితిని కల్పించారు. కొన్నిసార్లు ఎదుటి వ్యక్తి కనబడనంతగా స్వామి స్మరణలో నిమగ్నమైపోయేవాడిని. కొన్ని ప్రత్యేక భయానక పరిస్థితులను కల్పించి నీటినుండి తీసిన చేపపిల్లలా విల విలా కొట్టుకునేటట్లు చేశారు. ఫలితంగా ఈ భయాన్ని దూరం చేయమంటూ స్వామివారిని తీవ్రంగా స్మరించాను. ఏమి సాధించుటకు ఈ శిక్షణ ఇస్తున్నారో తెలియదు కాని భయాన్ని వీడినప్పుడు యోగ్యత ప్రసాదిస్తున్నట్లు భ్రమింపచేయుట వలన నేను మరింత అధిక సాధన చేశాను. నేను ఎంత అరచి గగ్గోలు పెట్టినా

''తప్పించుకొనుటకు వీలు లేదు, నా బంధాల్లో చిక్కి ఉన్నావు'' అన్నాడు. మరోమారు నీవు అనుభవించి తీరాలి ''ఇది బ్రహ్మ ప్రసాదితము'' అంటూ పలికాడు. నేను కూడా భరించలేని స్థితిలో ఉన్నప్పుడు తప్పించుకొనుటకు ప్రయత్నించినప్పటికీ, సేద తీరగానే స్వామివారి సంకల్పం నెరవేర్చాలని భావించి, శిక్షణను స్వాగతించేది. నా మనస్సు రవ్వంత కూడా అన్య విషయాలపై వెళ్ళకుండా ఒకమారు స్వామివారు తనకు తాను హింసించుకున్నారు. దీనితో మరింత భయపడి తీవ్ర సాధన చేశాను. ఒక సందర్భంలో ఆత్మహత్య గురించి కూడా ఆలోచించాను. ఇలా రెండు సంవత్సరములు నరకయాతన అనుభవించాను. ఇదే కాలంలో నేను నా అనుభూతులు వ్రాయుట మొదలుపెట్టాను. ఇది జనవరి 2023 నుండి ఆగస్టు 2024 వరకు 46 భాగాలు వ్రాశాను. ఈ వ్రాయునప్పుడు, ఒక్కొక్క అనుభూతిని విశ్లేషిస్తున్నప్పుడు ఎంతో పరివర్తన చెందాను. ఇలా రెండు రకాలుగా నాలో పరివర్తన జరిగింది. స్వామివారు నా శిక్షణను ఎప్పుడూ తగ్గించలేదు కాని నా స్థితిని ఎప్పటికప్పుడు తెలిపి ఉత్సాహపరిచేవారు. చివరికి నా సాధన ఫలించినట్లు సెప్టెంబర్ 2024 లో బ్రహ్మోత్సవం చేసుకున్నంత సంతోషించారు. అప్పటికి నేను శక్తికి మించి సాధన చేయటం వలన చాలా చిక్కిపోయి అస్థిపంజరం లాగా మారాను. స్వామి ఆజ్ఞతో ఒక సంవత్సరం సేద తీరిన తరువాత తేది 20-07-2025 నుండి మళ్ళీ నాలో శేషభూతంగా మిగిలిన కామ క్రోధాలను సమూలంగా నిర్మూలించే శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత విజయం సాధించుటకు స్వయంగా స్వామివారే ఒక ఉపాయం చెప్పారు. ఈ ఉపాయాన్ని పాటించిన తరువాత విజయం సాధిస్తున్నట్లు సూచనలిచ్చారు. ఇదే కాలములో మార్చి 2026 వరకు స్వామి కృపతో 100 కళ్యాణాలు పూర్తైనవి. మరియు శ్రీ పరాభవనామ ఉగాది (ఏప్రిల్ 2026) వరకు హరినామక్షేత్ర ప్లాన్ సిద్ధం చేసి శంకుస్థాపనకై వేచి చూస్తున్నాము. మరియు డిసెంబర్ 2025 వరకు పొందిన అనుభూతులను 50 వ భాగం వరకు వ్రాశాను.

**సురేఖకు ప్రసాదించిన శిక్షణ :** ఇదే కాలములో నా భార్య సురేఖ కూడా విభిన్న మార్గంలో తన కర్మ ఫలాన్ని అనుభవించింది. దీనికి మా పెద్ద కొడుకు చి|| వేదాంత్ ను ఎంచుకుని, వాని జీవితము అస్తవ్యస్తము అగునట్లు చేసి సురేఖకు మానసిక వ్యధను కల్పించారు. ఈ లీలలో ఒక దెబ్బకు మూడు పిట్టలంటూ ఒకప్రక్క సురేఖ తన కర్మఫలం అనుభవించుట, మరోప్రక్క మా పెద్ద కోడలు చి|| సౌ|| పూజలో మార్పు తీసుకువచ్చుట, మూడవది చి|| వేదాంత్ అత్తమామల మనస్తత్వంలో మార్పు తీసుకురావటం జరిగింది. ఈ కాలంలో మా వేదాంత్ ఒక సైకోలాగా, ఉన్మాది లాగా ప్రవర్తిస్తూ, భార్యను, అత్తమామలను హింసించుట మొదలుపెట్టాడు. వీని అత్తమామలను శత్రువుల కంటే హీనంగా హింసించాడు. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో తెలియని అయోమయ స్థితి ఉండేది. వాని కోపానికి కారణమంటూ ఉండేది కాదు. మొదట పాములాగా బుసలు కొడుతూ ఆ తరువాత రెచ్చిపోయేవాడు. వారిని తిట్టుట, కొట్టుటకు ఎన్నోసార్లు ప్రయత్నించాడు. 6 నెలల కోసమని అమెరికాకు వెళ్ళి వాని భయానికి 45 రోజులలో తిరిగి వచ్చారు. వాడి భయానికి మూడు రోజులు గదిలోనే ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చును. ఈ పిల్లగాడు సైకో, మోసం చేసి పెండ్లి చేశారని భావించారు. ప్రతిసారీ వీరినుండి విడిపోవుటే లక్ష్యంగా ఈ కోపముండేది. 'రేపు వీరినుండి విడిపోయి స్వేచ్ఛగా జీవిస్తానంటూ' తన స్టేటస్ లో పెట్టుకుని వికటహాసం చేసేవాడు. చూచిన ప్రతివారూ ఈయన మతి చెడినవాడని భావించే రకంగా ప్రవర్తన ఉండేది. అత్తమామలు తమ కూతురుని చంపేస్తాడని భావించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. చివరికి వారి కూతురికి భర్త లేకున్నా ఇబ్బంది లేదు అనే స్థితికి వచ్చారు. ఇదంతా సురేఖ మానసిక వ్యధకు కారణమైంది.

చి|| సౌ|| పూజలో భక్తి, సమర్పణా భావం పెంపొందించుటకై ఈ లీల జరిగింది. పూజ కూడా తన భర్త ప్రవర్తన వలన విల విలా కొట్టుకుంది. ఏ క్షణం ఎలా జరుగునో తెలియక భయకంపితురాలైంది. గజగజ వణకసాగింది, ఎంతో దుఃఖించింది. మా కోడలు పూజకు సురేఖ అండగా నిలిచి ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పసాగింది. నేను మాత్రం నీలో భక్తి పెంపొందించుటకు ఈ బాధలని చెప్పి ఆ దిశగా అడుగులు వేయమన్నాను. శ్రీవేంకటేశ్వరుడు కూడా పూజలో మార్పే ప్రధానాంశమంటూ కొన్ని లీలలు ప్రసాదించాడు. ఈ కాలంలో పూజ నరకయాతన అనుభవించింది, కుటుంబ విచ్ఛిన్న సందర్భాలు ఎన్నో చవి చూచింది. తన భర్తను బాగు చేయుటకు ఎంత ప్రయత్నించినా సఫలము కాలేదు. చివరికి నా సూచన మేర తన మనస్సు మార్చుకుని, ఒక కళ్యాణము చేసి భక్తిని అలవరచుకుంటానంటూ ప్రతిజ్ఞ చేసిన తరువాత అంతా సర్దుకుంది. ఈ మొత్తం లీలలో సురేఖ తన కొడుకు జీవితముకై దుఃఖిస్తూ తన కర్మఫలం అనుభవించింది. చివరికి సురేఖ కూడా నా ఆజ్ఞ మేర శ్రీవేంకటేశ్వరుణ్ణి గట్టిగా పట్టుకుని బయట పడ్డది.

## ధన వ్యయానికి వెరవని స్థితి కల్పించుట

స్వామివారి లీలలను లౌకికంగా అర్థం చేసుకోలేదు. మరియు ప్రతిలీలకు అర్థం, పరమార్థం ఉంటుంది. మా కొడుకు వాని అత్తమామలను హింసించుటకు గల కారణం

ఎంత వెతికినా తెలియలేదు. స్వామివారిని ప్రార్థించినప్పటికీ చెప్పలేదు. కాని ఏదో దోషం వారిలో ఉండబట్టే అలా జరుగుచున్నదని నా అంతరాత్మ చెప్పింది. దోష నివారణకు నా ప్రయత్నం ఫలించలేదు. చివరికి స్వామివారిని శరణు వేడగా ఇలా చెప్పారు.

నాకు ఇద్దరు కొడుకులు. వారికి వివాహాలు చేశాము. నూతన వ్యక్తులైన కోడళ్ళు మా ఇంటికి వచ్చారు. వారిని భక్తులుగా మార్చడం మరియు స్వామివారి సేవలకు ధన వ్యయానికి వెరవని స్థితి కల్పించుట ఈ లీల ప్రధాన లక్ష్యం. మాకున్న సర్వ సంపద స్వామివారికి సమర్పించబడ్డది. మేము కేర్ టేకర్ గా వ్యవహరిస్తూ అవసరమున్నంతనే వాడుకుందుము. కాని మా పెద్దకోడలు తల్లితండ్రులకు మేము స్వామి సేవకై ధనము ఖర్చు చేయుట ఇష్టము లేదు. తమ కూతురు అనుభవించ తగిన ఆస్తి తరిగిపోతుందని బాధ పడసాగారు. నిజానికి మా ఆస్తితో వీరికి ఎలాంటి సంబంధము లేదు. పెండ్లప్పుడు కూడా ఏమీ ఆశించలేదు. మీకిష్టమైంది మీ కూతురికి పెట్టుకోండి, మేము ముట్టమని చెప్పాము. అయినప్పటికీ ఉన్నవాళ్ళని పెండ్లి చేస్తే భగవంతుని సేవకే పూర్తిగా ఖర్చు చేస్తున్నారని బాధపడసాగారు. కాబట్టి నా కొడుకు తన అత్తమామలైన శ్రీమాన్ నాగిరెడ్డి సంజీవరెడ్డి, గీత దంపతులను వారి కూతురితో పాటు హింసించాడు. ఈ పిల్లవాడు సైకో, మా కూతురుని చంపేస్తాడని భావించి ఒక సందర్భంలో తెగతెంపుల వరకు వచ్చారు. నేను కూడా వాడి ప్రవర్తన చూచి వాడు సైకో అనే భావించాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మా పిల్లల బాగోగులను చూచుకుంటానని గతంలో మాట ఇచ్చారు, కాబట్టి ఏదో తెలియని మార్పు కోసమని పదే పదే భావించాను. స్వామివారిని ఎంత ప్రార్థించినా కారణం తెలపలేదు. చివరికి అనుకున్న మార్పు సాధించిన తరువాత స్వయంగా శ్రీవేంకటేశ్వరుడే దీనికి గల కారణమును జూన్ 2025 లో ఇలా చెప్పారు. ''వారికి స్వామి సేవకై డబ్బు ఖర్చు చేయుట ఇష్టం లేదు, మాకు ఎంతుంది, ఎంత తరిగిపోతుందని సదా బాధపడుచున్నారని'' చెప్పారు. మరియు ఈ కల్మష భావానికి వారిని దూరం పెట్టకుమని కూడా చెప్పారు. అప్పుడు కాని వారి హింసకు గల కారణం తెలిసింది. నిజానికి వారు మా ఇంటికి వచ్చినప్పుడు మాత్రమే ఈ కోపముండేది, మా కొడుకు వారింటికి పోయినప్పుడు ఉండేది కాదు. ఒకరకంగా వారి ఛాయను కూడా మాపై పడనీయలేదు. వారి తల్లితండ్రులతో మాట్లాడిన ప్రతిసారీ మా కోడలి మనస్తత్వంలో మార్పు ఉండేదట. అందుకే భార్యను కూడా హింసించాడు. మరో విషయం : మా కొడుకును పరిశీలించిన చాలామంది డాక్టర్లు ''ఇతడు కేవలం ఐదుగురి పైననే (భార్య, అత్తమామలు, తల్లితండ్రులు) కోపం చూపుతున్నాడు, అందరిపైన కాదు, సైకో అనలేము, ఏదో కారణంచేత చేస్తున్నాడన్నారు''. ఒకరకంగా వారు మా ఆస్తిని ఆశించినట్లయితే ''మిమ్ములను ఈ కుటుంబం నుండి శాశ్వతంగా దూరం చేస్తా''ననే సంకేతం ఇచ్చాడు. మరియు ఇదంతా కూడా సురేఖ తన కర్మఫలం అనుభవించుటకు, మరియు మా కుటుంబం మొత్తం స్వామివారి కైంకర్యాలకు డబ్బు ఖర్చుకై వెరవని స్థితిని కల్పించుటకు జరిగింది. నిజానికి మా సర్వసంపద స్వామివారికి 2002 సంవత్సరంలోనే అంకితమిచ్చాను. దానిని మా కుటుంబం మొత్తం గుర్తించుటకు ఈ లీల జరిగిందని భావించాను.

ఇక మా రెండవ కొడుకు అత్త మామలైన శ్రీమాన్ గుంటుక రవీందర్ రెడ్డి, రూపాదేవి దంపతులు స్వయంగా భక్తులు, వారి ఊరిలో అమ్మవారి ఆలయ నిర్వాహకులు. మరియు ఆమె కృపతో మాలాగా స్వప్న అనుభూతులు పొందుతుంటారు. వారితో సమస్య లేదు. రెండవ కోడలు చి|| సౌ|| ప్రణీతలో కూడా భక్తిని పెంపొందించమని ఒక సందర్భంలో చెప్పారు.

**ఇప్పుడు పైన చెప్పిన విషయాలను వివరంగా పరిశీలిద్దాం!**

## మరో భూ సమస్య

**తేది 29-08-2022 :** మాకు హైదరాబాద్ సమీపమున గల నాగారం, దమ్మాయిగూడలో 1 ఎకరం, 10 గుంటల భూమి ఉన్నది. దీనిని 2006 సంవత్సరంలో కొన్నాము. ఇది చెఱువు క్రింద డౌన్ లెవల్ లో ఉండుట వలన 2020 సంవత్సరంలో మేము, మా ప్రక్కవారు మట్టి నింపుకున్నాము. ఈ మట్టి నింపే క్రమంలో ఇద్దరి మధ్యన ఉన్న హద్దురాళ్ళు చెదిరిపోయాయి. అప్పుడు ప్రక్క భూమి వ్యక్తి తనదని చెప్పుచు 30 అడుగుల మేర నా భూమిలో కనీలు పాతాడు. నేను తీయబోతే ఎదురు తిరిగి కొప్పడుచున్నాడు. దీనితో నేను తేది 25-10-2021 నాడు మండల సర్వేకు అప్లై చేశాను. నాది, ప్రక్కవారిది వేరు వేరు సర్వే నెంబర్ లు కాబట్టి సర్వేతో తెలిపోతుందనుకున్నాను. కాని ఈ సర్వేయరు చాలా ఆలస్యం చేశాడు. ప్రక్క వ్యక్తికి నిలకడ లేదు కాబట్టి తేది 28-08-2022 నాడు ప్రైవేట్ సర్వే చేయగా తను నా భూమిలోనికి 30 అడుగుల పైన జరిగాడని తేలింది. క్రొత్త హద్దు రాళ్ళను పాతాము. తెల్లవారి వాటిని తీసివేసి దుర్భాషలాడాడు. దీనిని గమనించిన నేను ఇది మరో భూవివాదము కాగలదని భయపడ్డాను. ఇదే సమయంలో దీనిపైన వ్యామోహము మరింత పెరిగింది. ఫలితంగా భయం ఏర్పడ్డది. ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకోలేని స్థితి కలిగింది. ఈ భూ సమస్య కొరకు తిరిగేటప్పుడు నాలో ఏమాత్రం శక్తిలేని అల్పునిగా భావన కలిగేది. ఫలితంగా

మనస్సు అల్లకల్లోలం కాసాగింది. రోజూ స్వామివారిని దీనిని పరిష్కరించమని వేడుకునేవాణ్ణి. ఈ రోజు బాధతో స్వామివారిని ఇలా ప్రార్థించాను. ''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! భూ వివాద సమయాన మిమ్ములను ఏవిధంగా క్షణం విరామం లేకుండా ప్రార్థించుదునో అదేవిధముగా మీరిచ్చిన సంకల్పం నెరవేర్చుటకు మిమ్ములను ప్రార్థించెదను. మీ పాదాల సాక్షిగా ప్రమాణము చేసి చెప్పుచున్నాను. ఏ చిన్న లోపము చేయను. నా జీవిత ధ్యేయం మీ సంకల్ప సిద్ధి మాత్రమే'' అని ప్రమాణం చేశాను. మరియు ఈ భూ సమస్యను తీర్చమన్నాను. ఈ రోజు శ్రవణా నక్షత్రం కావడం నా భాగ్యం.

నా ప్రార్థనకు అనుగుణంగా స్వామివారు నా సమస్య తీర్చుదునని ఈ క్రింది లీలను చూపారు.

## స్వామి అభయం

ఈ ఉదయం 4.55 గంటలకు ఈ కల వచ్చింది. ఇది చాలా చిన్నది, కాని నా సమస్యలను తీర్చుదునని శ్రీవేంకటేశ్వరుడు అభయమిచ్చినట్లు అనిపించింది. చాలా సంతోషించాను. గత కొన్ని రోజుల నుండి నా దమ్మాయిగూడ భూ విషయమై చింతిస్తున్నాను. మనస్సు నిలకడగా లేదు. నా మనస్సు ఎలాంటి భూ సమస్యల పైకి పోకుండా సంకల్ప సిద్ధిపై మాత్రమే కేంద్రీకృతమయ్యేట్లు అనుగ్రహించమని మరి మరి వేడుకున్నాను. దీనితో పాటు నాకున్న మరో భూ సమస్యను కూడా తీర్చుమన్నాను. మరియు స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ప్రచురించుటకు అనుమతిని కూడా ఇవ్వమని దీనంగా వేడుకున్నాను. ఈ నాటి కలలో వీటన్నింటికి అభయమిచ్చారు.

**తేది 10-09-2022 కల :** మేము మొన్ననే తిరుపతి నుండి వచ్చామట. వచ్చినప్పుడు కొన్ని స్వామివారి ప్రసాదమైన లడ్డూలను తెచ్చాము. వాటిని భక్తులకు ఇవ్వదలచి ఒక సంచిలో పెట్టాము. ఈలోగా ఎవరో మరో భక్తులు కూడా స్వామివారి ప్రసాదమని కొన్ని లడ్డూలను ఇచ్చారు. వీటిని కూడా ఇదే సంచిలో మా లడ్డూల పైన పెట్టాము. ఈ రోజు నాకు స్వామివారి ప్రసాదమును తినాలనిపించింది. వెంటనే ఈ సంచి దగ్గరకు పోయి పైనున్న ఫ్రెష్ లడ్డూను కొంత ముక్క తుంచుకొని తిన్నాను. చాలా మధురమైన అనుభూతిని పొందాను. వెంటనే క్రింద ఉన్న మేము తెచ్చిన లడ్డూను కూడా కొంత ముక్క తిన్నాను. ఇది కూడా పాడు కాక బాగానే ఉన్నది. ఇది కళ్యాణపు పెద్ద లడ్డూ, సంచిలో క్రింద ఉన్నప్పటికీ ఇది చితికిపోలేదు, రుచి మారలేదు. దీని అనుభూతి పొందుచున్న సమయాన అలారం మ్రోగడంతో మెలకువ వచ్చుట జరిగింది.

**దీనర్థం :** స్వామివారు నా దమ్మాయిగూడ సమస్యతో పాటు అన్నింటిని తీర్చుదునని అభయమిచ్చాడని భావించాను. కొంత ధైర్యం వచ్చింది. కాని స్వామివారు మాత్రం ఈ సమస్యను ఉపయోగించి నాలో 'నా' అన్నది దానితో మరికొన్ని వికారాలను నశింప చేయుటకు, తగిన యోగ్యత సాధించుటకు ఉపయోగించదలచారు. అందుకని నేను మరింత భయపడేటట్లు నా బలహీనతల పైన దెబ్బలు కొట్టుట చిన్నగా ప్రారంభిస్తూ ఈ క్రింది లీల చూపారు.

**తేది 24-09-2022 కల :** ఈరోజు ఉదయం కలలో నేను పర్మిషన్ తీసుకుని ఒక ఇంటిని నిర్మిస్తున్నాను. ఇంతలో నా వద్దకు ఒక కార్పొరేటర్ వచ్చి నన్ను మరిన్ని డబ్బులు ఇవ్వమని, భవిష్యత్తులో సహాయపడుదునని బలవంతపెట్టాడు. నేను అతనికి ఇంతకుముందే కొంత ఇచ్చాను. కావున ఇంక ఇవ్వలేనని అన్నాను. మరియు ఆయన బలవంతాన్ని చూచి ''నేను అసలు ఈ ఇంటిని కట్టను, ఇలాగే అమ్మివేస్తాను'' అంటూ ఇంక నీకు ఇవ్వలేనని అన్నాను. నా భార్య కొంచెము దూరము నుండి దీనిని గమనిస్తున్నది. ఇంతే కల.

దీనిని పొందినప్పుడు అర్థం కాలేదు. కాని దీని నిజమైన అర్థం : నా భూ సమస్యలో చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందునని, వాటికి తాళలేక ఒక దశలో ఈ భూమిని ఇలాగే అమ్మేయుటకు ప్రయత్నించుదునని అర్థం.

## ఒక్క రూపాయి లేని రోజు

**తేది 28-09-2022 :** ఈ రోజు ఒక ప్రత్యేకమైన రోజు. ఒక గొప్ప విషయము నా జీవితములో జరిగింది.

ఈ రోజు నా వద్ద నాదంటూ ఒక్క రూపాయి లేదు, ఆస్తులు తప్ప. ఈ రోజు నా జీవితములో ఒక ప్రత్యేక అనుభూతిని అనుభవించాను. ప్రభూ! నేను నీ వాడిని, కాపాడమంటూ శ్రీవేంకటేశ్వరుని పాదాలను ఆర్తితో ఆశ్రయించాను. ఈ అనుభూతి మహా అద్భుతంగా ఉంది. అంతే కాకుండా తేది 05-10-2022, వచ్చే దసరా నుండి నా అనుభూతులను చదవటం ప్రారంభించి ఏప్రిల్-2023 నుండి శ్రీవేంకటేశం మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించుదునని మొదటిసారి నా భార్యతో చెప్పాను. దీనికామె ముందు కొంత విచారానికి గురైనప్పటికీ తరువాత తేరుకున్నది.

## భగవంతుడు ప్రసాదించింది కాదని తపనచే ఇతరమైనది ఎంచుకుని బాధ పడుట

ఈరోజు రెండు కలలు వచ్చాయి. ఈ రెండు కూడా దాదాపు ఒకే అర్థం కలిగి యున్నాయి. కాని ఈ అర్థం ఏమిటన్నది ఆ సమయాన నాకు అర్థం కాలేదు.

**మొదటి కల :** నేను మరియు ఇద్దరు బంధువులతో కలిసి

ఎక్కడికో ప్రయాణములో ఉన్నాము. మేము అత్యంత వేగంగా ప్రయాణించే బులెట్ ట్రైన్ లో ఉన్నాము. కాని ఒకానొక స్టేషన్ లో ఏదో సమస్య వలన ఈ ట్రైన్ ఆగిపోయింది. ఈ ప్రయాణం ఆగిపోవుటను భరించలేక, సమయం వృథా చేయుట ఇష్టం లేక ఆ ట్రైన్ దిగి నడక ప్రారంభించాము. నడుస్తూ ఉంటే కొండలు, గుట్టలు లాంటి ప్రదేశాలు వచ్చాయి. తెల్లని రంగుతో నున్నగా ఉన్న ఉపరితలముతో ఈ గుట్టలు ఉన్నవి. మేము ఒక చిన్నపాటి ఏటవాలుగా ఎత్తున్న ప్రదేశం ఎక్కి వెళ్ళుచున్నాము. కొద్ది దూరం వెళ్ళాక సడన్ గా ఇక ముందుకు వెళ్ళలేనట్లు ఈ కొండ అక్కడికే ఆగింది. క్రింద లోతైన ప్రదేశం కాబట్టి ముందుకు వెళ్ళలేము. దీనిని గమనించి కొంచెము వెనుకకు తిరిగి ప్రక్కన ఉన్న అత్యంత చిన్నదారి గుండా జాగ్రత్తగా ముందుకు ప్రయాణించాము. అప్పుడు ఈ ఆగిన ట్రైన్ బయలుదేరి పోవుటను గమనించాను. ఎందుకు దిగామనిపించింది కాని చేసేది లేక అట్లే ముందుకు వెళ్ళాము. ఇది మొదటి కల.

**రెండవ కల :** ఇందులో నేను, నాకు తెలిసిన వారితో కలిసి ఒక పెద్ద మైదానంలో జరిగే ఎగ్జిబిషన్ కు వెళ్ళాను. ఆ ఎగ్జిబిషన్ లో ప్రవేశించిన తరువాత ఎందుకో నచ్చక సమయం కంటే ముందే తిరిగి వెళ్ళాలని గేటు వరకు వచ్చాను. కాని దాని గేట్లు మూసివేశారు. అవి చాలా పెద్ద గేట్లు. ఒక 20 అడుగుల వెడల్పు, అంతే ఎత్తు కలిగి ఇనుముతో చేయబడి ఉన్నవి. వీటికి రంగులు వేయుటకై లోపలి నుండి కట్టెలు కట్టబడ్డవి (స్కఫోల్డింగ్). ఈ గేటు మూసి ఉండుట వలన బయటకు వెళ్ళలేకపోయాము. కొద్ది కాలము ఆగితే బహుశా తీసేవారేమో కాని మా తపన చేత కాలాన్ని వృథా చేయుట ఇష్టం లేక, ఈ కట్టెల సాయంతో ఇరవై అడుగుల గేటును ఎక్కి ముందువైపు దిగ చూచాను. కాని ఈ కట్టెలు ముందు వైపు కట్టి లేవు. లోన వైపు మాత్రమే కట్టారు. అందుకని పైన ఉన్న నేను క్రిందకు దిగలేకపోయాను, పడుదుననే భయము పట్టుకుంది. గేటుపైన కూడా ఎక్కువ కాలము ఉండలేను, కావున భయపడ్డాను. అరికాళ్ళ నుండి భయముతో కూడిన వణుకు పుట్టింది. తిరిగి లోపలి ప్రక్కనుండి క్రిందికి దిగగానే ఏదో పని నిమిత్తమై గేటు ప్రక్కన గల ఒక వికెట్ గేటు ఏదో




భగవంతుడు ప్రసాదించినది కాదని ఇతరమైనది కోరుకుని బాధపడుట (లీల 29-9-2022)

అవసర నిమిత్తము తెరువబడ్డది. నేను ఇదే అదునని భావించి దాని నుండి బయటికి వచ్చాను. కల చెదిరింది.

కాని దాని నిజమైన అర్థం ఇలా ఉంది.

ఓయీ! నీకు కల్పించిన పరిస్థితులను ఉపయోగించి అభ్యాస వైరాగ్యాల ద్వారా కొంతకాలం సాధన చేస్తే అనుకున్న స్థితి సిద్ధిస్తుందని చెప్పారు. కాని నేను మాత్రం కాలం వృథా చేయుట నచ్చక త్వరగా సాధించాలనే తపనతో వివిధ ప్రయత్నాలు చేసి భంగపడుటతో పాటు భయముచే వణుకు స్థితి కలుగునని చెప్పారు.

నిజానికి నాకు ఎదురైన ప్రతి సమస్య యోగ్యత సాధించుటకే నిర్దేశించిందని భావించిన నేను ఈ భూ సమస్యను 'నా' అన్నది నశింప చేసుకొనుటకు ఉపయోగిస్తూ సాధన చేయాలనుకున్నాను. అందుకే త్వరగా పూర్తి చేయాలని తపిస్తూ బాధపడ్డాను.

## అనుభూతుల ప్రచురణకు స్వామివారి మంగళా శాసనములు

నా జీవితములో ఎదురైన ప్రతి సంఘటన నా లక్ష్య సాధనకు ఉపయోగపడే విధంగా వాడుకోవాలనుకున్నాను. తేది 05-10-2022 బుధవారము రోజున దసరా శ్రవణా నక్షత్రము. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆవిర్భావం రోజు కావడం వలన స్వామివారికి పూజ చేసి గత 20 సంవత్సరాల నుండి చేసిన సేవలను నివేదిస్తూ ఇలా ప్రార్థించాను. ''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు నా ప్రభువు, నేను మీ సేవకుడను, నాకు మీరే ఈ జన్మను ప్రసాదించారు. నేను అత్యంత సాధారణ వ్యక్తినైనప్పటికీ, నాకు ఎన్నో అనుభూతులను కల్పించి, నాచే ఎన్నో పనులను చేయిస్తున్నారు. 2000 సంవత్సరం నుండి ప్రారంభమైన మీ లీలలు నేటికీ కొనసాగుచున్నవి. వీటి ప్రభావముచే మీకు, మీ భక్తులకు సేవలు చేస్తున్నాను. ప్రస్తుతం లక్ష్యసాధన దిశగా పయనిస్తున్నాననుకుంటున్నాను. ఇదంతా మీ అనుగ్రహము, మీ శక్తి వల్లనే సాధ్యమవుతుంది. లక్ష్య సాధనకు నా ఒక్కని శక్తి సరిపోదు. భాగవతుల ఆశీర్వాదముతో పాటు వారి శక్తులను కూడగట్టుకోవాలని నిర్ణయించుకున్నాను. అందులకు మీరు నాకు ప్రసాదించిన మొత్తం అనుభూతులను శ్రీవేంకటేశం మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించాలనుకున్నాను. ఇలా అనుభూతులను ప్రచురిస్తూ భాగవతుల శక్తులను ఆశీర్వాద రూపకంగా పొందదలచుకున్నాను. మరియు ఆసక్తి ఉన్న భక్తులకు హరినామ క్షేత్ర నిర్మాణములో అవకాశం ఇవ్వదలచుకున్నాను. అందుకు మిమ్ములను అనుమతించుమని, మరియు ఆశీర్వదించుమని వేడుకుంటున్నానని ప్రార్థించాను. తేది 05-10-2022 నాడు ఉదయం 11.19 గంటల నుండి నా అనుభూతులను చదువుట ప్రారంభించాను. స్వామివారు తప్పక నన్ను ఆశీర్వదించగలరనే విశ్వాసము నాలో ఉండెను.

అన్నట్లే తేది 07-10-2022 ఉదయం దాదాపు 5 గంటల ప్రాంతమున ఈ కల వచ్చింది. ఇందులో నేను ప్రారంభించబోయే ఒక కార్యక్రమానికి దివ్య ప్రబంధ పారాయణం చేసి మంగళా శాసనము చేయుటకు శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు వారి శిష్య బృందముతో వచ్చారు. ఇది ఒక అద్భుతమైన లీల ఈ విధముగా ఉన్నది.

**తేది 07-10-2022 కల :** అది మా ఇల్లు. ప్రస్తుతం మేము నివసిస్తున్న హైదరాబాద్ లోనిది లేదా ఊరిలోనిది కాదు. ఒక క్రొత్త ప్రాంతములో ఉన్నది. అది ఒక మెయిన్ రోడ్డు పైన ఉన్నది. నేను మా ఇంటి ముందు ఉన్న రోడ్డుపై నా అనుచరులతో నిలబడి ఏదో మాట్లాడుచున్నాను. పూజ దుస్తులు ధరించి ఉన్నాను. రేపు మా ఇంటిలో ఏదో ఒక పూజ కార్యక్రమమును ఏర్పాటు చేయాలి కావున తగిన ఏర్పాట్లలో మునిగి ఉన్నాను. మా ఇంటి ముందు చాలా పొడుగాటి రోడ్డు ఉన్నది. చాలా దూరము వరకు ఇరుప్రక్కల కనబడుచున్నది. ఇంతలో ఆ రోడ్డుకు చాలా దూరములో కొందరు భాగవతులు ముఖ్యముగా శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్




శ్రీ శ్రీ శ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామి వారు ఆశీర్వదించుట (లీల 7-10-2022)

స్వామివారి అనుచరులు కనబడ్డారు. వారు ఒక ఇంటి వద్ద ప్రబంధ పారాయణము చేసి ఆ యజమానిని ఆశీర్వదించారు. పిదప వారు మా ఇంటి వైపు వచ్చి నా వద్ద ఆగి నాతో ఇలా మాట్లాడారు. శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు ముఖ్యంగా నా కోసమే ఇక్కడికి వచ్చారట. రేపు ఇక్కడ ప్రబంధ పారాయణము జరిపించుట కోసమే వచ్చారని

అన్నారు. మీరు ఏదో కార్యక్రమము ప్రారంభిస్తున్నారట, అందుకోసమే వచ్చారని చెప్పి, రిహార్సల్ గా ఆ భక్తులు రెండు బృందాలుగా విడిపోయి ఎదురెదురుగా నిలిచి ప్రబంధాన్ని చదువ ప్రారంభించారు. ఇంతే కల.

స్వామివారు నా అనుభూతుల ప్రచురణకు మరియు భాగవతుల ఆశీర్వాదములను పొందుటకు ఒప్పుకుంటూ ఆశీర్వాదములు అందించారని భావించాను. ఎంతో సంతోషించాను.

## వైరాగ్య బీజం నాటుట - పవిత్రస్నానం చేయించుట

**తేది 13-10-2022 :** అనుభూతుల ప్రచురణకు వీలుగా నేను పొందిన మొత్తం అనుభూతులను మళ్ళీ ఒకసారి చదవాలనుకున్నాను. గతంలో స్వామివారి ఆజ్ఞ ప్రకారం 2000 సంవత్సరం నుండి తేది 12-02-2021 వరకు పొందిన మొత్తం అనుభూతులను ఒకసారి చదివినాను. ఇప్పుడు ఆ తరువాత పొందిన వాటిని ఒక పర్యాయం చదివి, ఆ తరువాత 2000 సంవత్సరం నుండి పొందిన మొత్తం అనుభూతులను మళ్ళీ ఒకసారి వరుస క్రమములో చదవవలెనని నిర్ణయించాను. అనుకున్నట్లే దసరా తేది 05-10-2022 నుండి తరువాత పొందిన వాటిని చదివాను. వీటిని నిన్నటివరకు అంటే తేది 12-10-2022 వరకు పూర్తి చేశాను. నిన్న సాయంత్రం ఇక రేపటినుండి మొదటి నుండి అంటే 2000 సంవత్సరం నుండి పొందిన అన్ని అనుభూతులను ప్రచురణకు వీలుగా ఒక పర్యాయం చదవాలని భావించాను.

ఈ అనుభూతుల ప్రచురణ అత్యంత ముఖ్యమైన విషయము. ఇదే నన్ను స్వామివారి సంకల్పములో గెలిపించు శక్తిని ప్రసాదించగలదు. కాబట్టి ఇది నా జీవితానికి ఒక మైలురాయి వంటిది, అత్యంత ముఖ్యమైనది అనుకున్నాను. అందుకని నా మనస్సును అన్యధా పోనివ్వక, శ్రీవేంకటేశ్వరుడే నా లక్ష్యం, అనే అభిప్రాయముతో చదవాలనుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు కూడా నా పట్టుదలను మరింత పటిష్ఠంగా పెంచి దృఢ సంకల్పముతో చేయమన్నాడు. మరియు దీనిని జీవన్మరణ సమస్య లాగా సృష్టించాడు. జీవితంపై వైరాగ్య స్థితి కల్పించాడు. వాటిని ఒకసారి చూద్దాం.

తేది 12-10-2022 సాయంత్రం మా డాక్టర్ గారు జనరల్ చెకప్ చేసి నా హృదయ నాళాలలో మల్టిపుల్ బ్లాక్స్ ఉన్నట్లు చెప్పారు. యాంజియోగ్రామ్ చేయవలెనని, దాని రిజల్టును బట్టి మళ్ళీ స్టంట్ వేయడమో లేదా మందులతో సరిపెట్టుటనో అవసరమని సూచించాడు. ఈ విషయం తెలిసిన వెంటనే నేను, నా భార్య చాలా బాధపడ్డాము, విరక్తికి లోనైనాము. నాకు మాత్రం ఇక జీవితం పైన ఆశ తగ్గింది. ఆస్తులు, అంతస్తులు ఎందుకు, ఈ భూమి, డబ్బు ఏమి చేయడానికనిపించింది. జీవితం పట్ల వైరాగ్యం ఏర్పడ్డది. చివరికి నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి తీవ్రంగా, రకరకాలుగా ప్రార్థించాను. ప్రభూ! నా జీవితంలో మీరు నాకు అప్పగించిన సంకల్పాన్ని నెరవేర్చేవరకు ఈ జీవితాన్ని కొనసాగించమన్నాను. ఈ జీవితములో మిమ్మల్ని పొంది, తనివితీరా దర్శించి, మీతో రెండు మాటలు మాట్లాడి, మీ పాదపూజ చేసి మిమ్ములను హరినామ క్షేత్రములో కూర్చుండబెట్టిన తరువాత అంటే హరినామక్షేత్రం ప్రారంభించిన తరువాత తీసుకు పోండన్నాను. అంతవరకు ఈ భూమి మీదనే ఉండనిచ్చి మీ సంకల్పాన్ని నెరవేర్చుటకు నా వంతు ప్రయత్నం చేయనివ్వండని పదే పదే వేడుకున్నాను. మరియు నా మనస్సును ఇతర విషయాల పట్ల మరల్చనని ప్రమాణం చేశాను. నాకున్న సర్వదాస్తిని మరోమారు ధారపోశాను. మా తోటబావి వద్ద గల మొత్తం పొలమును ధారపోస్తున్నానని, మీకు కావలసినంత తీసుకొమ్మని అన్నాను. మొత్తం హైదరాబాద్ మరియు ఊరిలో నాకున్న సమస్తం మీదేనన్నాను. చివరికి మిమ్మల్ని తనివితీరా దర్శించి, సంకల్పాన్ని నెరవేర్చిన తరువాత తీసుకుపొమ్మని వేడుకున్నాను.

దీనికి బదులుగా స్వామివారు ఒక పొంతన లేని ఈ క్రింది విధమైన కలను ప్రసాదించారు.

**తేది 13-10-2022 కల :** ఈ కలలో నేను ఒక చిన్నపిల్లవానితో కలిసి ఊరు బయట ఉన్న ఏటి లోనికి పవిత్ర స్నానానికి వెళ్ళాను. అందులో నీరు ప్రవహిస్తున్నది. ఒక దగ్గర ఈ ప్రవాహము వెడల్పుగా, కొంచెం బావిలాగా, అక్కడక్కడ మనము కూర్చుండుటకు, పట్టుకొనుటకు వీలైన బండలు ఉన్నవి. అక్కడ కొంచెం లోతుగా ఉన్నది. ఆ బావిలోని నీరు బయటికి ప్రవహిస్తున్నది. నీరు అతి పవిత్రంగా ఉన్నది. నీటి అడుగు భాగం కూడా స్పష్టంగా చూడగలము. అంతటి స్పష్టత కలిగి ఉన్నవి. నేను ధోవతి కట్టుకుని స్వామిని స్మరిస్తూ మూడు మునకలు వేసి నీటినుండి బయటకి వచ్చాను. ఇంటిలో ఏదో ఒక కార్యక్రమమును ప్రారంభించే ముందు పూజ లాంటి కార్యక్రమమును చేయుటకని ఆ అబ్బాయితో కలిసి ఇంటికి వెళ్ళసాగాను. ఆ అబ్బాయి కూడా అదృశ్య రూపుడే! ఇంతే కల.

## మరణశయ్యపై ఉన్న వ్యక్తి అంతా నిజమే చెబుతాడు, అబద్ధం చెప్పడు

**తేది 14-10-2022 :** ఈ రోజు గత 3 రోజుల నుండి జరిగిన

విషయాన్ని ఇలా పునరావృతం చేసుకున్నాను.

తేది 12-10-2022 నాడు, నా హృదయపు నాళాలలో మల్టిపుల్ బ్లాక్స్ ఉన్నవని డాక్టర్ గారు చెప్పారు. తొందరగా యాంజియోగ్రామ్ చేసి, స్టంట్ కాని, బైపాస్ కాని చేయవలసి ఉన్నదని చెప్పారు. ఆ మాట వినగానే నేను మరియు నా భార్య వైరాగ్యానికి గురైనాము. లోకంతో సంబంధం తెగిపోయినట్లు అనిపించింది. మరణం అందరికీ వస్తుంది, కాని అది మనవరకు వస్తేనే దాని విలువ తెలుస్తుంది. ఆ రోజు చాలా దీనంగా, స్వామివారిని మరీ మరీ ప్రార్థించాము. మిమ్ములను ఈ జన్మలో పొందే అవకాశమును కల్పించమని వేడుకున్నాను.

అదే రోజు రాత్రి కలలో నేను పూజ దుస్తులతో, ఏదో ఒక శుభకార్యాన్ని మొదలుపెట్టుటకు ముందు ఒక పవిత్ర తీర్థమునకు వెళ్ళి మూడు మునకలు వేశాను. దాని అర్థం నాకు తెలియలేదు.ఒకప్రక్కనాఆరోగ్యంబాగాలేదు,మరోప్రక్కపవిత్ర కార్యాన్ని మొదలుపెట్టుటకని పవిత్ర నదిలో స్నానం చేశాను. రెండు భిన్నమైన ధృవాలుగా తోచినవి. నా భార్య మాత్రం, తొందరగా హాస్పటల్స్ కు వెళ్ళి పరీక్షలు చేయించుకుందామనే ఆలోచనలతో ఉన్నది. నేను మాత్రం శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ లేనిది ఏదీ జరగదని భావించి, అదంతా స్వామివారి లీలగా భావించాను. నా భార్యకు స్వాంతన చేకూర్చే విధంగా ఏమీ కాదని ధైర్యం చెప్పాను. ఒక 20-25 రోజుల వరకు కొన్ని ఆయుర్వేద ఉపచారాలు వాడి తగ్గకుంటే వెళదామన్నాను. చివరికి ఆమె ఒప్పుకున్నది. ఇంతలో ఆ ఉదయం నా మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. గతంలో అంటే... 2009 సంవత్సరంలో స్వామివారి అనుభూతులను మొదటిసారి ప్రచురించు సమయాన, నాకంటూ ఏమీ దాచుకోకుండా, వ్యక్తిగత విషయాలు, కుటుంబ విషయాలు, ఇతరులకు తెలుపరానివి, తెలుపదగినవి అంటూ భేదం చూపకుండా తెలియపరచినందుకు సురేఖ నొచ్చుకున్నది. అయితే ఈసారి మాత్రం అలా కాకుండా మేము పొందిన, అనుభవించిన అన్ని విషయాలను తెలియపరిచేవి, తెలియపరచరానివని భేదభావం లేకుండా, ''మరణశయ్యపై ఉన్న వ్యక్తి చెప్పేది అన్నీ నిజాలే'' అనే చందంగా తెలియపరచవలెననే భావం ఏర్పడ్డది. ఈ విషయాన్ని నా భార్యకు చెప్పి, తాను ఏమాత్రం అడ్డురానని ప్రార్థించమన్నాను. అన్ని విషయాలు జరిగినవి జరిగినట్లు తెలుపుటకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్వామివారితో ప్రార్థించమన్నాను. మన జీవితం తెరచిన పుస్తకం లాగా ఉండాలని స్వామివారి అభిమతం అన్నాను. ఈ మాటను సురేఖతో చెప్పేటప్పుడు ఒక దివ్యశక్తి నాలో ప్రవేశించి నా చేత ఈ మాట అనిపిస్తున్నదన్న భావన కలిగింది. మరియు దీనిద్వారా నా శరీరము బాగుపడునని, హాస్పిటల్ కు వెళ్ళవలసిన పని లేదని, స్వామివారే అన్నీ చూచుకుంటారని చెప్పాను.

నేను కూడా స్వామివారితో ఇలాగే ప్రార్థించాను. నేను మీవాడినని, మీ సంకల్పాన్ని నెరవేర్చుటే నా ధ్యేయమని, అందుకే మరికొంత జీవితాన్ని భిక్ష పెట్టుమని ప్రార్థించాను. ఈ జీవితంలో మిమ్మల్ని పొంది, మీతో మాట్లాడి, మీ పాదపూజ చేసి, హరినామ క్షేత్రమును ఏర్పాటు చేసి, కనీసం రెండు సంవత్సరాలు నిర్వహించిన పిదప మీ ఇష్టం వచ్చినట్లు చేసుకొమ్మన్నాను. అంతవరకు ఆయురారోగ్యాలను ఇవ్వవలసిందిగా ప్రార్థించాను.

అంతేకాకుండా స్వామివారితో, నేను పొందిన అన్ని విషయాలు ఉన్నదున్నట్లు తెలుపుటకు, మరియు హరినామక్షేత్రం ఏర్పాటుకు అవసరమైన భూమితో పాటు కావలసినంత ధనమును ఖర్చుపెట్టుటకు వెనకాడకుండా నేను నా భార్యను ఒప్పించెదనని, ఇది నా బాధ్యతగా తీసుకుంటానని ప్రార్థించాను.

ఇక ఈ లీల ఏమౌతుందో చూడాలనుకున్నాను. కొన్ని ఆయుర్వేద ఉపచారాలను సేవిస్తూ, ప్రతిక్షణం స్వామివారిని అత్యంత దీనంగా ప్రార్థించుట మొదలు పెట్టాము. ఎలాగైనా స్వామి పరీక్షలో ఉత్తీర్ణుణ్ణి కావాలని, స్వామి సంకల్పాన్ని నెరవేర్చి తీరాలనే పట్టుదల నా నరనరాలలో జీర్ణించుకున్నది. దీనిని స్వామివారు ఒక చక్కని లీల ద్వారా నా హృదయములోని భావాన్ని అద్దం లాగా చూపెట్టారు.

## నాలోని పట్టుదలను చూపుట

**కల :** ఒక సమయంలో స్వామివారు నన్ను ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో ఎం.టెక్ లో చేర్పించారు. ఆధ్యాత్మిక విద్యను అభ్యసించి ఉత్తీర్ణుణ్ణి కమ్మన్నారు. కాని గత కొన్ని సంవత్సరాల నుండి అశ్రద్ధ వల్ల, కళాశాలకు సరిగా పోలేదు, పరీక్షలు వ్రాయలేదు, ఉత్తీర్ణుణ్ణి కాలేదు. కాని ఈ మధ్యన ఎలాగైనా ప్రతి తరగతికి తప్పక హాజరు కావాలని, పరీక్షలో ఉత్తీర్ణుడను కావాలనే పట్టుదల తారాస్థాయికి చేరింది. దీనిని స్వామివారు ఈ క్రింది లీల ద్వారా చూపారు.

**తేది 16-10-2022 కల :** ఈ మధ్యన నేను సరైన విధంగానే విద్యనభ్యసిస్తున్నాను. కాని ఒక రోజు కొన్ని కారణాల వల్ల కళాశాలకు పోవుట ఆలస్యమైంది. సమయం దాటింది కాబట్టి కళాశాలలోని కారిడార్ లో మా తరగతి గదికి వెళ్ళే మార్గమును కొలాప్సిబుల్ గేటు ద్వారా మూసివేశారు. ఎంత బ్రతిమలాడినా లోనికి పోనీయలేదు. ఎలాగైనా తరగతి లోని పాఠాలను విని తీరాలని భావించాను. ఇంతలో స్వామి కృపతో చక్కని ఆలోచన వచ్చింది. నేను ఆ కళాశాల ఛత్ పైకి ఎక్కాను.




బయట వ్రేలాడుచు పాఠాలు వినుట (లీల 16-10-2022)

ఆ తరువాత మా తరగతి ఎక్కడుందో గుర్తించి, ఒక త్రాడు సహాయముతో ఆ తరగతి కిటీకి బయటి ప్రక్క వ్రేలాడాను. ఆ తరువాత కిటికీని ఆసరాగా చేసుకొని, అక్కడనే నిలబడి లోన జరిగే విషయములను తెలుసుకున్నాను. లోన నాతోపాటు చదువుచున్న తోటి విద్యార్థులను చూచాను. నేను రాకముందు ఏ విషయము చెప్పారో వారిని అడిగి తెలుసుకున్నాను. ఇంతే కల.

ఈ విధంగా స్వామివారి సంకల్పం ఏ విధంగానైనా నెరవేర్చాలని సాధన జరుగుచున్నది.

ఈ కాలములో జరిగిన కళ్యాణాలు : 21వ కళ్యాణం నుండి 27 వ కళ్యాణం వరకు మొత్తం 7 కళ్యాణాలు జరిగాయి.

**నా దశ :** అడ్డుగా ఉన్న మాయ తొలగిపోయింది. స్వామివారిని చిన్నగుండవెల్లిలో స్థిరనివాసం కోసం ఊరందరిచే ప్రార్థింప చేశాను. హరినామ క్షేత్రానికి 'ఏకాంగి'గా నియమించారు. అనుభూతులు ప్రచురించుమన్నారు. కఠిన శిక్షణ జరుగుచున్నది.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా మిమ్మల్ని భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1.హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-2717505**


---

# హరినామక్షేత్రానికి స్వామివారి ఆజ్ఞ

తిరుమల ప్రతిరూప ఆలయమైన హరినామక్షేత్రం నిర్మించుటకు ఎట్టకేలకు తిరుమల స్వామివారు ఆజ్ఞ ఇచ్చారని తెలుపుటకు సంతోషిస్తున్నాము. శ్రీశ్రీశ్రీ దేవనాథ్ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణ, మంగళాశాసనములతో శ్రీ పరాభవ నామ సంవత్సర నిజ జ్యేష్ఠ మాస, కృష్ణపక్ష తృతీయ గురువారం శ్రవణా నక్షత్ర యుక్త శుభ కర్కాటక లగ్నము నందు అనగా తేది 02-07-2026 ఉదయం 8.46 గంటలకు వైఖానస భగవత్ శాస్త్రోక్తంగా నిర్ణయింపబడినది. దీనిని స్వామికృపతో చిన్నగుండవెల్లి (సిద్ధిపేట) లో మా తోట బావి వద్ద శ్రీమాన్ రమణాచారి గారి నేతృత్వములో తిరుమల వైఖానస పండితులచే శంకుస్థాపన చేయబడును.

ఆసక్తి గల భక్తులు స్వామికి అత్యంత ప్రియమైన ఈ ఆలయ నిర్మాణములో ఏ విధంగానైనా పాలు పంచుకుని శ్రీవేంకటేశ్వరుని కృపను పొందగలరని ఆశిస్తున్నాము.

**గోవింద దాసు, (పుల్లగూర్ల సాయిరెడ్డి) 9348212354**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి
పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# అమృతోత్పాదకుడు కూర్మావతారుడు

– చిల్లర సీతారామారావు

**పద్యం।। "అమృతోత్పాదన యత్నులై విబుధ దైత్యానీకముల్ మందరా**
**గము గవ్వంబుగా జేసి యబ్ధి దరువంగా గవ్వపుం గొండ వా**
**ర్థి మునుంగన్ హరి కూర్మరూపమున నద్రిం దాల్చె దత్పర్వత**
**భ్రమణ వ్యాజత వీపు దీట శమియింపం జేయగా నారదా!"**

పూర్వం దేవతలు, రాక్షసులు అమృతమును సాధించే ప్రయత్నంలో మందరగిరిని కవ్వముగా చేసుకొని క్షీరసాగరాన్ని మధించారు. ఆ కవ్వపు కొండ, కడలి నడుమ మునిగిపోయింది. అప్పుడు శ్రీమన్నారాయణుడు తన వీపు దురద తొలగించుకోవడానికా అన్నట్లు గిరగిరా తిరుగుతున్న గిరిని, కూర్మరూపమును దాల్చి తన వీపున ధరించాడు అని బ్రహ్మ నారదుడికి తెలియజేశాడు.

కూర్మావతార ఆవిర్భావం క్షీరసాగర మథన సమయంలో జరిగింది. శ్రీమన్నారాయణుడు కూర్మావతారమును ధరించి, దేవతలకు అమృతమును ఉద్భవింపచేసి, పంచిపెట్టిన కథా విశేషములను ఒకసారి స్మరించుకుని తరిద్దాం. కూర్మావతార గాథను చదివిననూ, వినిననూ సమస్త పాపములు నశించిపోతాయి.

**శ్లో ।। "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"**

సత్పురుషులను పరిరక్షించుటకు, దుష్టులను రూపు మాపుటకు, ధర్మమును సుస్థిరమొనర్చుటకును, ప్రతి యుగమునందు అవతరిస్తుంటాను అని భగవంతుడు

స్వయముగా చెప్పాడు. ''అవతి భక్తాం స్తారయతి పతితాం శ్చేతి అవతారః'' అనగా భక్తులను రక్షించుట, పాపులను ఉద్ధరించుట అవతారము యొక్క ప్రయోజనము అని స్పష్టమవుతున్నది. భగవంతుని అవతారములలో ముఖ్యమైనవి పది అవతారములు.

**శ్లో ॥ "మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహోఽథ వామనః**
**రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కిచ తే దశః"**

మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, రామ, బలరామ, కృష్ణ, కల్కి అనునవి ముఖ్యమైనవి పది అవతారములు.

గర్గ సంహిత శ్రీహరి పది అవతారములను ఇలా వివరించింది.

**శ్లో ॥ "అంశాంశోంఽశస్తథావేశః కలాపూర్ణః ప్రకధ్యతే**
**వ్యాసాద్యైశ్చ స్మృతః షష్ఠః పరిపూర్ణతమః స్వయమ్"**

అంశాంశ అవతారం, అంశావతారం, ఆవేశావతారం, కలావతారము, పూర్ణావతారము, పరిపూర్ణావతారము అని భగవంతుడి అవతారములు ఆరు రకములుగా ఉంటాయి.

1. అంశాంశ అవతారం – బ్రహ్మాదుల ఆజ్ఞకు లోనై, కార్యభారమును వహించు ప్రజాపతుల అవతారమును అంశాంశ అవతారము అని అంటారు.
2. అంశావతారము – భగవంతుడి ఆజ్ఞకు లోనై సృష్టిని చేసే అవతారములను అంశావతారములు అని అంటారు.
3. ఆవేశావతారము – భగవంతుని శక్తులు ఎవరిలో ఉంటాయో, ఆ అవతారాలను ఆవేశావతారములు అని అంటారు.
4. కలావతారము – భగవంతుని తత్వానికి అనుగుణంగా, ధర్మమును బోధించడానికి అవతరించిన అవతారము కలావతారము.
5. పూర్ణావతారము – నవరసాలకు ఆటపట్టుగా ఉండే అవతారం పూర్ణావతారం.
6. పరిపూర్ణావతారము – తన తేజస్సులో సర్వ తేజస్సులను లీనం చేసుకుని, జ్ఞాన సంపన్నమై కనిపించే అవతారమును పరిపూర్ణావతారము అని అంటారు.

మహర్షి మరీచి మున్నగు వారిని అంశాంశ అవతారము అని, బ్రహ్మాది దేవ శిరోమణులు అంశావతారమని, కపిల, కూర్మాదులను కలావతారమని, పరశురాముడు మున్నగు అవతారములు ఆవేశ అవతారము అని, నృసింహ, రామ, హరి, నర నారాయణుల అవతారములు పూర్ణావతారములని, శ్రీకృష్ణావతారము పరిపూర్ణావతారమని గర్గ సంహిత పేర్కొనుచున్నది.

కలావతారమైన కూర్మావతారము విశిష్ట అవతారం. ఒకసారి దూర్వాస మహర్షి వైకుంఠమునకు వెళ్ళి శ్రీమన్నారాయణుడిని దర్శించుకుని స్తుతించాడు. విష్ణుమూర్తి దూర్వాస మహర్షికి పారిజాత పుష్పమును బహూకరించాడు. ఆ పుష్పమును తీసుకుని వస్తుండగా మార్గమధ్యమున విద్యాధర కాంతలు మహర్షిని చూచి భక్తి శ్రద్ధలతో వందనమాచరించి తమ వద్ద ఉన్న పుష్ప మాలికలను సమర్పిస్తారు. ఆయన వారిని ఆశీర్వదించి ఆ పూల మాలికలను తీసుకుని పయనమవుతుండగా, నందనోద్యానమున ఐరావతమునెక్కి విహరించి తిరిగి వస్తున్న ఇంద్రుడు దూర్వాస మహర్షిని చూచి నమస్కరిస్తాడు. దూర్వాసమహర్షి ప్రసన్నుడై తన వద్ద ఉన్న పూలమాలికలను ఇంద్రుడికి బహూకరిస్తాడు. మహాత్ములు ప్రేమతో అనుగ్రహించిన దానిని ప్రసాదముగా స్వీకరించాలి. స్వీకరించక నిర్లక్ష్య భావన ప్రదర్శిస్తే దాని ఫలితము వేరొక విధముగా ఉంటుంది. దూర్వాస మహర్షి బహూకరించిన పుష్పమాలికలను ఇంద్రుడు నిర్లక్ష్యముతో ఐరావతము శిరముపై ఉంచుతాడు. పుష్పముల పరిమళమునకు భ్రమసి పలు తుమ్మెదలు పుష్పములపై వాలి ఝుంకారములు చేయసాగాయి. తుమ్మెదల ఝుంకారమునకు ఆగ్రహించిన ఐరావతము తన తొండముతో వాటిని తీసి క్రిందపడవేసి తన పాదములతో అణచివేస్తుంది. సర్వశుభముల నొసగు పూలమాలను పతనము గావించుట తిలకించిన దూర్వాస మహర్షికి అమితమైన ఆగ్రహం కలిగింది.

**శ్లో ॥ "మయాదత్తా మిమాం మాలాం యస్మాన్న బహుమన్యసే**
**త్రైలోక్య శ్రీరతో మూఢ వినాశముపయా స్యాతి"**
**"మ దత్తా భవతా యస్మాత్ క్షిప్తా మాలా మహీతలే**
**తస్మాత్ ప్రణస్ట లక్ష్మీకం త్రైలోక్యం తే భవిష్యతి"**

ఓరీ మూఢుడా! ప్రేమతో నేను ఇచ్చిన మాలను నిర్లక్ష్యముతో అగౌరవపరచావు. ఫలితముగా నీ సర్వసంపదలు నశించిపోవు గాక. నేను ఇచ్చిన పూలమాలను అగౌరవ భావనతో ఏనుగు శిరముపైవిసరివేశావు. ఆ ఏనుగు ఆ పూలమాలను క్రిందపడవేసి కాలితో నలిపివేసింది. మదోన్మత్తుడవై నీవు గావించిన ఈ కార్యమునకు నీ ఐశ్వర్యమంతా గంగపాలవుగాక. ఏనుగు తల ఖండితమవుగాక అని శపించాడు. శాపఫలితముగా ఇంద్రుడి సమస్త సంపద సముద్రము పాలయింది. ఏనుగు శిరము ఖండింపబడి వినాయకుడి మొండెమునకు అతకబడింది. అందువలన వినాయకుడిని గజాననుడు అని పిలుస్తారు.

దూర్వాస మహర్షి శాపముతో సమస్త సంపదలు నశించి, రాజ్యము శత్రువుల పాలు గావటముతో ఇంద్రుడు మున్నగు దేవతలు తమను రక్షింపవలసినదని బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ప్రార్థిస్తారు. బ్రహ్మ ఇంద్రుడు మున్నగు దేవతలను రక్షించువాడు విష్ణుభగవానుడొక్కడే అని భావించి, వారిని

తీసుకుని విష్ణుభగవానుని దగ్గరకు వెళతాడు. బ్రహ్మాది దేవతలు రక్షించమని విష్ణుభగవానుని పలు విధములుగా స్తుతిస్తారు. వారి ప్రార్థనలకు ప్రసన్నుడైన విష్ణుభగవానుడు వారితో – దేవతలారా! నేను మీకు శుభములను కలుగచేస్తాను. నా పలుకులను సావధానముగా వినండి. ప్రస్తుతము మీ పరిస్థితి బాగుగా లేదు. కనుక మీకున్నది ఒక్కటే మార్గము. మీరు ఇపుడే వెళ్ళి దానవులతో సంధి చేసుకొనండి. ఒక గొప్ప మహత్కార్యము నిర్వహించాలనుకున్నప్పుడు, మహత్ప్రయోజనమును పొందవలెనని అనుకున్నప్పుడు శత్రువులతో సంధి చేసుకోవడం అత్యంత ఆవశ్యకము.

**శ్లో ॥ "అరయోఽపి సంధేయాస్సతి కార్యార్థ గౌరవే**
**అహి మూషక వద్దేవా హ్యర్థస్య పదవీం గతైః"**

సాధించవలసిన కార్యము అత్యంత ప్రయోజనకారి అయినప్పుడు, దానిని నెరవేర్చుకోవడానికి శత్రువుతో సంధి చేసుకొనక తప్పదు. ప్రయోజనము సిద్ధించిన తరువాత పాము-ఎలుకల వలె శత్రుత్వమును ప్రదర్శించుకొనవచ్చును. మీరు బలపరాక్రమాదులు, ఉత్సాహము తిరిగి పొందాలంటే మీకు అమృతపానము చాలా అవసరము. మీరు అమృతోత్పాదనకు ప్రయత్నించండి. అమృతం త్రాగిన ప్రాణి మృత్యుగ్రస్తుడైననూ మరణించదు. క్షీరసాగరమున గుల్మ, తృణ, లత ఔషధులను పడవేయండి. మందర పర్వతమును కవ్వముగా చేయండి. వాసుకిని త్రాడుగా చేసుకోండి. నా సహాయమున మీరు శ్రమలేనివారై పాల సముద్రమును మథించండి. రాక్షసులకు దుఃఖము కలుగుతుంది. దేవతలకు సుఖం కలుగుతుంది. దేవతలారా! రాక్షసులు ఏది కోరిననూ దానికి మీరు ఆమోద ముద్ర వేయండి. 'నసరం భేణ సిధ్యంతి సర్వేఽర్థా సాంత్వయా యథా' సకల కార్యములు మంచితనముతో సిద్ధిస్తాయి. కాని కోపము వలన అవి సిద్ధించవు. మథన సమయమున కాలకూట విషము పుడుతుంది. దానికి మీరు భయపడకండి. దాని తర్వాత ఉద్భవించే పదార్థముల యెడల లోభము, కామము, రోషమును చూపించకండి అని పలికి విష్ణుభగవానుడు అదృశ్యమవుతాడు.

విష్ణుభగవానుని వచనానుసారం దేవతలు వైరభావం వీడి రాక్షసరాజైన బలిని కలుసుకుని ప్రేమతో మాట్లాడుతూ స్నేహ హస్తమును చాచారు. రాక్షసరాజు బలి దేవతల ప్రవర్తనకు ముగ్ధుడై వారితో సంధికి అంగీకరించాడు. దేవతలు రాక్షసులకు అనేక బహుమానములను ఇచ్చి వారిని ఆనందింపచేశారు. కొన్ని రోజుల తర్వాత ఇంద్రుడు రాక్షసవీరులను సమావేశపరచి వారితో ఇలా అన్నాడు. మిత్రులారా! మనందరం కలిసి పాల సముద్రమును మథించాలి. పాల సముద్రమును మథిస్తే అమృతం పుడుతుంది. ఆ అమృతమును త్రాగితే జరా మృత్యువులు గాని, ఆధి వ్యాధులు గాని సంభవింపవు. మనందరం అక్కా చెల్లెండ్ర సంతానం. మనలో మనం కలహించుకొనడం వ్యర్థము. మనందరం కలిసి అమృతమును సాధించి సేవిద్దాం. జరా మృత్యు భయాలు లేకుండా ఆనందంగా జీవిద్దాం. అమృత మహత్త్వమును తెలుసుకొనిన రాక్షసులు దేవతలతో కలిసి క్షీరసాగర మథనానికి అంగీకరించారు.

దేవదానవులు కలిసి మందర పర్వతము దగ్గరకు వెళ్ళి దానిని పెకలించారు. సురాసురులు దానిని మోసుకుంటూ సముద్రము వైపు బయలుదేరారు. పర్వతము బరువును మోయలేక సురాసురులు అలసిపోయి దానిని క్రింద పడవేశారు. అలా క్రింద పడవేయడంతో సురాసురులు చాలామంది మరణించారు. వారంతా నిరాశకు లోనై శ్రీహరిని స్మరించుకొని స్తుతించారు. శ్రీహరి వారి ప్రార్థనలకు ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. కరుణా దృష్టితో వారివైపు చూశాడు. దానితో సురాసురులు ఆరోగ్యవంతులు, శోకరహితులు అయ్యారు. పర్వతం క్రిందపడి మరణించినవారు పునర్జీవితులు అయ్యారు. అందరూ చూస్తూ ఉండగానే విష్ణువు మందర పర్వతమును ఎత్తి గరుత్మంతుడి వీపు మీద పెట్టాడు. గరుత్మంతుడు ఆ పర్వతమును సముద్రము ఒడ్డున దింపి తన నివాసానికి వెళ్ళిపోయాడు. సురాసురులు వాసుకిని కలుసుకుని వచ్చే అమృతమునందు సగభాగము నిచ్చెదమని వాగ్దానము చేసి, ఆయనను ఒప్పించి పర్వతమునకు త్రాడుగా చుట్టారు. పిదప మందరపర్వతమును సముద్రములో పడవేసి మథించుటకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వాసుకి ముఖము వైపు దానవులు, తోకవైపు దేవతలు నిల్చున్నారు. ఇరువురు కలిసి పరమానందముతో సాగరమును మథించసాగారు. ఎటువంటి ఆధారము లేని ఆ పర్వతము చాలా బరువు కలిగినది కావడము చేత సురాసురులు ఎంత బలముగా పట్టుకున్ననూ అది సముద్రపు జలములలో మునిగిపోయింది. సురాసురులు దిగాలుగా చతికిలపడిపోయారు. ఇది విఘ్నేశ్వరుడి పనే అని భావించిన శ్రీహరి సముద్రపు అడుగున జలములలోనికి ప్రవేశించి లక్ష యోజనముల వైశాల్యము గల తాబేలు రూపమును దాల్చి తన పృష్ఠ ప్రదేశమున మందర పర్వతమును ఉంచుకొని దానిని పైకెత్తాడు. పైకి లేచిన పర్వతమును చూచి సురాసురులు ఆనందముతో, తమ భుజ బలములతో సముద్రమును మథించసాగారు. మథించు సమయములో సురాసురులకు అలసట రానివ్వకుండా చల్లదనము కొరకు మేఘములను వర్షింపచేశాడు. చల్లగాలులు వీచునట్లు చేశాడు. వాసుకికి నిద్రా సౌకర్యము కల్పించాడు శ్రీహరి. సురాసురులు సముద్రమును మథిస్తుండగా

కాలకూటము, కామధేనువు, పారిజాతము, హరిచందనము, మందారము మున్నగు కల్పవృక్షములు, కౌస్తుభమణి, అమృత కలశముతో ధన్వంతరి, చంద్రుడు, ఐరావతము, ఉచ్చైశ్రవము, శారంగము, లక్ష్మీదేవి, రంభాది అప్సరసలు, వారుణి, శంఖము మున్నగునవి సముద్రము నుండి వెలువడినాయి. వాటిల్లో కాలకూటమును శివుడు, లక్ష్మీదేవిని శ్రీమహావిష్ణువు, కామధేనువును మహర్షులు, కౌస్తుభమణిని శ్రీహరి, ఉచ్చైశ్రవమును, వారుణిని రాక్షసులు, ఐరావతమును ఇంద్రుడు స్వీకరించారు. అమృతముతో నిండియున్న కలశమును చేతితో పట్టుకొని వెలువడిన ధన్వంతరిని చూచిన రాక్షసులు ఆ అమృతము తమకే దక్కాలని భావించి ధన్వంతరి చేతిలోని అమృత కలశమును బలవంతముగా లాక్కొని తమవెంట తీసుకొని పోయారు. నేను ముందు అమృతమును త్రాగాలి, కాదు నేను ముందు త్రాగాలి అని అరుపులు, కేకలు వేసుకుటూ తమకు లభించిన కలశమును దానవులు ఒకరి చేతుల నుండి మరొకరు లాగుతూ కలహించుకోవడం ఆరంభించారు. అమృతము రాక్షసుల పాలైందేనని దిగాలుపడుతూ, దుఃఖిస్తూ కూర్చుండిపోయారు దేవతలు.

శ్రీహరి సకలోపాయములు తెలిసిన సర్వ సమర్థుడు. రాక్షసులు కలహించుకుంటున్న తరుణములో వారిమధ్య వర్ణించ శక్యము గాని అందమైన యువతి రూపములో ప్రత్యక్షమయ్యాడు. ఆ యువతిని చూడగానే రాక్షసుల హృదయములో మన్మథుడు ఉదయించాడు. వారు ఆ యువతిని పలకరిస్తూ – సుందరీ ఎవరు నీవు? ఎవరివైతే నేమి? సురాసురులమైన మేము జ్ఞాతులము. అయిననూ ఒక వస్తువు విషయమై పోటీ పడుతున్నాము. నీవు మా మధ్య గల వైర భావమును తొలగించి సుఖమును ప్రసాదించుము. మేమందరం కలిసి అమృతం కొరకు ప్రయత్నించాము. మా మధ్య కలహము రానివ్వకుండా అమృతమును పంచిపెట్టుము. పంచిపెట్టుటలో భేదబుద్ధికి తావు ఉండనేరాదు అని అడిగారు రాక్షసులు. మోహిని జవాబిస్తూ మీ కోరిక ప్రకారము అందరికీ సమానముగా, ఎటువంటి భేదభావము లేకుండా పంచి పెడతాను. అమృతమును పంచి పెడుతున్నప్పుడు మంచి జరిగినా, చెడు జరిగినా మీరు నన్ను ఏమీ అనకూడదు. దానికి మీరు అంగీకరిస్తే నేను అమృతమును మీకందరికీ సమానముగా పంచిపెడతాను అని పలికింది. ఆమె మాటలకు సురాసురులు అంగీకరించారు.

సురాసురులకు అమృతమును సమానముగా పంచి పెట్టడానికి దేవతలను, రాక్షసులను వేరు వేరు పంక్తులను ఏర్పాటు చేసి కూర్చుండబెట్టింది. రాక్షసుల దగ్గరకు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ప్రవేశించి, కలశములో పైభాగమున నీళ్ళలాగా ఉన్నది. దానిని ముందుగా దేవతలకు పోస్తాను. కలశము క్రింది భాగములో మధురమైన, శ్రేష్ఠమైన అమృతము ఉన్నది. దానిని మీకు అందిస్తాను అని పలికి వారి అనుమతితో ఆ యువతి అమృతమును దేవతలకు పోయసాగింది. యువతి మోసమును గ్రహించిన రాహువు అను రాక్షసుడు చంద్రుని రూపము ధరించి దేవతల పంక్తిలో కూర్చున్నాడు. దానిని గమనించని యువతి రాహువుకు అమృతము పోసింది. రాహువును గుర్తుపట్టిన సూర్యచంద్రులు యువతికి ఆ విషయమును తెలియజేశారు. వెంటనే యువతి రూపములో ఉన్న శ్రీహరి తన చక్రముతో రాహువు శరీరమును ఖండించాడు. అప్పటికే అమృతము అతని నోటినుండి గొంతులోనికి జారిపోవడం చేత, అమృతపానము చేసినట్లై, అతడు మృతి చెందక, అతని శిరస్సు ఆకాశములో విహరించసాగింది. బ్రహ్మ రాహువు శిరమును గ్రహాల వరుసలో చేర్చి గ్రహరూపములో ఉండేటట్లు అనుగ్రహించాడు. పూర్ణిమ, అమావాస్య తిథులందు రాహువు సూర్య చంద్రుల వెంట పడటం జగద్విదితం. యువతి రూపంలో దేవతలందరికీ అమృతమును పంచి పెట్టిన తరువాత, ఆ రూపమును చాలించి స్వరూపమును ధరించాడు శ్రీహరి.

జరిగిన మోసమును గ్రహించిన రాక్షసులు దేవతలతో భయంకరమైన యుద్ధం చేశారు. బ్రహ్మదేవుడి ఆదేశానుసారం నారదుడు సురాసురులకు హితబోధ చేసి వారి యుద్ధమును ఆపు చేశాడు.

**శ్లో ॥ "పృష్ఠే భ్రామ్యద మంద మందరగిరి గ్రావాగ్ర కండూయనాత్**
**నిద్రాళోః కమఠాకృతేర్భగవతో శ్వాసానిలాః పాతువః**
**యత్సంస్కార కలానువర్తన వశాత్ వేలా నిభే నాంభ సామ్**
**యాతా యాతమతం ద్రితం జలనిధే ర్నాద్యాపి విశ్రామ్యతి"**

దేవదానవులు అమృతము కొరకు క్షీరసాగరమున, మందరపర్వతమును కవ్వముగా చేసి చిలుకునప్పుడు, మందరగిరి క్రుంగగా, శ్రీమన్నారాయణుడు కూర్మావతారమున ఆ పర్వతమును తన వీపున మోశాడు. ఆ సమయమున సురాసురులు చిలుకుచుండగా మందరగిరి శిలల రాపిడిచే స్వామికి దురద తీరగా నిద్ర వచ్చింది. నిద్రించుచున్న స్వామి వాయువులు వదిలినప్పుడు, ఆ వాయువుల తాకిడికి సముద్రపు అలలు పొంగి చెలియలికట్ట వరకు వెళ్ళుచు, తిరిగి వెనుకకు పోసాగినాయి. ఆ విధముగా సముద్ర జలమున రాకపోకలు అలవడటము వలన నేటికినీ సముద్రమున అలలు చెలియలికట్ట వరకు వచ్చుట, వెనుకకు మరలుట మానలేదు. అలా నిద్రించుచున్న స్వామి వాయువులు మమ్ములను రక్షించుగాక.

* * *




## గత సంచిక తరువాయి

అత్రి మహర్షికి కారణాంతరాల వల్ల పుట్టినవాడు దత్తాత్రేయుడు. గర్భవాసాన పుట్టినవాడు దూర్వాసుడు. అతడు బ్రహ్మజ్ఞాని. కోపస్వభావం అతడిది. ఉదాహరణకు, ఒకడు ఒక పద్ధతిలో మాట్లాడుతాడు; ఒకడేమో మరోలా మాట్లాడుతాడు. అలాగే ఒకడు ఒక విధంగా నడిస్తే, మరొకడు మరొక రీతిగా నడుస్తాడు. ఒకరి శరీరపు రంగు ఎలాగ వారికి సహజ స్వభావమో, అలాగే దూర్వాసునికి ఆయన కోపం కూడా. కానీ ఆ కోపం అహంకారం చేత వచ్చింది కాదు. ఆ కోపం వల్ల మహర్షులకుండేటటువంటి బ్రహ్మజ్ఞానానికేమీ లోటు కాని, మచ్చ కానీ లేదు. వాళ్ళ మహత్తుకేమీ లోటు లేదు.

దూర్వాసమహర్షి బ్రహ్మజ్ఞాని. బ్రహ్మవేత్త. బ్రహ్మదేవుడితో సమానమే. అయితే అట్టివాని క్రోధం ఒక్కొక్కమారు లోకంలో జీవుల యొక్క కర్మను ఎలాగ మార్చేందుకు అవకాశం ఉంటుందో, ఏయే సంఘటనలు ఎవరి కర్మ ప్రకారం అలా జరుగుతాయో చెప్పలేము. ఉదాహరణకు పిడుగులున్నాయి. ఆయుర్దాయం లేనివారి మీద పడితే చచ్చిపోతారు. ఆ పిడుగు, స్వభావంలో ఏ సంకల్పం లేకుండా దాని పని అది ఎలా చేస్తుంది? అలాగ ఎందుకు ప్రవర్తిస్తుందంటే ఎవరు కారణం చెపుతారు? అలాగే ఎవరో కీడు మూడినవాడు అక్కడికి వెళతాడు. దుర్వాసుడు కాని, మహర్షులు కాని క్రోధంతో కొన్ని పనులు చేసినా, ఎవరినైనా శపించినా, వీటన్నిటికీ కారణం లోకోపకారం ఏదో ఒకటి ఉంటుంది. దానికి దైవకార్య సమర్థత ఉన్నది. దైవకార్యం అంటే ఈశ్వరుని యొక్క సంకల్పం అని అర్థం.

ఈశ్వరుడి యొక్క సంకల్పం ప్రకారం ప్రతి జీవుడూ కష్టమో, సుఖమో, లాభమో, నష్టమో ఏదో ఒకటి అనుభవించి ముందుకు వెళ్ళాలి. ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళటమే దైవం యొక్క ఉద్దేశ్యము. ఈశ్వరుడికి ఒకటే సంకల్పం ఉంది. ఈ మనుష్యులందరూ కూడా వివేకాన్ని ఆశ్రయించి, జ్ఞానాన్ని కూడా ఆశ్రయించి, సత్కర్మానుష్ఠానం చేత పాపక్షయం కోసమని ఎక్కడెక్కడ కష్టపడాలో – ఆ కష్టాలు పడడం చేత ఎక్కడెక్కడ నష్టపోవాలో, ఆ నష్టాలు కూడా అనుభవించి, క్రమంగా ఆ కష్టసుఖాల్లోంచి జ్ఞానోదయమై, నా దగ్గరికి మళ్ళీ తిరిగి వత్తురు గాక అని ఈశ్వరుడి సంకల్పం.

మాయా సహిత బ్రహ్మ మనుష్యులను మోహంలో ఉంచి, వాళ్ళకు అభిమతాన్ని కలుగజేసి, అహంకార మమకారాలనిచ్చి తిప్పుతోంది కదా! ఇది ఇలా ఉన్నప్పటికీ కొందరు మోక్షాన్ని పొందుతున్నారు. ఎందుకంటే అది ఈశ్వర సంకల్పం కాబట్టి. ఏయే జీవులు ఎలా పరిణామం పొంది అక్కడికి వెళ్ళాలో ఆయా పరిణామ దశలలో వాళ్ళు పొందిన కష్ట సుఖాలకై ప్రకృతిలో ఈ పిడుగులు, వర్షాలు, కష్టాలు ఆ ఫలం చేత వస్తాయి. అయినప్పటికీ కూడా వాళ్ళ పరిణామంలో ఇలాంటి మహర్షుల అనుగ్రహం – శాప రూపంలో వచ్చినా అనుగ్రహమే. వాళ్ళు లాభమే పొందుతారు దానివల్ల. ఇప్పుడు చెప్పిన ఈ దైవ కార్యాన్ని పరోక్షంగా వాళ్ళే నడిపిస్తారు అని ధర్మసూక్ష్మం. భృగుమహర్షి విష్ణువును ''నువ్వు మానవుడిగా పుట్టు'' అని శపించాడు. అందువల్లనే ఆయన అవతారంగా వచ్చాడు. మహర్షులు ఏమి చేసినా అది లోక కళ్యాణమే అవుతుంది. క్రోధం అనేది అక్కడ కారణంగా కనబడుతుంది గాని, అజ్ఞానం, స్వార్థం ఆయనలో లేవు. ఒకవేళ అంత అహంకారంతోనూ అనేకమందిని శపించినా కూడా తరగని తపస్సు, జ్ఞానమూ మహర్షులవి.

కుంతి వివాహానికి ముందు, దుర్వాసుడు ఆమెకు ఒక వరం ప్రసాదించాడు. ''నువ్వు ఏ దేవుడిని కోరుకుంటే ఆ దేవుడు నీకు ఒక కొడుకుని ప్రసాదిస్తాడు'' అని. ఆ వరాన్ని అప్పుడే వాడుకోమని ఆయన ఏమీ చెప్పలేదు. అయితే వరాన్ని వాడుకునే వివేకం మనకుండాలి. మనుష్యులకు వరాలు పొందటం తెలుసు కాని, వాటిని సక్రమంగా క్షేమంగా వాడుకోవటం తెలియాలి కదా! అది మనుష్యుల తప్పు. ఆ వరాలను ఇచ్చిన వాళ్ళ తప్పు కాదు. మనం అడుగుతాము. వాళ్ళు వరాలు ఇస్తారు. ఇచ్చిన తరువాత వాటిని గురించి



ఆలోచించటం కన్నా, ముందే ఇది అడుగవచ్చా, అడగకూడదా అనే వివేకం మనకు ఉండాలి. ఇట్లాంటి వరాలు నేను అడిగితే, ఒకవేళ ఏ దేవత అయినా అవి నాకిస్తే, దానివలన నేను బాగుపడతానా? అది నాకు క్షేమకరమేనా? అని ముందుగా ఆలోచించుకోవాలి. అనేకమంది రాక్షసులు, దేవతలు, మనుష్యులు భగవంతుడిని వరాలడిగి పొందారు. వాటివల్ల కొందరు బాగుపడ్డారు. కొందరు బాగుపడలేదు. కొందరు లోక కంటకులయ్యారు – భస్మాసురుడి లాగా.

వరం ఇవ్వటం అనేది ఈశ్వరుడి ధర్మం. ఏది అడిగితే అదే ఇస్తాడు. విచక్షణా జ్ఞానంతో మనకు బోధ చేసే బాధ్యతను ఈశ్వరుడు తీసుకోలేదు. అందుకనే అట్టి బోధను అనుగ్రహించేందుకై ఋషులు, గురువులు మానవజాతికి ఏర్పడ్డారు. ఇది ఆర్య సంప్రదాయం. ''ఇది తప్పు నాయనా! ఇట్లాంటి వరం నువ్వు అడగకూడదు'' అని ఈశ్వరుడు ఎప్పుడూ చెప్పడు. అలా చెప్పటం తన ధర్మంగా ఆయన ఎప్పుడూ తీసుకోలేదు.

జగత్తులో ప్రకృతి అనేది ఎలాగ పని చేస్తుందంటే – సంకల్పము, విచక్షణ అనేది దానికి లేదు. ఉదాహరణకు – చెఱువులో నీళ్ళున్నాయి. ఒకడు వచ్చి అందులో మైల బట్టలు ఉతుకుతాడు. ఇంకొకడు – బ్రాహ్మణుడు – అర్ఘ్యప్రదానం చేసుకుంటాడు. చెఱువేమైనా అభ్యంతరం చెబుతోందా? లేదు. అది అక్కడ ఉంది అంతే. ఈశ్వరుడి యొక్క శక్తి కూడా అలాగే ఉంటుంది. ఎవరు ఎలాగ కోరతారో అలాగే లభిస్తుంది వాళ్ళకి. దాని యొక్క లాభనష్టాలు వాళ్ళవే. ఈ విషయం బోధించటానికే గురువులు ఏర్పడ్డారు. ''నాయనా! ఈశ్వరుడిని ఇలా అడగకు. అడిగితే ఇస్తాడు సుమా. ఇది ప్రమాదం. ఈ విధంగా అడుగు'' అని చెప్తాడు గురువు. అందుకే ఋషుల చరిత్ర మనకు ప్రమాణము. భగవంతుడికి విడిగా చరిత్ర లేదు. మనుష్యుల చరిత్రే. అంటే ఋషుల చరిత్రే పురాణాలు. అదే భగవంతుడి చరిత్ర. మహాత్ముల యొక్క చరిత్రలు మనకు పాపక్షయం చేసేవి. అందుకే సాధు సంతులకు మనం నేటికీ వెళ్ళి నమస్కరిస్తున్నాము. అంటే ఋషుల చరిత్రలే మనకు శరణ్యం. వారి చరిత్రలే మనకు వారి అనుగ్రహాన్ని ఇస్తాయి.

భాగవతం నిండా కూడా భగవత్కథలు, ఋషుల గాథలు ఉన్నాయి. ఋషుల సంతానవంతులు అవటం చేతనే మనకు ఈ సంస్కారం నిలబడి ఉంది. అంత గొప్ప సంస్కారం మనది. మనము ఆర్యులము అంటే, ఋషుల సంతానం కాబట్టి. అదే ఆర్షధర్మము. భగవత్తత్త్వం తెలిసిన వాళ్ళు కాబట్టి వారు ఋషులు. వాళ్ళ సంతానం అయిన మనం మరి ఎవరిని ఆశ్రయిస్తే, ఈశ్వర తత్త్వం తెలుస్తుంది? ఎవరి గాథలు వినాలి? భగవంతుడి యొక్క గాథ వింటే ప్రత్యక్షంగా మనకు అర్థం చేసుకునే జ్ఞానం భగవంతుడివ్వవచ్చు. కాని అలా అడుగుతామా? అంత తీక్షణమైనటువంటి ఏకాగ్రతతో, నాకు నిన్ను గురించి తెలుసుకోవాలని ఉంది అని అడుగుతున్నామా? అలాగ అడగటం లేదు. కాబట్టి మనుష్యుడి లోపల ఉండేటటువంటి అజ్ఞానం చేత, ఈశ్వర సాక్షాత్కారం కోరినా, ఒకవేళ అది లభించినా, ఇంకేదైనా అడగడం సంభవిస్తుంది అతడికి. అలాంటిదే జరుగుతుంది కాబట్టి ఈశ్వరుడిని ఎలా చేరాలి? ఏం చెయ్యాలి? అనే ప్రశ్నలు మనుష్యుడిని ఎప్పుడూ పీడిస్తూనే ఉన్నవి. ఆయన వస్తే ఏమని అడగాలి? ఇలా అడగటం సరియైనదేనా? ఇలా అడగటం తప్పా? ఇలాంటి ప్రశ్నలు పీడిస్తున్నాయి.

ఈ ప్రశ్నలకు ఈశ్వరుడు ప్రత్యక్షంగా సమాధానమివ్వడు. గురువే చెప్తాడు. కనుక గురుస్వరూపులయినట్టి మహర్షులే మనకు శరణ్యం. వేదములలో మంత్రములు, సూక్తములన్నీ కూడా వాళ్ళ ముఖంలోంచే మనకు వచ్చాయి. వాళ్ళ హృదయాలలో బ్రహ్మ వాళ్ళకు వినిపించి ఉండవచ్చు. వాళ్ళకు అది 'శ్రుతి' కావచ్చు. మనకు 'శ్రుతి' కాదు. ఋషులకు 'శ్రుతి', మనకు 'ఋషిప్రోక్తం'. ఇది ఎప్పుడూ మరచిపోకూడదు.

అపౌరుషేయం అయినటువంటి వేదం, ఋషుల ముఖం నుంచి వచ్చిందంటే, ఋషుల మహత్తు అలాంటిది. భగవంతుడు తనను తాను ఎరుక పరచుకోవటానికి ఋషులను ఎందుకు ఎన్నుకున్నాడు అంటే, మహర్షుల మహోన్నతస్థితి మనకు దానిని బట్టి తెలుస్తోంది.

ఋషుల చరిత్రే ఎక్కువ ఆసక్తిదాయకంగా ఉంటుంది. వాళ్ళ చరిత్రలే చెప్పుకుంటే, తెలుసుకుంటే, వాళ్ళ స్మరణ చేస్తే, వాళ్ళ అనుగ్రహం మనకు కలిగితే, మనలో మళ్ళీ ఆ చైతన్యం – ఆర్య చైతన్యం – వస్తుందని చెప్పుకోవచ్చు. వాళ్ళ ప్రస్తావన చేత, వాళ్ళ స్మరణ చేత ఆ చైతన్యం మళ్ళీ రాగానే ఒక దారి

అంటూ మనకు ఏర్పడుతుంది. దారిని చూపించేవారు కూడా వారే కాబట్టి, ఎల్లప్పుడూ వారినే స్మరిద్దాం. పురాణాలలో అక్కడక్కడ వచ్చిన మహర్షుల ప్రస్తావన తీసుకొచ్చి ఒకచోట పెట్టి, ఒకాయన ఋషుల చరిత్ర వ్రాశారు. అది దగ్గర పెట్టుకునే వాళ్ళను స్మరించటం జరుగుతున్నది.

మనం కర్తవ్యాన్ని ఆలోచించాలి. ధనం సంపాదించాల్సిందే. భార్యా బిడ్డలను సుఖపెట్టవలసిందే. మనం కూడా మంచి భోజనం, మంచి వస్త్రములు సంపాదించుకోవాలి. ఇదంతా అధర్మము, అన్యాయము కాదు. న్యాయంగా ప్రతివాడూ చేయవలసిందే. కాని ఎప్పుడూ కూడా దీని అనిత్యత్వాన్ని అంతఃకరణలో గుర్తుపెట్టుకోవాలి. ఇదే నిత్యం అని అనుకునేవాడివలె ప్రవర్తించటమే అజ్ఞానం. మనుష్య జన్మలో ఏ పని చేసినా అది సహజమే. అన్నం తినటం, ధనం సంపాదించుకోవటం, నిద్రపోవటం ఇవన్నీ సహజమే. ఇందులో ఏమీ దోషాలు లేవు. అయితే ఇవే నిత్యము అనే భావన చేస్తే పెద్ద తప్పులు చేస్తాం. అవి అనిత్యమని ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటే మనం తప్పులు చేయం. కొంత అహంకారాన్ని చంపుకుంటాం. ఆశ తగ్గుతుంది. ధనాశ చేత వచ్చే అధర్మం అప్పుడు మనలో రాదు. అనేక దోషాలు మనల్ని విసర్జిస్తాయి. అందుచేత ఇది గుర్తించటం మనిషికి చాలా అవసరం.

అట్లాంటి స్థితి ఆనాడు పరీక్షిత్తు యొక్క మనః ఫలకంలో అతడి యొక్క అంతఃకరణలో చిత్తమందు అప్పుడే ప్రవేశించటం చేత, శుకమహర్షి చేసిన బోధ అతనికి మోక్ష ప్రదాయకమైంది. ఆయన విషయంలో చిత్తస్థితి అలా ఉంది. ఆయనకు భాగవతం ఏడు రోజుల్లో చెప్తే, మానవజాతి మొత్తానికి అనేక సంవత్సరాలు చెప్పబడింది. మనకుండాల్సిన సరైన దృక్పథం ఏమిటంటే అనిత్యమనేదాన్ని – జీవితసత్యాన్ని – ఎప్పుడూ గుర్తు పెట్టుకుని అన్ని కర్మలు, అన్ని ధర్మాలు పూర్తి సమర్థతతో, శ్రద్ధతో చేయాలి.

''ఈ భూమి ఉంటుందో ఉండదో? నేను రేపటినుండి ఉద్యోగానికి ఎందుకు వెళ్ళాలి? వెళ్ళకుండా నిద్రపోతాను'' – ఇలాంటి ఆలోచన కాదు చేయవలసింది. ఒక ధర్మాన్ని ఆచరించేటప్పుడు సున్నితంగా, సునిశితంగా బాగానే చెయ్యాలి. ధర్మాచరణలో లోపం రాకూడదు. కాని, పని చేసేటప్పుడు ఫలం యొక్క అనిత్యత్వాన్ని జ్ఞాపకం పెట్టుకుంటే, కొన్ని అవాంఛనీయ జీవ సంస్కారాలు మనల్ని విసర్జిస్తాయి. అందుకొరకే అది గుర్తు పెట్టుకోవాలి.

భాగవతం మహత్తు కొంతయినా మన మనోబుద్ధి చిత్తాల్లో ప్రవేశించి, అట్టి ధర్మాన్ని మన జీవనంలో ఆచరణ లోనికి తీసుకు రాగలగాలి. అందుకనే భాగవతాన్ని వినాలి. శ్రీకృష్ణపరమాత్మ యొక్క మహత్తు తెలుసుకోవాలంటే, వ్యాసమహర్షి ఏ ఘట్టాన్ని పరమోత్కృష్టంగా ఎంచుకుని వర్ణించాడో, అటువంటి ఘట్టాలను – భాగవతం లోనివి – నిత్యమూ మననం చేసుకోవాలి. భక్తులను రక్షించటం, గజేంద్ర మోక్షము వీటన్నింటిలోనూ భగవంతుడి యొక్క మహత్తును మనకు బోధించాడు వ్యాసభగవానుడు.

కృష్ణపరమాత్మ చరిత్రలో, సృష్టికర్త అయినటువంటి బ్రహ్మదేవుడు కూడా అతడి మహత్వాన్ని గుర్తించిన సంఘటన వర్ణించబడింది. అంటే, బ్రహ్మదేవుడు అజ్ఞానంలో ఉన్నాడని అర్థం కాదు. బ్రహ్మదేవుడు కూడా మాయా ప్రపంచానికి సృష్టికర్తే కాని, యథార్థ వస్తువును సృష్టించే వారంటూ ఒకరు లేరు. ఉన్నది ఎప్పుడూ ఉంటుంది. లేనిదాన్ని బ్రహ్మ కూడా సృష్టించలేడు. ఈ సృష్టంతా ఏమిటి? పరమాత్మ యందు అవిద్య యొక్క ప్రతిబింబం కాబట్టి ఇది ఉందనుకునేవారికి ఉంది. ఒకవేళ ఈ సృష్టి ఇంతకుపూర్వమే ఈశ్వరునిచేత మాయాకల్పిత బ్రహ్మగా సంకల్పితం అయి ఉంటే, ఆ కార్యాన్ని ఏ విధంగా ఈశ్వరుడు సంకల్పించాడో, అట్లా సృష్టించి ఆ పని చేయటమనేటటువంటి ఉద్యోగంలోనే బ్రహ్మ ఉన్నాడు తప్ప, అతడు స్వతంత్రమైన కర్త కాదు. ఈ భౌతికమైన ప్రపంచం మీద ఆయనకుండేటటువంటి మహత్తు, అధికారం ఒకవేళ వినియోగించుకుని తాను సృష్టించిన మాయావస్తువును మాత్రమే తాను మాయం చేయగలిగితే, ఈశ్వర సంకల్పంలో – పూర్వం ఉండినటువంటి ఏ జగత్తు ఉండవలెనని సంకల్పించబడిందో, అది అలా ఉండనే ఉంటుంది. దానిని బ్రహ్మ అంతర్థానం చెయ్యలేడు.

ఈ అస్థిరమైన మాయా స్వరూపం కలిగినటువంటి శరీరములు, పశువులు, ఈ జగత్తు అంతటినీ కూడా బ్రహ్మ ఒకవేళ తాను తన లోపలకి మళ్ళీ వెనక్కు తీసుకున్నప్పటికీ, అది అలా ఉండటం ఈశ్వర సంకల్పమే అయి ఉంటే, అది అలా ఉంటూనే ఉంటుంది. ఈ విషయం బ్రహ్మకు అవగాహన అయితే, ''నేను దీనికి కారణం కాదు, నా సంకల్పం చేత సృష్టి చెయ్యటం లేదు. ఇది ఎవరి సంకల్పమో; నేను ఎలాగ దానిని – ఆ సంకల్పాన్ని ప్రతిబింబించేటటువంటి క్రియను – చేయాలి అని నా యందు విధించబడి ఉన్నదో, అటువంటి విధిని నేను'' అని అనుకుంటాడు బ్రహ్మ. అందుకనే బ్రహ్మను 'విధి' అంటాం.

బ్రహ్మ కూడా పరమేశ్వర తత్త్వంలో ఈశ్వరుడు విధించిన పరమ శివతత్త్వం. శ్రీమహావిష్ణువు తత్త్వమేదయితే ఉన్నదో, ఆ సర్వకారణమేదయితే ఉందో, అది ఎలా సంకల్పించబడిందో ఆ సంకల్పం విధివత్ అన్నమాట. అలాగ కనబడే దాన్ని నిర్మాణం చేసి, అది ఏమవుతుందో దానిని అలా చేస్తూ ఉండే



అధికారమే తప్ప స్వతంత్రం బ్రహ్మకు లేదని, అటువంటి స్వతంత్ర రూపం పరమాత్మ అని చెప్పటమే ఇందులో ఉద్దేశం.

కార్య లక్షణం చేత బ్రహ్మ తాను ఈ విషయం తెలుసుకున్నట్లుగా, బ్రహ్మ ముఖంగానే ఆ మాట చెప్పించటం చేత, దానికి ప్రామాణ్యత ఏర్పడుతుంది. ఈశ్వర తత్వంలో ఏదైనా ఉత్కృష్టమైన విషయం చెప్పవలసి వచ్చినప్పుడు, ''పార్వతి స్వామిని అడిగింది. స్వామి పార్వతికి ఇలా చెప్పాడు'' అని అంటారు. ఇక దాన్నెవరూ ప్రశ్నించటానికి వీల్లేదు. అమ్మవారు అడిగితే స్వామి చెబుతారు అంతే! ఇక దానిని సందేహించటం అనే ప్రశ్న పుట్టకూడదు. ఇది వ్యాసుడే తన ముఖంగా చెప్పేస్తే, ఎవరైనా ప్రశ్నించవచ్చు. పరమ ప్రామాణ్యతను దానికి ఇవ్వటమే దాని ఉద్దేశ్యం.

జరిగిందేమిటంటే, గోపకులంలో ఉండే పశువులు, గోపాలకులు, వాళ్ళ కుటుంబాలు వాళ్ళందరినీ కూడా (ఎవరైతే ఇంటికి వెళ్ళి మామూలుగా జీవించాలో వాళ్ళందరినీ) బ్రహ్మ అంతర్హితం చేశాడు. (బ్రహ్మ గోపాలకులను, గోవులను అదృశ్యం చేసిన గాథ, వారిని శ్రీకృష్ణుడు తిరిగి సృష్టించిన వైనం ప్రసిద్ధమే). అయినప్పటికీ, శాశ్వతమైన ఆ బ్రహ్మ వస్తువులో ఈ ప్రతిబింబించ వలసినటువంటి జగత్తు ప్రతిబింబిస్తూనే ఉంటుంది. ఏది ఈశ్వర పదార్థమో అది కూడా తాత్కాలికంగా కొంతకాలం ప్రతిబింబించి అంతర్హితం అవుతూనే ఉంటుంది. అది అందులోంచే వస్తుంది. అందులోనే మళ్ళీ లయం చెందుతుంది. ఆ కాలగమనం, ఆ క్రియ ఆగదు. తాను అసత్ పదార్థాన్ని సృష్టించి, దాన్ని అసత్ గానే మార్చుకున్నాడు తప్ప; సత్ పదార్థాన్ని సృష్టించి దానిని వెనక్కు తీసుకోగలడా? తను సృష్టించిన అసత్ పదార్థం యథార్థం కాదు. అది లేకుండా తన అసత్ పదార్థ సృష్టిని తాను పక్కన పెట్టి; సత్ పదార్థము నందు అసత్ పదార్థము యొక్క ప్రతిబింబం శాశ్వతంగా, తను లేకపోయినా అది ఎలా ఉంటుందో బ్రహ్మ తెలుసుకున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ ద్వారా.

ఈశ్వరుడి లక్షణం ఏమిటంటే, సర్వానికీ అతడు కర్తే కాని కర్తృత్వ భావన లేనివాడు. శుద్ధసత్యానికీ, సాపేక్ష సత్యానికీ అదీ తేడా. బ్రహ్మదేవుడు చేసేది సృష్టి. అది సాపేక్ష సత్యం. అందువల్ల దానికి కర్తని నేను అనుకుంటాడతడు.

సత్ పదార్థం యొక్క వస్తు లక్షణం ఎలా ఉంటుందో అది ఎప్పుడూ అలాగే ఉంటుంది. దానిమీదనుంచి వచ్చి మళ్ళీ వెళ్ళిపోయేటటువంటి ఈ జగత్తంతా కూడా తాత్కాలికంగా ఉంటుంది. తాత్కాలికమైన ఇటువంటి నాటకానికి ఒక మూలకర్త ఉన్నాడు. దానిని ఆడేవాడు, పాడేవాడు, నాటకం వేసేవాడు వాళ్ళందరూ మధ్యన వచ్చి మధ్యనే వెళ్ళిపోతారు. ఒక నాటకం ఉంది. ఒక నాటక కర్త నాటకం వ్రాశాడు. ఆ నాటకాన్ని కవి ఊహించుకుని వ్రాశాడు. అది వ్రాసిన తరువాత

ఒకవేళ అందులో పది పాత్రలు ఉంటే, ఆ పాత్రల వేషం వేసుకుని నటించేవాళ్ళు అనేకమంది. ఇవాళ ఒక సమూహం ఆ పది పాత్రలూ వేషం వేసుకుని నటిస్తారు. వాళ్ళు అలా నటించి వెళ్ళిపోయిన అనేక సంవత్సరాల తరువాత ఎప్పుడో, అదే నాటకంలోని పాత్రలను మరొక నటుల సమూహం నటించవచ్చు. కానీ అది ఎవరు సంకల్పించారు? అంటే కవి ఊహించుకుని సంకల్పించుకుని ఏది వ్రాశాడో అదే చేస్తారు ఆ నటులు. అంతేకాని ఆ పాత్రలు స్వతంత్రంగా నటించరు. వాళ్ళు స్వతంత్రులు కారు. కవి ఊహించినటువంటి పాత్రను యథాతథంగా నటించటమే వాళ్ళ కర్తృత్వం తప్ప వాళ్ళు స్వతంత్రులు కారు. వాళ్ళు ఆ పాత్రలను నటించి తమ ఉద్యోగాలను నిర్వర్తించారని అర్థం చేసుకోవాలి. బ్రహ్మాదులు కూడా అంతే అని అర్థం.

బ్రహ్మ నిజంగా లేనటువంటి వస్తువును కొంతకాలం సృష్టించి, అది తను వెనక్కు తీసుకుంటే ఇంక ఏమీ ఉండదు. ఇదే సృష్టి. ''గోపకులను ఇలా సృష్టించినవాణ్ణి నేనే. ఈ మనుష్యులను, ఈ గోవులను శరీరాలతో సృష్టించింది నేనే కదా. నేను వీటిని వెనక్కు తీసుకుంటే అక్కడ ఏమీ ఉండదు'' అనుకున్నాడు బ్రహ్మ భాగవతంలోని ఆ ఘట్టంలో. వెనక్కు ఉపసంహరించగల శక్తి ఉన్నదనుకోవటం, ''నేను సృష్టించాను కదా!'' అనే భావనలోంచే వచ్చింది. ఆ భావం అతడిలో నుండి తీసేశాడు కృష్ణపరమాత్మ.

ఈశ్వరుడు బ్రహ్మతో, ''నీవు సృష్టించినవాడివి కావు. నేనెలా సంకల్పించానో నువ్వు అలా చేస్తున్నావు. నీవు ఒకవేళ, 'నేను రేపటినుంచి సృష్టించను' అన్నప్పటికీ కూడా, అప్పుడు కూడా సృష్టి ఇలా నడుస్తూనే ఉంటుంది. సృష్టించింది వెనక్కు తీసుకుంటానంటావా, అప్పుడూ నడుస్తూనే ఉంటుంది. నీవు నిమిత్తమాత్రుడివే'' అన్నాడన్న మాట. అది బ్రహ్మకు బ్రహ్మోపదేశం.

ఈశ్వరుడి లక్షణం ఎలా ఉందంటే, నిర్గుణమైన పరబ్రహ్మ వస్తువులో అవిద్య యొక్క ప్రతిబింబం ఈశ్వరుడని – ఈశ్వరుడి రూపమే అవిద్య అని అనవచ్చు. ఆయనలో ఉండే తత్త్వం మాత్రమే సత్యం. లేకపోతే మనుష్యులు పుట్టటమేమిటి? శరీరాలు పోవటమేమిటి? 125 సంవత్సరాలు బ్రతికి కృష్ణ పరమాత్మ వెళ్ళిపోయాడు అని చెపుతుంటారు కదా! పోవటమేమిటి? శాశ్వతమయిన తత్త్వం ఎప్పుడూ అలాగే ఉంటుంది. ఏ రూపంలో వచ్చాడో, ఆ రూపాన్ని ఇప్పుడు ధ్యానించినా ఆ తత్త్వమే మనకు ఉపకరిస్తుంది.

రాముడి స్వరూపాన్ని మనం ధ్యానిస్తే రాముడు మనకు రాముడి గానే కనబడతాడు. అయితే పురాణం, రాముడి శరీరం వెళ్ళిపోయిందని చెబుతుంది. కానీ అది శాశ్వతంగానే ఉంటుంది.

ఈశ్వరుడు తానే వచ్చినటువంటి ఏ సగుణ రూపమయినా శాశ్వతమే. ఎందుకంటే, అది యథార్థమయిన సత్యతత్త్వంలోంచి వచ్చేటటువంటిది కాబట్టి. ఈ కారణం చేత పరమాత్మ వస్తు స్వరూపాన్ని గూర్చి బ్రహ్మ కూడా పొరపాటు పడవచ్చు అని చెప్పటం వ్యాసమహర్షి తాత్పర్యం. బ్రహ్మ త్రికాలవేది. కృష్ణ పరమాత్మ పుట్టబోతున్నాడని ముందరే తెలిసినవాడు. ఆయన పుట్టి, తను చెయ్యలేని పని, తను చెయ్యని పని ఆయన చేస్తాడు అని తెలిసినవాడు కూడా అయినప్పటికీ, సదసద్వివేక సంపత్తి అనేటటువంటిది ఏదయితే ఉన్నదో, బ్రహ్మస్థాయిలో అక్కడ కూడా ఆయనకు అవసరమయినటువంటి ఒక పరాకాష్ఠ, ఒక జ్ఞానం ఉన్నది. మన స్థాయిలో మనకు కావలసిన జ్ఞానం ఎలా ఉంటుందో, బ్రహ్మకు కూడా – ఈ సృష్టి రహస్యమేదో తెలుసుకుని తాను నిమిత్త మాత్రుడనని తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఆయనకు ఉంటే; ఆతడు కర్తృత్వ భావన లేనటువంటి పరమాత్మతో సమైక్యం పొందుతాడు. లేకపోతే సగుణబ్రహ్మ మాత్రమే అయితే, తన జ్ఞానానికి అవధి మాత్రం ఉంటుంది తప్ప తన కారణాన్ని గురించిన జ్ఞానం ఆయనకుండదు. అట్టివారికి కూడా, పరమాత్మ వస్తువు జ్ఞానాన్నిచ్చేదిగా ఉంది. కృష్ణుని యొక్క అవతారం అట్లాంటిది అని తాత్పర్యం.

ఇంకొకటి కూడా జరిగింది. కృష్ణపరమాత్మను కొందరు జారుడు, చోరుడు అన్నారు. భర్తల రూపంలో కూడా ఉన్నాడాయన ఆ కాలంలో. పుత్రుల రూపంలోనూ ఉన్నాడు. గోవుల రూపంలో ఉన్నాడు. భార్యలకు తెలియదు. తల్లులకు తెలియదు. దూడలకు తెలియదు అన్నీ అతడేనని. అలాగ 16 వేల మంది గోప స్త్రీలకు ఆయన భర్త అయ్యాడు. అయితే అది అసత్యమే అని చెప్తారు. ఎందుకంటే, బాల్యావస్థలో కేవలం 12 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు ఆయన వాళ్ళందరినీ, ఆ ఊరునూ వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఆయనకు వీళ్ళందరూ భార్యలంటే అర్థమేమిటి? 12 సంవత్సరముల పిల్లవాడికి, అది స్త్రీలతో కాపురం చేసే వయసా? కాదు. కానీ అది సత్యమే. ఎలాగంటే ఈ కాలంలో (గోవులు, గోపాలకులు అదృశ్యమైన కాలంలో) భర్తల వేషంలో కూడా అతడే ఉండటం వలన అది సాధ్యమయింది. సత్యమైంది. 16 వేల మంది గోపికలకు ఆయన భర్త అయ్యాడని అంటే, ఇలాగ అయ్యాడనే అర్థం. భర్తృభావన కొంతమందికి, పుత్రభావన కొంతమందికి. పశువులు తమ దూడలుగా భావించినవి. ఏకకాలమందే ఇది జరిగింది అంటే, ఇది ఏదీ వాస్తవం కాదు అని అర్థం. ఈ భావన తనకు (శ్రీకృష్ణునికి) కలుగలేదు. అవతలి వాళ్ళకు కలిగింది. ఒక స్త్రీ తన భర్తగా భావించుకుంది. మరొక స్త్రీ కొడుకుగా

భావించుకున్నది. ఆవు తన దూడగా భావించుకుంది. దూడ తన తల్లి ఆవుగా ఊహించుకున్నది. వాళ్ళందరికీ వాళ్ళ ఊహ ప్రకారమే కనబడ్డాడు ఆయన. భాగవతాన్ని ఎంత చెప్పినా, ఇంకా చెప్పటానికి యోగ్యమైన వస్తువు అది.

బ్రహ్మ కృష్ణపరమాత్మను చేసిన స్తోత్రం చాలా ఉత్కృష్టమైనది. ఎన్నో విషయాలు అందులో చెప్పాడాయన. సారాంశమేమిటంటే, అట్టి పరమాత్మ వస్తువును తెలుసుకోవటం ఎలాగూ సాధ్యం కాదు కాబట్టి (పరమాత్మను ఎవరు తెలుసుకోగలరు? ఎవరూ తెలుసుకోలేరు), పరమాత్మ సగుణ స్వరూపంలో మనవలె ఒక మానవ అవతారంలో వచ్చినప్పుడు, దాన్ని ప్రేమిస్తే చాలు అన్నాడు.

తత్త్వం నువ్వు తెలుసుకునే ప్రయత్నం చేస్తావా? నువ్వు ఎంత కసరత్తు చేసినా నీ బుద్ధికి అందదు. నీ పాండిత్యానికి అసలే అందదు. దాని చుట్టూ తిరుగుతూ ఉంటావు గానుగెద్దులాగా. మధ్యలో గానుగలో నువ్వులు నలుగుతూ ఉంటాయి. నూనె మాత్రం వస్తూనే ఉంటుంది. గానుగ చుట్టూ తిరుగుతూ ఉంటుంది ఎద్దు. దాన్ని గానుగ చుట్టూ తిప్పుతూ ఉంటాడు. అది ఎంత తిరిగినప్పటికీ, నువ్వుల్లోంచి నూనె రాలినప్పటికీ దానికి ఆ వాసన, కమ్మదనం తెలుస్తుంది కానీ, నూనె రుచి మాత్రం తెలియదు. అలాగే సద్వస్తువు అనేది ఒకటుంటుంది. దానిచుట్టూ వ్యాఖ్యానాలు చేసుకుంటూ తిరుగుతూ ఉంటాము కానీ, దాని దగ్గరకు వెళ్ళలేము. దాని వాసన అప్పుడప్పుడూ వస్తూ ఉంటుంది. అది మనకు తెలిసిందేనేమో అనిపిస్తుంది. ఆ ఎద్దుకు ఆ వాసన రుచిగా బాగుందనిపించి, ఎట్లాగైతేనేం అది పొందుతానేమో అని దానిచుట్టూ తిరుగుతూ ఎప్పుడూ ఎలా పొందలేకపోతుందో; మనకు సద్వస్తువు కూడా అంతే. ఎప్పుడూ పొందలేని వస్తువు. ఎప్పుడూ పొందబడే వస్తువు కాదు.

కాబట్టి పరమాత్మ సగుణ స్వరూపంలో ఉన్నప్పుడు ప్రేమించడమే నీ కర్తవ్యం. నీ ప్రేమ ద్వారా అతన్ని పొందు – అని బోధ. ప్రేమ, భక్తి రెండింటికీ తేడా ఏమీ లేదు. రెండూ ఒకటే. అలాగ భక్తిభావం ఉంటే, దానిని వదలనే వదలకుండా ఉండేది ప్రేమ. సృష్టిలో ఈ ప్రేమ, భక్తి సహజంగా అందరికీ ఉన్నాయి. భర్తకు భార్య మీద ప్రేమ ఉంటుంది. సేవకుడికేమో రాజు మీద – తన నాయకుడి మీద భక్తి విశ్వాసాలుంటాయి. భక్తి, ప్రేమ, విశ్వాసాలన్నీ కూడా మనుష్యుల్లో సహజంగా మరొక వ్యక్తి యందు ఆరోపించబడుతూ ఉన్నటువంటి విషయములే.

పరమాత్మను పొందాలి అంటే మనలో లేనటువంటి ఒక క్రొత్త గుణాన్ని సంపాదించుకోవలసిన అవసరం, ఆవశ్యకత లేదు. నీలో సహజంగా మానవుడిగా ఏయే లక్షణములున్నాయో వాటినే ఆధారం చేసుకుని నీవు భగవంతుడిని చేరవచ్చు అని తాత్పర్యం.

యోగాభ్యాసం చేయాలంటే నిద్రను జయించాలి. కాళ్ళు చేతులు నొప్పులు లేకుండా ఉండాలి. కాళ్ళు ముడుచుకుని పద్మాసనం వేసుకోవటం అలవాటు చేసుకోవాలి. ప్రాణాయామం చేయాలి. ఊపిరి బిగబట్టటం చేతకావాలి. ఇలాగ మన దగ్గర ఇదివరకు లేనటువంటి కొన్ని కొత్త లక్షణాలను సాధన చేసి సంపాదించుకోవలసి వస్తుంది. ఏ మార్గంలో అయినప్పటికీ కూడా, మన దగ్గర లేనటువంటివి సంపాదించుకుని ఆ మార్గాన్ని మనం నిర్మాణం చేసుకోవాలి. అలా ఏమీ లేదు. ఈ భక్తిమార్గంలో, యథాతథంగా ఉన్నవాడు ఉన్నట్టుగానే పొందవచ్చు. ''ఇప్పుడు భార్యను ప్రేమిస్తున్నావు. నీ ధనాన్ని ప్రేమిస్తున్నావు. నీ ప్రభువుకు నీవు సేవకుడిగా ఆయన దగ్గర విశ్వాసంతో ప్రవర్తిస్తున్నావు. భక్తితో సేవ చేస్తున్నావు ఇంకెవడికో. ఈ లక్షణాలన్నీ ఈశ్వరపరం చెయ్యి. ఈశ్వరుడిని ప్రేమించు. ఈశ్వరుడికి దాసోహం కా. నీవు నాకు భర్తవు. నీవు నాకు పుత్రుడివి. నీవు నా ధ్యేయం. నీ కోసమే నేను బ్రతుకుతున్నాను అని ఈశ్వరుడితో అను. ఇలాగ ఇంక దేనితోనో అంటూనే ఉన్నావు. ఈ గుణాలు నీలో ఉండనే ఉన్నవి. ఉన్న లక్షణములనే వాడుకుని ఈశ్వరుణ్ణి చేరుకో'' అని భాగవతం చెబుతున్నది.

ఆ కారణం చేతనే శిశువులు, పశువులు కూడా ఆయనను పొందగలిగాయి. గజేంద్రుడు పశువు. ప్రహ్లాదుడు శిశువే. ధృవుడూ బాలుడే. గోపికలేమో శిశువులు, పశువులుతో సమానమయినటువంటి అజ్ఞానం కలిగినవాళ్ళు. వీళ్ళందరూ సామాన్యులే; పండితులు కారు. యోగులు కారు. అంటే జీవలక్షణములో ఉండేటటువంటి సహజమైన గుణములే ఈశ్వరుడిని చేరటానికి సమర్థవంతములు అని దాని తాత్పర్యం అని రూఢిగా చెపుతున్నారు. ఈశ్వరుడిని చేరుకోవటం నా వలన ఏమవుతుంది అని చాలామంది అనుకుంటుంటారు. అలా ఏమీ లేదు. ''నీలో ఏయే గుణములున్నాయో – ఈ గుణములనే నీవు ఈశ్వరునియందు ఆపాదించుకో! నీవు ఉన్న స్థితిని వదిలిపెట్టి లేనిస్థితిని పొందవలసిన పని ఏమీ లేదు. ఉన్న స్థితిలోనే ఆయనను పొందవచ్చు'' అనేది దాని యొక్క సారాంశం.

ఇంతటితో అత్రి మహర్షి చరిత్ర పూర్తయింది. దీనికి భాగవతం తోటి సంబంధం ఏర్పడింది. అగస్త్యమహర్షి శాపంతో ఇంద్రద్యుమ్నుడే గజేంద్రుడిగా పుట్టాడని అగస్త్యుని చరిత్రలో తెలుసుకోవడం జరిగింది. అదే భాగవతంలోని గజేంద్ర మోక్షం కథ అయింది.

**-శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 420. కృష్ణాయ నమః

ద్వాపర యుగము నందలి కృష్ణుడే (కృష్ణుని జననం 19-07-3228, అవతార సమాప్తి 18-02-3102 బి.సి. 126 సం||ల జీవితం) కలియుగమున (శ్రీనివాసుడుగ) వేంకటేశునిగా అవతరించినాడు. కృష్ణ, వేంకటేశులకు అభేదము, ధర్మైక్యము కలదు.

శ్లో ॥ కృతేతు నారసింహోఽభూత్ త్రేతాయాం రఘు నందనః
ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః ॥

-కృతయుగమున నరసింహుడుగ, త్రేతాయుగమున రాముడుగ, ద్వాపరయుగమున కృష్ణుడుగ, కలియుగమున వేంకటేశుడుగ జగన్నాథుడైన విష్ణుదేవుడే సజ్జన సంరక్షణకు, దుష్ట శిక్షణకు అవతరించినాడు. ఈ నలుగురు నాలుగు యుగ దైవములు విష్ణుదేవుని అవతారపురుషులే. వీరికి అభేదము, ధర్మైక్యము కలదు.

ద్వాపరయుగ దైవమైన కృష్ణుడే కలియుగ దైవమైన వేంకటేశునిగా అవతరించినాడు.

శ్రీవేంకటేశ సుప్రభాతములో రెండవ శ్లోకము 'ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద' అని కృష్ణుని మేలుకొలుపును వర్ణించుచున్నది. తిరుమల దేవాలయములో నిత్యము పఠించే మంత్రపుష్పములో కూడ కృష్ణ ప్రశంస కలదు. వేంకటేశ్వరస్వామికి జరిగే వార్షిక వసంతోత్సవములలో మూడవ రోజైన చైత్రపూర్ణిమ నాడు జరిగే ఉత్సవములో శ్రీదేవి భూదేవి సమేతుడైన మలయప్పస్వామితో పాటు రుక్మిణీ కృష్ణులు కూడా పాల్గొంటారు. వేంకటేశ్వరుని విగ్రహము చెంత రుక్మిణీ కృష్ణుల ఉత్సవ విగ్రహములు ఆనంద నిలయములో ఉన్నవి. వేంకటేశ్వరస్వామికి జరిగే వార్షిక ప్లవోత్సవములో (తెప్ప ఉత్సవము) రెండవ రోజున రుక్మిణీ కృష్ణులకు వైభవంగా ప్లవోత్సవము జరుగుతుంది. వార్షిక బ్రహ్మోత్సవాలలో వేంకటేశ్వరుడు చిన్నశేష, ముత్యాలపందిరి, కల్పవృక్ష, సర్వభూపాల వాహనసేవలలో వేణుగోపాలునిగ, బకధ్వంసిగ, గోపాలునిగ, కాళియ మర్దనుని రూపంలో దర్శనమిస్తాడు. ప్రతి సంవత్సరము కనుమ పండుగ రోజున జరిగే పారువేట ఉత్సవంలో వేంకటేశ్వరస్వామితో పాటు, మరొక పల్లకిలో కృష్ణుడు కూడ పాల్గొంటాడు. వార్షిక బ్రహ్మోత్సవాలలో అయిదవనాడు పగలు మలయప్పస్వామి మోహినీ అవతారములో – రూపములో – దంతపు పల్లకిలో ఊరేగుచుండగా, కృష్ణుడు మరొక పల్లకిలో ఊరేగుతాడు. ఈ విధంగా తిరుమలలో జరిగే ఉత్సవాలు వేంకటేశ్వరునికి, కృష్ణునికి భేదం లేదని, ఇరువురు విష్ణుదేవుని అవతార పురుషులే యని చాటుచున్నవి.

పద్మావతీ శ్రీనివాసుల చూపుల కలసిన శుభవేళలో వేటగాని వేషంలో ఉన్న శ్రీనివాసుని పద్మావతీ చెలులు నీవు ఎవరు? అని ప్రశ్నించగా దానికి సమాధానముగా శ్రీనివాసుడు మాది చంద్రవంశము, వశిష్ఠ గోత్రము, నా తల్లి దేవకీదేవి, నా తండ్రి వసుదేవుడు, నా అన్న బలరాముడు, నా చెల్లెలు సుభద్ర అని చెప్పినాడు. పద్మావతీ శ్రీనివాసుల వివాహ రాయబారములో వకుళమాలిక, ఆకాశరాజు భార్య ధరణీ దేవితో –

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

వైకుంఠస్థో హరిః సాక్షాత్ వర్తతే వేంకటాచలే
శ్రీనివాస ఇతి ఖ్యాతో విద్యావాన్ ధనవాన్ బలీ ॥
దేవకీ జననీ తస్య జనకః శూర నందనః
నిశాకర కులం తస్య నామ కృష్ణ ఇతి స్మృతమ్ ॥
వసిష్ఠ గోత్రే చోత్పత్తిః నక్షత్రం శ్రవణం తథా
బహుళాచార సంపన్నో వయసా పంచ వింశకః ॥

– భవిష్యోత్తరం – అధ్యా – 7

-సాక్షాత్ వైకుంఠవాసి యగు విష్ణుదేవుడే శ్రీనివాసుడను పేరుతో వేంకటాద్రిపై నివసించి యున్నాడు. అతడు విద్యావంతుడు, బలవంతుడు. అతని తల్లి దేవకీ దేవి. తండ్రి శూరసేనుని పుత్రుడగు వసుదేవుడు. అతనిది చంద్రవంశము. అతని పేరు కృష్ణుడు. అతనిది వసిష్ఠ గోత్రము. నిత్యకళ్యాణోత్సవములో అర్చకులు స్వామి భారద్వాజ గోత్రుడని చెప్పుచున్నారు. అతని నక్షత్రం శ్రవణం. శ్రీనివాసుడు సదాచార సంపన్నుడు. ఇరువది అయిదు సంవత్సరముల యువకుడు అతడు అని శ్రీనివాసుని – కృష్ణుని – కులగోత్రాదులు తెలిపింది. వకుళమాలిక శ్రీనివాసుని (వేంకటేశుని) పేరు కృష్ణుడు అని చెప్పింది. కనుక కృష్ణునికి వేంకటేశునికి భేదము లేదు. ఇరువురు ఒక్కరే. అందువలన వేంకటేశ 108 నామావళిలో 'కృష్ణాయ నమః' (20) అను నామము చేరింది.

కృష్ణ పదము లీలార్థమై సృష్ట్యాది వ్యాపారములను చేయుచు ఆనందించువాడు అను భావమును తెలుపుచున్నది. పరమేష్ఠి, పుమాన్, విశ్వః, నివృత్తిః, సర్వః అను పంచశక్తి మయమైన మేఘము వలె లేక జలభరితమైన వర్షాకాలపు మేఘము వలె నల్లని దేహము (నీలమైన శరీరము) గలవాడు కృష్ణః అనబడుచున్నాడు. కృష్ణ శబ్దము నీలవర్ణమునకు వాచకము. కృష అను ధాతువుపై నక్ అను ప్రత్యయము చేరుటచే కృష్ణ పదము సిద్ధించుచున్నది.

శ్లో ॥ కృషామి మేదినీం సార్థభూత్వా కృష్ణాయసో మహాన్ ।
కృష్ణో వర్ణశ్చ మే యస్మాత్ తేన కృష్ణోఽహ మర్జున ॥

అని కృష్ణుడు తనకు కృష్ణుడు అను పేరు కలుగుటను గూర్చి అర్జునునకు తెలిపినాడు. అది ఎట్లనగా నాగలికి అడుగున వుండే ఇనుప కర్రునకు కృష్ణాయసము అను పేరు కలదు. నేనే పూర్వము ఆ నాగటి కర్రుగా మారి భూమి సస్య సంపన్నమగుటకు దున్నితిని గనుక కృష్ణుడని పిలుచుచున్నారు. మరియు నీలవర్ణము గల శరీరము గలవాడగుటచే నన్ను కృష్ణుడు అంటున్నారు. నీలవర్ణము గల శరీరము గలవాడగు దేవకీ కుమారుడు కృష్ణుడను సార్థక నామధేయం గలవాడని నిష్కర్ష.

శ్రీనివాసుడు పద్మావతీ చెలులకు తన తల్లితండ్రుల పేర్లు, వంశము, గోత్రాదులు చెప్పిన తరువాత

మాతృ వర్ణశ్చ మే దేవి కృష్ణపక్షే జనిర్మమ
తస్మా త్కృష్ణేతి మాం దేవి చక్రతుర్నామ సంస్కృతమ్
వర్ణతో నామత శ్చాపి కృష్ణం ప్రాహు ర్మనీషిణః ॥ - భవిష్యోత్తరం, అధ్యా – 7-22,23

-నేను నా తల్లి రంగులో కృష్ణపక్షమున జన్మించుటచే నాకు కృష్ణుడను పేరు పెట్టినారు. రంగు ననుసరించి, పేరు ననుసరించి కృష్ణుడని నన్ను విద్వాంసులు పిలుచుచున్నారు అని చెప్పినాడు. ద్వాపరయుగమున పూర్వావతారములో కృష్ణుడైన వేంకటేశునకు నమస్కారము.




### గత సంచిక తరువాయి

శ్రద్ధగా విన్నాడు రాముడు. బాగా ఆలోచించాడు. అంటున్నాడు. రావణుని శక్తి సామర్థ్యాలు చెప్పావు. అర్థం చేసుకున్నాను. ప్రహస్తుణ్ణి, తక్కిన యోధుల్ని చంపేస్తాను. సబాంధవంగా రావణుని హతమారుస్తాను.

**"రాజానం త్వాం కరిష్యామి సత్యమే తత్ బ్రవీమతే"**

నిన్ను లంకకు రాజును చేస్తాను. ఇది సత్యం. రావణుడు రసాతలానికి పోనీ – పాతాళానికి పోనీ – బ్రహ్మలోకానికి పోనీ నా చేత చస్తాడు. పుత్రుల్ని సేనల్ని బంధువుల్ని చంపుతాను. అంతవరకు అయోధ్యలో కాలు పెట్టను. ఇది నా ముగ్గురి తమ్ముళ్ళపై ఒట్టు.

విన్నాడు విభీషణుడు. రామునికి ప్రణమిల్లాడు. లంకా ముట్టడికి, రాక్షస సంహారానికి నా శక్తి కొద్దీ సాయం చేస్తాను అన్నాడు.

విన్నాడు రాముడు. సంతోషించాడు. విభీషణుని కౌగలించుకున్నాడు. లక్ష్మణుని చూశాడు. 'నేను ప్రసన్నుడనయ్యాను. వెంటనే సముద్ర జలాలు తీసుకురా. మహా ప్రాజ్ఞుణ్ణి, విభీషణుణ్ణి రాక్షసరాజును చేయాలి. సముద్ర జలాలతో అభిషేకించు – అది రామ శాసనం.

శిరసా వహించాడు సౌమిత్రి. నీళ్ళు తెచ్చాడు. విభీషణుని రాజుగా అభిషేకం చేశాడు లక్ష్మణుడు. చూశారు అందరూ. బాగు బాగు అన్నారు. కోలాహల ధ్వనులు మిన్నుముట్టాయి.

### సూచన

అది ఏకాంత ప్రదేశం. అక్కడున్నాడు విభీషణుడు. చూశారు సుగ్రీవ హనుమలు. వెళ్ళారు. అంటున్నారు. 'ఇది అపార సముద్రం. దాటటం కష్టం. ఉపాయం తెలియటం లేదు. నీవేమైనా చెబుతావా?'

మిత్రులారా! పిలిచాడు. తనకు తోచింది చెప్పాలనుకున్నాడు. 'సముద్రం రాఘవో రాజా శరణం గంతు మర్హతి'. సముద్రుణ్ణి రాముడు శరణు వేడాలి. ఈ సముద్రాన్ని సగర చక్రవర్తి తవ్వించాడు. రామకార్యానికి తోడ్పడగలడు – అది విభీషణుని సూచన.

రాముణ్ణి సమీపించాడు సుగ్రీవుడు. రామా! సముద్రాన్ని ఉపాసించు. అది మంగళకరమైది. ఈ ఉపాయాన్ని విభీషణుడు సూచించాడు.

విన్నాడు రాముడు. ఆ సూచన నచ్చింది. లక్ష్మణుని పిలిచాడు. తన అభిప్రాయమడిగాడు. సౌమిత్రి సరే అన్నాడు.

సేతువు కట్టాలి. సముద్రం దాటాలి. ఆవలి తీరం చేరాలి. ఆలస్యమెందుకు? అన్నాడు సుగ్రీవుడు.

రామునికి ధైర్యం చెప్పాడు సుగ్రీవుడు. రెండవ సర్గ 13 శ్లోకంలో సముద్రానికి వారథి నిర్మిద్దాం. ఆవలి తీరం చేరుదాం – అని సూచించాడు సుగ్రీవుడు. ఇపుడు సముద్రం ఎలా దాటాలని విభీషణుని సలహా అడిగాడు అంటే – తను ఊహించిన సేతు బంధనం సమంజసమని భావించాడని తలచాలి మనం.

## శార్దూలుడు

శార్దూలుడొక గూఢచారి. వేగుల్లో సమర్థుడు. రావణుని చేత పంపబడ్డాడు. సముద్రతీరం చేరాడు. సుగ్రీవుని సేనని నిశితంగా పరిశీలించాడు. వెనక్కి వెళ్ళాడు. లంక చేరాడు. రావణుని సమీపించాడు. రాజా! వానర భల్లూక సేన అపారం. ఇంత అని లెక్కించలేం. సేనలో ప్రవేశించ వీల్లేకుండా ఉంది. పది యోజనాలు వ్యాపించి ఉంది. రెండో సముద్రంలా ఉంది. ఉత్తమ ఆయుధ ధారులై ఉన్నారు రామ లక్ష్మణులు. సీత కోసం తప్పక వస్తారు. నిజం చెబుతున్నాను. సామ దాన భేదోపాయాలు ప్రయోగించు. దండోపాయానికి ఆస్కారం లేదు.

విన్నాడు రావణుడు. కలవరపడ్డాడు. ఆలోచించాడు. కార్యవేత్తల్లో సమర్థుడు శుకుడు. వాణ్ణి పిలిచాడు. సముద్ర తీరం చేరు. సుగ్రీవుణ్ణి చూడు – భయపడకు. తడబడకు. నా సందేశం వినిపించు.

## రావణ సందేశం

సుగ్రీవా! నీవు మహారాజువి. ఋక్ష రజని పుత్రుడవు. సత్కులంలో పుట్టావు. నీవు నాకు తమ్ముడవు. రామునితో చేరావు. నీకేం లాభం? రాముని భార్యని ఎత్తుకుని వచ్చాను. నీకేం సంబంధం? నీవు బుద్ధిశాలివి. ఆలోచించు. నీ దారిన నీవు పో. కిష్కింధ చేరుకో. హాయిగా వుండు. ఈ లంకా నగరానికి దేవతలు గంధర్వులు ఎవ్వరూ రాలేరు. ఇక నరులు వానరులు ఏం వస్తారు? – అది రావణుని సందేశం.

విన్నాడు శుకుడు. చిలుక రూపం ధరించాడు. ఆకాశానికెగిరాడు. సుగ్రీవుణ్ణి చూశాడు. రావణ సందేశం యథాతథంగా చెప్పాడు. చూశారు వానరవీరులు.



ఆకాశానికెగిరారు. వాణ్ణి పట్టుకున్నారు. దించారు కిందికి. పిడికిళ్ళతో పొడిచారు. రెక్కలు విరుస్తున్నారు. పీడిస్తున్నారు వాణ్ణి. గట్టిగా అరిచాడు. ''రామా! దూతని చంపుతారా? అది రాజధర్మం కాదు. నన్ను కొడుతున్నారు. వీళ్ళని వారించు. నన్ను చంపేస్తారేమో! తన స్వామి చెప్పిన మాటలు వింటాడు దూత. అవే చెబుతాడు. వారి అభిప్రాయాలు చెప్పేవాడు వధార్హుడు కాడు'' అన్నాడు.

విన్నాడు రాముడు. అతణ్ణి చంపవద్దు అన్నాడు. అభయమిచ్చాడు. ఆకాశానికి ఎగిరాడు శుకుడు. అక్కడే నిలుచున్నాడు. ''సుగ్రీవా! నీవు శక్తిమంతుడవు. బలవంతుడవు. లోకాల్ని గగ్గోలు పెట్టిస్తాడు రావణుడు. అతనికేం చెప్పాలి'' – అని అడిగాడు.

బదులిస్తున్నాడు సుగ్రీవుడు. 'మీ రావణునితో ఇలా చెప్పు. నీవు నాకు స్నేహితుడవు కాదు. నీవు నాకేం ఉపకారం చేయలేదు. నాకు ఇష్టుడవు కావు. నా మిత్రుడు రాముడు. అతనికి విరోధివి నువ్వు. నా శత్రువు వాలి. అతనికి మిత్రుడవు నీవు. కనుక నీవు నాకు విరోధివి. వాలి లాగే నీవూ వధార్హుడివి. త్వరలో మహాసేనతో వస్తాను. నీ లంకను ముట్టడిస్తాను. నీ నగరాన్ని భస్మం చేస్తాను. నిన్ను, నీ కొడుకుల్ని, నీ బంధువుల్ని, నీ జ్ఞాతుల్ని చంపుతాను. రావణా! నీవు మూఢుడవు. నిన్ను దేవేంద్రుడు దాచినా, దేవతలు దాచినా, సూర్యపథానికి పోయినా, పాతాళానికి పోయినా నిన్ను రాముడు వదలడు. చంపేస్తాడు. ముల్లోకాల్లో నిన్ను రక్షించేవాడు వుండడు. ఇక రాక్షసులు, అసురులు నిన్ను రక్షించలేరు. ముసలివాడైన జటాయువుని చంపావు. అలాగే అందరినీ చంపాలనుకున్నావు. రామలక్ష్మణులుండగా సీతని సమీపించలేని పిరికివాడివి. దొంగచాటుగా ఎత్తుకుపోయిన పిరికివాడివి. ఆమెను తెచ్చావు. రాబోయే కష్టం తెలీదు నీకు. త్వరలో రాముడు వస్తాడు. నీ ప్రాణం తీస్తాడు. అది నీవు ఎరుగవు'.

అలా ముగించాడు సుగ్రీవుడు. వెంటనే అందుకున్నాడు అంగదుడు. ''రాజా! వీడు దూత కాడు. గూఢచారి. మనతో మాట్లాడుతున్నాడు. అటు ఇటు చూస్తున్నాడు. మన బలగాన్ని, మన శక్తి సామర్థ్యాల్ని పరిశీలిస్తున్నాడు. వీణ్ణి లంకకు పోనివ్వరాదు. ఇపుడే బంధిద్దాం''.

విన్నాడు సుగ్రీవుడు. వెంటనే ఆజ్ఞాపించాడు. కపివరులు ఆకాశానికెగిరారు. శుకుణ్ణి పట్టారు. బంధించారు. అనాథలా ఏడ్వసాగాడు వాడు.

''దశరథ కుమారా! మహాత్మా రామా! రక్షించు'' అని అరుస్తున్నాడు. ఏడుస్తున్నాడు. నా రెక్కలు నా కళ్ళు పెరికేస్తున్నారు. నన్ను చంపేస్తారు. రామా! రక్షించు. లేకపోతే నా పాపాలన్న నీకు చుట్టుకుంటాయి''.

విన్నాడు రాముడు. దూతను చంపవద్దు – ఆదేశించాడు.

## దర్భశయనుడు

సుగ్రీవుడు లక్ష్మణుడు తెచ్చారు దర్భలు. అందుకున్నాడు రాముడు. ఇసుక తిన్నెపై పరచాడు. తూర్పు వైపు తిరిగాడు. సముద్రునికి నమస్కరించాడు. దర్భలపై పడుకున్నాడు. తన కుడి భుజాన్ని తలగడగా చేసుకున్నాడు. శయనించినపుడు ఆ చేయి సీతమ్మకు తల దిండుగా అమరేది. ఆ చేయి ఎర్రని కాంతులు విరజిమ్ముతోంది. ఆ చేయి శత్రువుల్ని నిలువరించేది. వారిని శోక నిమగ్నులను చేసేది. భూ మండలానికి అభయమిచ్చేది ఆ చేయి. బాణ ప్రయోగంలో వింటి నారి రాపిడికి కాయలు కాసిన చేయి అది.

**"తరణం వా అథ మరణం సాగరస్య వా"**

నేను సముద్రాన్ని దాటటమో లేక సముద్రునికి మరణమో – అది రాముని నిశ్చయం. సముద్రుణ్ణి ప్రసన్నునిగా చేసుకోవాలి. మనసా వాచా కర్మణా ఉపాసించాలి



– అది రాముని నిర్ణయం. అలా నీతిజ్ఞుడు ధర్మవత్సలుడు దర్భశయనుడైనాడు రాముడు. సముద్రుణ్ణి ఉపాసిస్తున్నాడు. అలా మూడు రాత్రుళ్ళు గడిచాయి. అయినా సముద్రుడు సాక్షాత్కరించలేదు. కోపం వచ్చింది రామునికి. కనుకొనలు ఎఱ్ఱబారాయి. దగ్గరలో సౌమిత్రి కనిపించాడు. పిలిచాడు. అంటున్నాడు.

సముద్రుడు దర్శనమివ్వలేదు. వీడు గర్వోన్నతుడు. శాంతం క్షమ ఋజువర్తనం ప్రియ భాషణం – ఈ నాలుగు సత్పురుషుల లక్షణం. గుణహీనులు చూస్తారు. ఆ సత్పురుషుల్ని అసమర్థులని భావిస్తారు. తమని తామే పొగుడుకుంటారు. వాళ్ళు దుష్టులు. నిర్దయులు. కర్తవ్య హీనులు. న్యాయా న్యాయ విచక్షణా రహితులు. కఠినాతి కఠినంగా శిక్షించేవారు – ఈ అయిదుగురిని లోకం గౌరవిస్తోంది. శమ దమాది సద్గుణ సంపన్నుణ్ణి అగౌరవ పరుస్తుంది. వాళ్ళు శాంత స్వరూపులు. వాళ్ళకి కీర్తి ప్రతిష్ఠలు సంప్రాప్తించవు. సామోపాయంతో విజయం లభించదు. దండోపాయమే పరమ సాధనం.

లక్ష్మణా! ఈ సముద్రుని మీద బాణాలు వేస్తాను. మొసళ్ళు జలచరాలు ముక్కలు ముక్కలైపోతాయి. నీటిపై తేలుతాయి. పెద్ద పెద్ద పాములు చేపలు చచ్చి నీటిపై తెలియాడుతాయి. సముద్ర జలాలు ఇంకిపోతాయి. శంఖాలు ముత్యపు చిప్పలు బయట పడతాయి. తమ్ముడా! ఈ సముద్రుడు నా ఓర్పుని చూశాడు. నన్ను చేతకానివాణ్ణి అనుకున్నాడు. నన్ను ఉపేక్షించాడు. ఇక వీణ్ణి క్షమించరాదు. సామోపాయంతో సాక్షాత్కరించడు. నా విల్లు అందుకో. విషసర్పాల్లాంటి బాణాలు ఇవ్వు. క్షణంలో ఈ సముద్రుణ్ణి శుష్కింప చేస్తాను అపుడు వానరులు నడిచిపోవచ్చు. మనం వారిని అనుసరించవచ్చు. తమ్ముడా! సముద్రుడు ఎండిపోడు అంటారు. నేనిపుడు ఆ పని చేస్తాను. చెలియలికట్ట బద్దలవుతుంది. భూమి అంతా వరదమయమవుతుంది అన్నాడు రాముడు.

సౌమిత్రి అందించాడు ధనుస్సు. అందుకున్నాడు రాముడు. సముద్రాన్ని తేరిపార చూశాడు. క్రోధపూరితుడైనాడు. ప్రళయకాలాగ్నిహోత్రంలా జ్వలించాడు. చూడశక్యం కానివాడైనాడు. విల్లుని పిడికిట పట్టాడు. నారి సవరించాడు. ధనుష్టంకారం గావించాడు. జగత్తు కంపించింది. మహోగ్రంగా బాణాలు సంధించాడు. ప్రయోగించాడు. అవి దేవేంద్రుని వజ్రాయుధంలా పడ్డాయి సముద్రంలో.

జల జంతువులు చెదిరాయి. భయంకర ధ్వనితో గాలి వీచింది. వింధ్యపర్వతం అంత ఎత్తు లేచాయి కెరటాలు. వందలకొద్దీ మొసళ్ళు తిమింగలాలు క్షోభించాయి. శంఖాలు ముత్యపుచిప్పలు తేలియాడాయి. ఆ బాణాలు పాతాళం చేరాయి. అక్కడ దానవుల్ని పీడించాయి. క్రోధంతో నిట్టూర్చాడు రాముడు. మరో బాణం తీశాడు. చూశాడు లక్ష్మణుడు. ఒక్క అంగలో రాముణ్ణి చేరాడు. ధనుస్సు గట్టిగా పట్టాడు. ఇక చాలు అన్నాడు.

శరణాగతి చేశాడు విభీషణుడు. అభయమిచ్చాడు రాముడు. తనకు శరణాగతి ఫలించింది. అలాగే సముద్రునికి శరణాగతి చేస్తే కార్యం సఫలమవుతుందనుకున్నాడు విభీషణుడు. సర్వమూ త్యజించిన వాడు – అనన్య గతి లేనివాడు – అకించనుడు శరణాగతి చేస్తే ఫలిస్తుంది. రాముడు ఆ కోవలోకి రాడు. ఇక్కడ నరునిగా శరణాగతికి అర్హుడు. కానీ నారాయణునిగా అర్హుడు కాడు. ఆ స్వామి సర్వ రక్షణుడు. అతనికి పైవాడు లేడు. శరణాగత రక్షకుడు ఆశ్రిత వత్సలుడు అతడే. విభీషణుణ్ణి సుగ్రీవ లక్ష్మణులను గౌరవించాలని శరణాగతికి ఒప్పుకున్నాడు. లోక మర్యాద కోసం మూడు రోజులు దర్భశయనుడైనాడు. ఇక నారాయణునిగా సంకల్పించాడు. సముద్రాన్ని ఎండగట్టాలనుకున్నాడు.

## బ్రహ్మాస్త్ర ప్రయోగం

రఘువంశ శ్రేష్ఠుడు రాముడంటున్నాడు. ''సముద్రుడా! నిన్ను పాతాళం వరకు ఎండగొడతాను. జలాలు, జల జంతువులు దగ్ధమైపోతాయి. నా బాణాలతో సేతువు కడతాను. కాలి నడకతో వానరసేన వెడుతుంది. ఆవలి తీరం చేరుతుంది. నీలో దానవులున్నారు. ఆ సహవాస దోషం నీది. అందుకే నా బలాన్ని, నా పరాక్రమాన్ని తెల్సుకోలేకపోతున్నావు. భవిష్యత్తులోని ఆపదలు గుర్తించలేకున్నావు.

బ్రహ్మాండం లాంటి బాణం తీశాడు. ధనుస్సుకి సంధించాడు. నారిని ఆకర్ణాంతం లాగాడు. బ్రహ్మాస్త్ర మంత్రం స్మరించాడు. అంతే. భూమ్యాకాశాలు పగిలిపోయేంత శబ్దం వచ్చింది. పర్వతాలు కంపించాయి. లోకమంతా చీకట్లు ముసురుకున్నాయి. సరస్సులు నదీ నదాలు అల్ల కల్లోలమైనాయి. నక్షత్రాలు, సూర్యచంద్రులు వక్రగతిలో సాగారు. వందల ఉల్కలు ఆకాశంలో కనిపించాయి. అంతరిక్షం లోంచి పిడుగులు పడ్డాయి. ఆకాశంలో వాయు సంఘర్షణలు ఏర్పడ్డాయి. మహాధ్వనులు పుట్టాయి. సుడిగాలులు తిరగసాగాయి. వృక్షాలు ఛిన్నా భిన్నమైనాయి. పర్వత శిఖరాలు ముక్కలు ముక్కలైనాయి. మేఘాలు ఢీకొన్నాయి. మెరుపులు అగ్నిజ్వాలలు కమ్ముకున్నాయి. పిడుగులు పడ్డాయి. ప్రాణులన్నీ భయంతో అరిచాయి. కొన్ని ప్రాణాలు అచేతన స్థితి లోనికి జారాయి. పిశాచాలు వికృతంగా ధ్వనులు చేశాయి.

**(సశేషం)**



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

గత సంచిక తరువాయి

## హృదయరాగం

కృష్ణలీలావిలాసాలు చెప్పాలంటే వసంత ఋతువు కావాలి! అందుకే వసంతాన్ని వర్ణించబోయే ముందు ఆశీర్వచనపూర్వక మంగళాలను అందిస్తూ కృష్ణభక్తులను అభినందిస్తున్నాడు కవి జయదేవుడు.

**పద్మా పయోధర తటీ పరిరంభ లగ్న**
**కాశ్మీర ముద్రితమురో మధుసూదనస్య ।**
**వ్యక్తానురాగమివ ఖేలదనంగ ఖేద**
**స్వేదాంబుపూర మనుపూరయతు ప్రియం వః ॥ 6 ॥**

ప్రతిపదార్థం

పద్మా = లక్ష్మీదేవి యొక్క; పయోధర తటీ = వక్షస్థలమును; పరిరంభ = కౌగిలించుకొనుట వల్ల; లగ్న = హత్తుకున్న; కాశ్మీర ముద్రితమురో = కుంకుమపువ్వు గుర్తులతో ముద్రించబడిన వక్షస్థలము గలవాడైన; మధుసూదనస్య = మధువు అనే రాక్షసుడిని సంహరించిన శ్రీకృష్ణుని యొక్క; వ్యక్తానురాగమివ = వ్యక్తమవుతున్న అనురాగంలాగా; ఖేలదనంగ = మన్మథ క్రీడ వల్ల కలిగిన; ఖేద స్వేదాంబుపూర = శ్రమ వల్ల కలిగిన చెమట బిందువులు; మనుపూరయతు = మీకు సమృద్ధిగా కలిగించుగాక; ప్రియం వః = మీకు ఇష్టమైన శుభాలను/శ్రేయస్సును.

విశేషాలు

**శృంగార భక్తి:** ఈ శ్లోకం భగవంతుడికి మరియు లక్ష్మీదేవికి మధ్య గల దివ్యమైన అనురాగాన్ని శృంగార రసంలో వర్ణిస్తూనే, అది భక్తులకు శుభప్రదమని పేర్కొంటుంది.

రాక్షస సంహారకుడు - ప్రేమికుడు: మధు అనే రాక్షసుడిని సంహరించిన పరాక్రమవంతుడైన 'మధుసూదనుడు', లక్ష్మీదేవి ప్రేమకు లోనయ్యే కోమలత్వాన్ని ఇక్కడ చూడవచ్చు.

శబ్ద సౌందర్యం:

**అలంకారం:** ఇందులో 'ఉత్ప్రేక్షాలంకారం' స్ఫురిస్తోంది. చెమట బిందువులను వారి మధ్య ఉన్న అనురాగమే బయటకు ప్రవహిస్తోందా అన్నట్లుగా కవి వర్ణించాడు.

**నాద సౌందర్యం:** 'పద్మా పయోధర తటీ', 'ఖేలదనంగ ఖేద' వంటి పదప్రయోగాలు జయదేవుని విశిష్టమైన కోమల పదశైలిని, నాద సౌందర్యాన్ని చాటుతున్నాయి.

తాత్పర్యం:

ఆయన రాధ కౌగిలిలో విశ్రమిస్తుండగా, మధుసూదనుని కాషాయ వక్షస్థలం, ఆయన హృదయంలోని ప్రగాఢ ప్రేమ బహిర్ముఖంగా వ్యక్తమవుతున్నట్లుగా, అనురాగపు



(వాంఛ) గుర్తులైన ఎఱ్ఱని చెమట బిందువులతో తడిసి ఉంది. తన ప్రియురాలితో సంయోగ సమయంలో ఈ విధంగా అలంకరించబడిన మధుసూదనుని విశాల వక్షస్థలం, మీ అందరి హృదయ వాంఛలను నెరవేర్చుగాక.

రాధను ఆలింగించినప్పుడు కుంకుమరాగశోభితమైన ఆమె కుచపర్వతాల నుంచి అంటిన కుంకుమరంగు శ్రీకృష్ణుని వక్షస్థలంమీద ప్రకాశిస్తోంది. కాశ్మీర హిమపర్వతాలు కుంకుమ పుష్పాలకు ప్రసిద్ధి కదా! రాధపట్ల ఆయనకు గల ప్రేమానురాగాలు ప్రస్ఫుటమై కనిపించే 'హృదయరాగం' అది! రతికేళీకలాపం వలన పేరిన చెమట బిందువులను ఆయన హృదయస్థలి పైన తాండవ మాడుతుంటే, ప్రకాశిస్తున్న ఆ వక్షస్థలం మీకూ నాకూ కూడా ఇష్టార్థాలు తీర్చు గాక!

శ్రీకృష్ణుని మనస్సు తనకే సొంతం కావాలని కుంకుమ ముద్రలు వేసినట్లుంది రాధ. ఆ అయ్యకు ఏ అమ్మపైన ప్రీతి మెండో! ఎవరికి తెలుసు? ఎవరికివారు 'స్వామి తనకే స్వంతం' అనిపించేయ గల నేర్పరి ఆయన! కృష్ణుని హృదయాన్ని మరొకరు అపహరించకుండా రాధ తన అనురాగపు తాళాలు వేసి, బంధించి, పైన ఎఱ్ఱని లక్కముద్రలు వేసిందా! అనిపిస్తుంది కుంకుమ అలదిన ఆయన వక్షస్థలం. ఈ కుంకుమ "పరిరంభ లగ్నం!" రాధను ఆలింగించుకొన్నప్పుడు అంటినది! ఆయన హృదయంలో ఆమె పట్ల గల అనురాగానికి అది శాశ్వతచిహ్నం.

భావార్థం

లక్ష్మీదేవి తన వక్షస్థలానికి రాసుకున్న కుంకుమపువ్వు (కాశ్మీర) పూత, శ్రీకృష్ణుడిని గాఢంగా కౌగిలించుకోవడం వల్ల ఆయన వక్షస్థలంపై ముద్రలాగా హత్తుకుంది. ఆ కౌగిలిలో మన్మథ క్రీడ వల్ల కలిగిన శ్రమతో కూడిన చెమట బిందువులు, వారి మధ్య ఉన్న గాఢమైన అనురాగాన్ని వ్యక్తపరుస్తున్నాయి. అటువంటి మధుసూదనుని దివ్యమైన వక్షస్థలం మీకు సమస్త శుభాలను, ప్రియమైన కార్యాలను చేకూర్చుగాక.

## మదనజ్వరం

**వసంతే వాసంతీకుసుమ సుకుమారై రవయవై**
**ర్భ్రమంతీం కాంతారే బహు విహిత కృష్ణానుసరణామ్ ।**
**అమందం కందర్ప జ్వర జనిత చింతాకులతయా**
**వలద్బాధాం రాధాం సరసమిదముచే సహచరీ ॥ 7 ॥**

ప్రతిపదార్థం

వసంతే = వసంత కాలమునందు; వాసంతీ కుసుమ = మల్లెపూల వలె (వాసంతీ పూల వలె); సుకుమారైః అవయవైః = సుకుమారమైన అవయవములు కలిగినది; భ్రమంతీం కాంతారే = అడవిలో (బృందావనంలో) పరితపిస్తూ తిరుగుతున్నది; బహు విహిత కృష్ణానుసరణామ్ = అనేక మార్గాల్లో శ్రీకృష్ణుని వెతుకుతూ అనుసరిస్తున్నది; అమందం = మిక్కిలి ఎక్కువగా; కందర్ప జ్వర = మన్మథ తాపం (విరహ వేదన) అనే జ్వరం వల్ల; జనిత చింతాకులతయా = కలిగిన చింతతో కూడిన ఆకులతో; వలద్బాధాం = చుట్టుముట్టిన బాధతో ఉన్న; రాధాం = రాధను ఉద్దేశించి; సరసమిదముచే సహచరీ = చెలికత్తె (సహచరి) సరసముగా ఈ విధంగా పలికెను.

విశేషాలు

**విరహ వర్ణన:** ఈ శ్లోకం రాధాకృష్ణుల మధ్య ఉన్న విరహ భక్తిని, రాధ పడే వేదనను ఎంతో గాఢంగా చిత్రీకరిస్తుంది.

**వసంత కాల ప్రాశస్త్యం:** ప్రకృతి పరవశించే వసంత కాలంలో, రాధ పొందే విరహం ఆమె సుకుమారమైన ప్రకృతికి విరుద్ధంగా, ఎంతో భారంగా ఉన్నట్లు వర్ణించబడింది.

శబ్ద సౌందర్యం:

**పద మాధుర్యం:** 'వాసంతీ కుసుమ సుకుమారై రవయవై' వంటి పద ప్రయోగాలు జయదేవుని విశిష్టమైన "కోమల కాంత పద విన్యాసానికి" నిదర్శనం.

**అనుప్రాస:** ఈ శ్లోకంలో పదాలు ఒకదానితో ఒకటి లయబద్ధంగా కలిసిపోయి, చదివేటప్పుడు ఒక మధురమైన సంగీతానుభూతిని కలిగిస్తాయి.

తాత్పర్యం:

ఒకానొక రమణీయమైన వసంత ఋతువులో, రాధిక కృష్ణుని కోసం తపిస్తూ, ఒకదాని తర్వాత మరొక వనంలో అతని కోసం వెతకడం ప్రారంభించింది. మృద్వ పుష్పాల వలె మృదువైన ఆమె సుందరమైన, యవ్వనపు అవయవాలు అలసిపోయాయి మరియు మన్మథుడు ఆమె మనస్సును ఆందోళనతో కలవరపరిచాడు. ఆ సమయంలో, ఆమె ప్రాణ స్నేహితురాలు ఆమెను ప్రేమగా ఈ విధంగా పిలిచింది.

రోజులన్నీ ఒకేలా వుండవు కదా! కృష్ణుడేమయ్యాడో! విరహసంతప్తచిత్త, వసంత వైభవతాప జనిత వ్యాకులతా సంచలితగా మిగిలింది రాధ. ఒంటరి రాధ. శ్రీకృష్ణుడు లేని లోకంలో రాధకెవరున్నారు? ఎవరో ఒక చెలికత్తె ఆసరా? ఆమె మాత్రం ఎంత ఉపచారాలు చేసినా ఏం ప్రయోజనం? ఏ జ్వరాన్నయినా ఔషధ సేవన చేసి తగ్గించుకోవచ్చు గానీ, కందర్పజ్వరజనిత చింతకు నివారణ ఏముంటుంది? మదనజ్వరానికి మందు లేదు కదా!

అసలే సుకుమారి రాధ! బండిగురివిందపూవంత సుకుమారి! ఆకృష్ణుని వెదుకుతూ చెట్లు చేమలు పట్టుకొని వనమంతా తిరుగుతోంది. తోడుగా ఒక చెలికత్తె, పాపం రాధ విరహవేదనని చూడలేక పోతోంది. ఇలానే కొనసాగితే రాధ



ఏమైపోతుందోనని భయం. "పోనీ! ఒక పని చేయరాదూ? అని ఏదో సూచించ బోయింది చెలికత్తె. కృష్ణ సమాగమం సాధ్యమవుతుందంటే, ఎంతటి కష్టానికైనా సిద్ధమైన రాధ! చెలికత్తె చెప్పేది వింటోంది....

భావార్థం

వసంత కాలంలో, మల్లెపూల వలె అతి సుకుమారమైన అవయవాలు కలిగిన రాధ, కృష్ణుని కోసం బృందావనమంతా వెతుకుతూ పరితపిస్తోంది. మన్మథుని వల్ల కలిగిన విరహ వేదనతో ఆమె హృదయం చింతాక్రాంతమై ఉంది. అటువంటి బాధలో ఉన్న రాధను చూసి, ఆమె చెలికత్తె ఆమెకు ఊరట కలిగిస్తూ, కృష్ణుని లీలలను వివరిస్తూ ఈ విధంగా పలికింది.

ముగింపు (ఫలశ్రుతి)

ఈ జయదేవుని మంగళ గీతం శ్రోతలకు అమితమైన ఆనందాన్ని, మంగళాన్ని కలిగిస్తుందని, దేవుడికి నిరంతరం విజయం కలగాలని ఈ స్తోత్రం ముగుస్తుంది.

## అష్టపది – 3

ప్రథమ సర్గము – సామోద దామోదర: ॥ ప్రబంధః - 3 ॥
(మాధవోత్సవ కమలాకరమ్) – (వసంత రాగం – ఆది తాళం)
మాధవోత్సవ కమలాకరమ్- వసంత రాగ యతి తాళాభ్యాం గీయతే ।
లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే ।
మధుకర నికర కరంబిత కోకిల కూజిత కుంజ కుటీరే ॥
విహరతి హరిరిహ సరస వసంతే నృత్యతి
యువతీ జనేన సమం సఖి! విరహి జనస్య దురంతే ॥ 1 ॥ (ధ్రువమ్)
ఉన్మద మదన మనోరథ పథిక వధూజన జనిత విలాపే ।
అలి కుల సంకుల కుసుమ సమూహ నిరాకుల వకుళ కలాపే ॥ 2 ॥
మృగమద సౌరభ రభస వశంవద నవదళ మాల తమాలే ।
యువజన హృదయ విదారణ మనసిజ నఖ రుచి కింశుక జాలే ॥ 3 ॥
మదన మహీపతి కనక దండ రుచి కేసరకుసుమ వికాసే ।
మిళిత శిలీముఖ పాటల పటల కృత స్మర తూణ విలాసే ॥ 4 ॥
విగళిత లజ్జిత జగదవలోకన తరుణ కరుణ కృతహాసే ।
విరహి నికృంతన కుంత ముఖాకృతి కేతక దంతురితాశే ॥ 5 ॥
మాధవికా పరిమళ లలితే నవ మాలతి జాతి సుగంధౌ ।
ముని మనసామపి మోహనకారిణి తరుణా కారణ బంధౌ ॥ 6 ॥
స్ఫురదతిముక్త లతా పరిరంభణ ముకుళిత పులకిత చూతే ।
బృందావన విపినే పరిసర పరిగత యమునా జల పూతే ॥ 7 ॥
శ్రీ జయదేవ భణితమిద ముదయతి హరి చరణ స్మృతి సారమ్ ।
సరస వసంతసమయ వనవర్ణన మనుగత మదన వికారమ్ ॥ 8 ॥
దర విదళిత మల్లీ వల్లి చంచత్పరాగ
ప్రకటిత పట వాసైర్వాసయన్కాననాని ।
ఇహ హి దహతి చేతః కేతకీ గంధ బంధుః
ప్రసర దసమబాణ ప్రాణవద్గంధవాహః ॥ 8 ॥
ఉన్మీలన్మధు గంధ లుబ్ధ మధుప వ్యాధూత చూతాంకుర
క్రీడత్కోకిల కాకలీ కలరవై రుద్గీర్ణ కర్ణ జ్వరాః ।
నీయంతే పథికైః కథం కథమపి ధ్యానానుధాన క్షణ
ప్రాప్త ప్రాణసమా సమాగమ రసోల్లాసై రమీ వాసరాః ॥ 9 ॥
అనేక నారీ పరిరంభ సంభ్రమ
స్ఫురన్మనోహారి విలాస లాలసమ్ ।
మురారిమారా దుపదర్శయంత్యసౌ
సఖీ సమక్షం పునరాహ రాధికామ్ ॥ 10 ॥

3వ అష్టపదిలో, అద్భుతమయిన బృందావన వర్ణన ఇవ్వబడింది ...

వసంత ఋతువులో కృష్ణ విరహంతో, కృష్ణుడిని వెతుకుతూ, వడిలిన అడవి మల్లెపువ్వు లాగా, సుకుమారమయిన శరీరంతో విహరిస్తున్న రాధతో, చెలికత్తె, ఇలా అంటున్నది. "మన మనసులు కూడా గోపికలై, యమునా తీరవిహారి అయిన కృష్ణుడిని, వేణుగాన సమ్మోహనుడిని, బృందావనంలో

దర్శిస్తున్నట్టుగా భావించుకుందాం.

మదనవేదనపడ్తోన్న రాధని ఊరడిస్తూ, "శ్రీకృష్ణుడు ఎక్కడెక్కడ తిరుగుతుంటాడో, వివరాలు చెప్పి, స్వామి రాకపోతేనేం! స్వామి దగ్గరకు నువ్వే వెళ్లు" అని ప్రోత్సహిస్తోంది చెలికత్తె.

భావార్థం

శృంగారభావాల్ని ఉద్దీపింపజేసే వసంతం ఈ గీతంలో వర్ణింపబడింది. రాధ వసంతోదయం వల్ల తన మనస్సులో శ్రీకృష్ణునందలి అనురాగం ఉద్దీప్తం కాగా విరహంతో బాధపడుతున్నది. ఆ సమయంలో చెలి రాధ వద్దకు వచ్చి ఇదే వనంలో శ్రీకృష్ణుడు వేరే యువతులతో ఆనందంతో క్రీడిస్తున్నాడు వెళ్లి చూడు అంటుంది.

**లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే ।**
**మధుకర నికర కరంబిత కోకిల కూజిత కుంజ కుటీరే ॥**
**విహరతి హరిరిహ సరస వసంతే నృత్యతి**
**యువతీ జనేన సమం సఖి! విరహి జనస్య దురంతే ॥ 1 ॥ (ధ్రువమ్)**

ప్రతిపదార్థం:

లలిత లవంగ లతా = సుకుమారమైన లవంగ తీగలను; పరిశీలన = స్పృశిస్తూ (తాకుతూ); కోమల మలయ సమీరే = మలయపర్వతం నుండి వీచే మెల్లని, చల్లనిగాలి (మలయ మారుతం); మధుకర నికర = తుమ్మెదల సమూహాల యొక్క (ఝుంకారాలతో); కరంబిత = మిశ్రమమైన; కోకిల కూజిత = కోకిలల కుహూ కుహూ రావాలతో; కుంజ కుటీరే = పొదరిళ్ళలో; విహరతి హరిః = శ్రీకృష్ణుడు (హరి) విహరిస్తున్నాడు; సరస వసంతే = రసమయమైన ఈ వసంతకాలంలో; నృత్యతి = నర్తిస్తున్నాడు; యువతీ జనేన సమం = గోపికలతో కలిసి.

విరహి జనస్య దురంతే = వసంతకాలం అందరికీ ఆనందాన్ని ఇస్తుంది, కానీ ప్రియులకు దూరంగా ఉన్న



విరహులకు మాత్రం ఇది భరించలేని వేదనను (దురంతే - అంతం లేని బాధ) కలిగిస్తుంది. జయదేవుడు ప్రకృతిలోని సౌందర్యాన్ని వర్ణిస్తూనే, విరహంలోని గాఢతను కూడా ఇక్కడ సూచించారు.

విశేషాలు

**ధ్రువపదం (పల్లవి):** ఇందులో "విహరతి హరిరిహ..." అనే భాగం పల్లవి వంటిది. ప్రతి చరణం చివర దీనిని పునరావృతం చేస్తారు.

**శబ్దాలంకారం:** ఈ అష్టపదిలో లకార ప్రాస (లలిత, లవంగ, లతా, కోమల, మలయ) వింటుంటేనే ఒక రకమైన సంగీత లయ వినిపిస్తుంది. అందుకే దీనిని 'లలిత పద విన్యాసం' అంటారు.

తాత్పర్యం:

అతను రాగానే మలయ గాలి ఎంతో మనోహరంగా ఉంటుంది, అది లేత, మనోహరమైన తీగలను పదే పదే ఆలింగనం చేసుకుంటుంది. కోకిలల మధురమైన 'కుహూ' శబ్దంతో, అటూ ఇటూ తిరిగే తేనెటీగల ఝుంకారంతో ఆ అడవి పొదరిల్లు అంతా నిండిపోతుంది.

అంతేకాకుండా, వసంతం పరిపూర్ణంగా వికసించినప్పుడు మరియు ప్రేమ (భక్తి) ఉత్సవంలో మునిగి ఉన్నప్పుడు, హరికూడా తన గోపికలతో కలిసి ఈ వన గర్భగుడిలో నృత్యం చేస్తున్నాడు.

వసంత ఋతువు... చల్లని గాలి కోమలమయిన లవంగ తీగల పైనుంచి వీస్తోంది. తుమ్మెదల ఝుంకారాలు, కోకిల రవాలు కలసి, పొదరిళ్ళలో ప్రతిధ్వనిస్తున్నాయి. పొగడ పూల గుత్తుల మీద వాలే గండు తుమ్మెదలతో నిండు వసంతం ప్రకాశిస్తోంది.

కానుగ చెట్లను అల్లుకున్న చిగురుటాకు లతల నుండి, కస్తూరి వాసనలు విరజిమ్ముతున్నాయి. విరహాన్ని చీల్చే, మన్మథుడి పదునయిన గోళ్ళ వంటి మోదుగ పూలతో వసంత ఋతువు శోభాయమానంగా ఉంది.

రాధా! కోమలమైన లవంగపు తీగెలపై నుండి చల్లని పిల్లగాలులు మెల్లమెల్లగా వీస్తున్నాయి. లవంగ తీగల్ని తాకి, మలయమారుతాలు మరీ కోమలంగా అనిపిస్తున్నాయి కదూ! తుమ్మెదలు ఝుమ్మని నాదం చేస్తుంటే, వాటి ప్రతిధ్వనులతో పొదరిళ్ళన్నీ నిండిపోతున్నాయి.

కోకిలలు కుహూకుహూమంటుంటే ఎంత మనోహరంగా అనిపిస్తోందో చూడూ! ఇదంతా వసంతం మహిమేనంటావా? విరహంలో వున్నవాళ్ళు ఈ వసంతకాలంలో ఎంత తల్లడిల్లిపోతుంటారో కదా! పద! మనం కూడా బృందావనికే పోదాం. అని తొందరచేస్తోంది చెలికత్తె!

"జవరాళ్ళతో నాట్యం చేస్తున్న శ్రీకృష్ణుణ్ణి బృందావనంలో కనుక్కొన్నాను! అక్కడికి పోయి కృష్ణుణ్ణి చేరితేనే నీ విరహం తగ్గుతుంది. పద! పద! మదన జ్వరానికి మందు మాధవుడే! అతను నీ దగ్గరకు రాకపోతే, నువ్వే అతని దగ్గరకు వెళ్ళు" అని హితబోధ చేస్తోంది చెలికత్తె!

"జవరాళ్ళతో క్రీడిస్తున్నాడా!" పైకి అడగలేకపోయినా రాధ మనసులో అదే సందేహం! "జవసత్త్వాలున్న ఏ ఆడది మాధవుణ్ణి కోరుకోదూ?" మళ్ళీ తనకు తానే సమాధానం. 'జవం' జీవం! జవం అంటే నీళ్ళు కూడా! వసంత మాసంలో నీళ్ళూ విరహాన్ని పెంచుతాయి. బృందావనంలో యమునా తటిలో కృష్ణుడితో ఆడే ఆ జవరాళ్ళెవరో! వాళ్ళు అంతకన్నా నన్ను బాధిస్తున్నారు" అనుకుంటోంది రాధ!

భావార్థం

విరహం పొందినవారికి అంతులేని సంతాపం కలిగించే సరస వసంతంలో శ్రీకృష్ణుడు యువతులతో నృత్యం చేస్తున్నాడు. ఆనందంతో క్రీడిస్తూ విహరిస్తున్నాడు.

**ఉన్మద మదన మనోరథ పథిక వధూజన జనిత విలాపే ।**
**అలి కుల సంకుల కుసుమ సమూహ నిరాకుల వకుళ కలాపే ॥ 2 ॥**

ప్రతిపదార్థం:

ఉన్మద మదన = మత్తెక్కించే (మదాన్ని కలిగించే) మన్మథుని యొక్క; మనోరథ = కోరికల వల్ల (వాంఛల వల్ల); పథిక వధూజన = దేశాంతరాలకు వెళ్ళిన బాటసారుల (పథికుల) భార్యల యందు (విరహవతుల యందు); జనిత విలాపే = పుట్టిన విలాపము (రోదన/దుఃఖము) కలిగినది; అలి కుల = తుమ్మెదల గుంపుల చేత; సంకుల = క్రిక్కిరిసిన (ముసురుతున్న); కుసుమ సమూహ = పూల గుత్తుల చేత; నిరాకుల = నిండిన / మనోహరమైన; వకుళ కలాపే = పొగడ చెట్ల సమూహము (వకుళ వృక్ష సముదాయము) కలిగినది.

విశేషాలు

వకుల (పొగడ) విశిష్టత: పొగడ పూలు తమ గాఢమైన సుగంధానికి ప్రసిద్ధి. తుమ్మెదల గుంపులు ఆ సుగంధానికి ఆకర్షించబడి, ఆ చెట్లపై వాలి ఝుంకారం చేస్తున్నాయి.

శబ్ద సౌందర్యం: ఈ శ్లోకంలో 'కుల', 'కుసుమ', 'వకుళ', 'కలాప' వంటి పదాల ద్వారా జయదేవుడు అద్భుతమైన అనుప్రాస అలంకారాన్ని సృష్టించారు.

తాత్పర్యం:

మద్దతి చెట్లు (మద్ది) పువ్వులతో నిండిపోయాయి. వాటి కొమ్మలపై ఖాళీ స్థలం ఏమీ లేదు. లెక్కలేనన్ని తుమ్మెదల గుంపులు బకుల పువ్వుల (పొగడ పూలు) గుత్తులపై ఝుమ్మని శబ్దం చేస్తున్నాయి. మన్మథుని బాణాలు గోపికలను గాయపరుస్తుండగా, అటువైపు కృష్ణుడు ఇతర గోపికలతో ప్రేమలో మునిగి తేలుతూ నాట్యం చేస్తున్నాడు.

"కృష్ణుడు ఎలా విహరిస్తున్నాడంటావా?" అని అడిగి, తానే చెప్పటం మొదలు పెట్టింది చెలికత్తె. "భర్తలు దేశాంతరాలుపోతే, విరహంతో అహరహం అలసిపోయిన ప్రియురాళ్ళ హృదయాన్ని, పొంగుకొచ్చే మదాన్ని, వెల్లువెత్తిన హర్షాన్ని, పులకరింతనీ మరింత పెంచి, వాళ్ళని ఇంకా ఇంకా ఏడ్పించే తుమ్మెదల ఝుమ్మనే నాదాలతో నిండిన పొగడ చెట్లు ప్రకాశిస్తుంటే వసంత కాలంలో శ్రీకృష్ణుడు బృందావనంలో జవరాండ్రతో విహరిస్తున్నాడు!" అని. కృష్ణుని చూస్తేనే కోరికలు రెచ్చిపోతాయి. చూడకపోతే విరహ వేదనతో నరాలు కుంచించుకుపోతాయి.

భావార్థం

తమ భర్తలు కార్యాంతరంవల్ల బాట వెంబడి విదేశాలకు పోగా వారి ప్రియురాండ్రు మన్మథుని వల్ల తమ మనసులలో పలు రకాలైన కోరికలతో ఎక్కువగా తపించిపోతున్నారు. ఇలాంటి వసంతంలో తుమ్మెదల గుంపులు పువ్వుల చుట్టూ మూగి అలజడి కలిగిస్తున్న పొగడ వృక్షాలు నిండియున్న వనంలో కృష్ణుడు విహరిస్తున్నాడు.

మృగమద సౌరభ రభస వశంవద నవదళ మాల తమాలే।
యువజన హృదయ విదారణ మనసిజ నఖ రుచి కింశుక జాలే॥ 3॥

ప్రతిపదార్థం:

మృగమద = కస్తూరి యొక్క; సౌరభ = సుగంధము (పరిమళము) వంటి; రభస = వేగము/ తీవ్రతకు; వశంవద = లొంగిపోయిన (వశమైన); నవదళ = కొత్త చిగురాకులు/ ఆకులు కలిగిన; మాల తమాలే = నల్లని చీకటి చెట్ల (తమాల వృక్షాల) సమూహము కలిగినది; యువజన = యవ్వనంలో ఉన్నవారి; హృదయ విదారణ = హృదయాలను చీల్చివేసే; మనసిజ = మన్మథుని యొక్క; నఖ రుచి = గోళ్ళ కాంతి వలె ఉన్న; కింశుక జాలే = మోదుగ పూల (మోదుగు పూల) సమూహము కలిగినది.

విశేషాలు

**రంగుల కలయిక:** ఈ చరణంలో జయదేవుడు రెండు విరుద్ధమైన రంగులను ఉపయోగించి అద్భుతమైన చిత్రాన్ని గీశారు:

- **నలుపు (తమాల వృక్షం):** తమాల చెట్లు దట్టమైన నీలపు నలుపు రంగులో ఉంటాయి. ఇది శ్రీకృష్ణుని (శ్యామ సుందరుని) శరీర రంగుకు సంకేతం.
- **ఎరుపు (కింశుక/మోదుగ పువ్వులు):** మోదుగ పూలు అగ్ని కీలల్లాంటి ఎరుపు రంగులో ఉంటాయి. ఇది మన్మథుని తాపానికి, ప్రేమాగ్నికి సంకేతం.

కస్తూరి పరిమళం - ఆధ్యాత్మిక సంకేతం: కవి తమాల



వృక్షాల వాసనను 'మృగమద' (కస్తూరి) పరిమళంతో పోల్చారు. ఆధ్యాత్మికంగా, కస్తూరి మృగం తనలోనే ఉన్న సువాసనను వెతుక్కుంటూ అడవి అంతా తిరుగుతుంది. అలాగే, భగవంతుడు మనలోనే ఉన్నాడని తెలియక మనం బయట వెతుకుతుంటాము. ఇక్కడ కృష్ణుడి సాన్నిధ్యం ఉన్న చోట ఆ దివ్య పరిమళం (తమాల వృక్షాల ద్వారా) వెదజల్లబడుతోందని భావం.

**శబ్ద సౌందర్యం:** ఈ చరణంలో 'మ' మరియు 'న' అక్షరాల ఆవృత్తి ఎక్కువగా ఉంది (మృగమద, మాల, తమాలే, మనసిజ, నఖరుచి). ఈ అక్షరాలు పలకడానికి మెత్తగా, అనునాసిక ధ్వనులతో ఉండి, శృంగార రసానికి తగినట్లుగా వినేవారికి ఎంతో హాయిని కలిగిస్తాయి.

**తాత్పర్యం:**

కొత్త ఆకులతో అలంకరించబడిన తమాల చెట్లు, తమ కస్తూరి వంటి సువాసనను నలుదిశలా వెదజల్లుతూ ఆనందిస్తాయి. సఖీ, చూడు! ఈ నిగనిగలాడే పల్లాస (మోదుగ) పువ్వులు కామదేవుని గోళ్ళను పోలి ఉన్నాయి. శృంగార ప్రేమకు రాజు అయిన ఆ వ్యక్తి, యవ్వన జంటల వక్షోజాలను చీల్చినట్లుగా అనిపిస్తోంది.

బృందావనంలో, గుబురుగా పెరిగిన చీకటి కానుగ చెట్లు కమ్ముకొని ఉంటాయి. కొమ్మకొమ్మ చిగిర్చి కొత్త ఆకులు వేస్తోంది. ఆ కొత్త ఆకుల్లోంచి కస్తూరీ పరిమళం వస్తుంది తెలుసా? అసలే, వసంత మాసం! ఆపైన కస్తూరీ పరిమళం! విరహతాపానికి ఇవి రెండూ ఎంత తోడౌతాయో గదా! సఖీ! ఆ మన్మథుడు ఎంత కఠినుడో గానీ, సరిగ్గా ఇలాంటి సమయం చూసి, మాధవుణ్ణి మనసు లోకి తెచ్చి మదవతుల్ని నిలువుగా చీలుస్తాడు!

అలా చీల్చినప్పుడు, మన్మథుడి గోళ్ళకు చివర అంటిన నెత్తురు లాగా. ఆ బృందావనంలో ఎర్రని పూలతో విరగపూసిన మోదుగ చెట్లు ప్రకాశిస్తూ, విరహి జనుల విరహాన్ని మరింత రెచ్చగొడుతుంటే కృష్ణుడు అక్కడే విహరిస్తున్నాడు. విరహింపచేయడం శ్రీకృష్ణుడనకొక వేడుక కాబోలు!

**భావార్థం**

కస్తూరి పరిమళానికి వశపడిన చిగురాకులు గల కానుగ చెట్లతో, యువజనుల హృదయాలను చీల్చే మన్మథుని గోళ్ళు, కాంతివలె ప్రకాశిస్తున్న మోదుగ పువ్వులతో కూడిన వసంతంతో అడవిలో కృష్ణుడు విహరిస్తున్నాడు.

**(ఇంకా ఉంది)**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## వామన పురాణాంతర్గతం

గత సంచిక తరువాయి

### విష్వక్సేనుని నారాయణాస్త్ర ప్రయోగం

అంతట మహాపరాక్రమశాలియైన విష్వక్సేనుడు ఆ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యచకితుడైనాడు. ఆ రాక్షసులందరిని చూసి 'బాగు బాగు' ని సంతోషంతో సింహనాదం చేశాడు. ఆ తరువాత మేలిమి బంగారు ఛాయతో ప్రకాశిస్తున్న తన దివ్యధనుస్సును చేతపట్టాడు. ఆ మహాధనుస్సు శ్రీమహావిష్ణువు యొక్క మరొక శార్ఙ్గమనే ధనుస్సువలె ఉన్నది. మహాతేజశ్శాలియైన విష్వక్సేనుడు వెంటనే నారాయణాస్త్రాన్ని సంధించాడు. ఆ మహాస్త్రాన్ని మృత్యువు వలె దేవాసురులకు నివారింపశక్యం కాలేదు.

ప్రళయకాలంలో జగత్తు నంతటినీ నశింపచేసే కాలాగ్నివలె అది ప్రజ్వరిల్లింది. ఆ నారాయణాస్త్ర ప్రభావంతో చరాచర జగత్తంతా సంక్షోభించింది. సముద్రాలన్నీ కల్లోలాలైనాయి. పర్వతాలు కంపించినాయి. మహారాజా! మహాభయంకరమైన అస్త్రజ్వాలలను చూసి ప్రాణులన్నీ రోదించినాయి. ఆ యుద్ధాన్ని చూడడానికి వచ్చిన ఆకాశవాసులు ఆ మహాత్ముడు వదలిన దివ్యాస్త్ర ప్రభావాన్ని చూసి ఆకాశాన్ని వదలి అన్ని దిక్కులకు పారిపోయారు.

దేవతలు అలాగే తపోధనులైన మునీశ్వరులందరూ ఆ మహోగ్రమైన అస్త్రప్రభావాన్ని చూసి పరస్పరం ఇలా అనుకొన్నారు - ఏమి ఆశ్చర్యంగా ఉంది? ప్రళయకాలం ఆసన్నమైనదా ఏమి? ఇప్పుడు సాక్షాత్తు లోకనాథుడైన నారాయణుడే లోకసంహారం చేస్తున్నాడు. ఆ జగత్ప్రభువు సర్వాంతర్యామి విష్వక్సేనుని ద్వారా ఈ జగత్సంహారం చేస్తున్నాడు. శ్రీహరి నిశ్చయంగా లోకసంహారానికి సంకల్పించాడు. అకాలంలో ఆ జగత్ప్రభువు మనకీ విధంగా ఎందుకు దర్శింపచేస్తున్నాడో కదా! ఇలా పలువిధాలుగా అనుకుంటూ ఆ దేవతలంతా - మిక్కిలి ఉద్విగ్నమనస్కులై నలుదిక్కులకూ వెళ్ళిపోయారు.

అంతట విష్వక్సేనుడు సూర్యకాంతితో వెలుగుతున్న మహాభయంకర మైన సకల జగత్సంహార కారణమైన నారాయణాస్త్రాన్ని వదిలాడు. అది వృత్రాసురుని వంటి మహాబలశాలురైన దేవజిత్తు మొదలైన రాక్షస ప్రముఖులతో సహా ఆ దురాత్ములందరినీ దహించివేసింది. పరమేశ్వరునిచే దహించబడిన త్రిపురములవలె ఆ మహాస్త్రజ్వాలలతో శత్రుసేన ప్రజ్వలించింది.



దేవజిత్తు ప్రముఖులైన రాక్షసులందరు ఆ దివ్యాస్త్రాగ్నికి దగ్ధమయ్యారు. వారి గుర్రాలు, రథాలు, ఏనుగులు, అనుచరులు, బంధువులందరు కూడ రెక్కలు తెగిన పక్షుల వలె భూమిపై పడ్డారు. మహారాజా! వేలకొలది రాక్షసులు అసువులు బాసి నేలకూలారు. కాలిపోయిన వారి తలవెంట్రుకలు, వస్త్రాలు, ఆభరణాలతో భూమి అంతా కప్పివేయబడింది. అతి భయంకరము, మహోగ్రము యుద్ధంలో జయించుటకు వీలుకాని ఆ రాక్షస సైన్యం ఆ మహాస్త్రాగ్నికి దగ్ధమై పోయింది. భూమి మీద ఉన్న ప్రాణి సమూహములకు గాని, ఆకాశంలో ఉన్న దేవతలకు గాని కనబడలేదు.

ఆ తరువాత దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, నాగులు, మహాప్రభావ సంపన్నులైన మహర్షులు నేలకొరిగిన ఆ రాక్షసులను చూచి మహాపరాక్రమశాలి దేవదేవుని సేనాపతి అయిన విష్వక్సేనుని సమీపించి వికసించి చలిస్తున్న నేత్రములు కలవారై శిరస్సులు వంచి నమస్కరించి పూజించారు. రాజా! వారంతా మిక్కిలి సంతోషించినవారై రాక్షసులను సంహరించి చేత ధనుస్సు పట్టి నిలబడిన విష్వక్సేనుని చుట్టూచేరి ఇలా అన్నారు - "పూజ్య మహాత్మా! దేవతలకు సాధ్యంకాని పనిని నీ పరాక్రమానికి తగినట్లు చేశావు. ఈ రాక్షసులను మహాపరాక్ర విక్రమం గల నీవు తప్ప వేరెవ్వరు యుద్ధంలో సంహరించలేరు" అని వారంతా స్తుతించగా, మహాత్ముడైన విష్వక్సేనుడు వారందరిని తిరిగి పూజించి వారందరు చూస్తుండగనే అనుచరులతోను, వాహనంతోను అక్కడా అదృశ్యమయ్యాడు. మహారాజా! దేవజిత్తు మొదలగు రాక్షసుల సంహారగాథనంతా పూర్తిగా వివరించాను. ఇది ఎంతో ఆశ్చర్యకరమైనది. మహాభయంకరమైన రావణవధ తరువాత ఇంతటి ఘోరయుద్ధం మునుపెన్నడూ జరుగలేదని వామదేవ మహర్షి జనకునికి చెప్పాడు.

## భవిష్యద్విమాన వర్ణన

జనక మహారాజా! దేవదేవుని ఆజ్ఞచేత మహాబలవంతుడు, పరాక్రమ శాలి అయిన విష్వక్సేనుడు పూర్వం రాక్షసులను సంహరించాడని నేను నీకు చెప్పాను. ఈ చరిత్ర చాలా గొప్పది. మహాపుణ్యప్రదమైనది. అన్ని లోకాల్లోను ప్రఖ్యాతి గాంచింది. శ్రీవేంకటాచలంలో మహామతిమంతుడైన అగస్త్య మహర్షి మునీంద్రులకు భవిష్యత్తులో జరుగబోయే విషయాన్ని ఇలా వివరించాడు -

రాబోయే కలియుగంలో శాశ్వతము, మహాతేజోవంతము అయిన భగవంతుని దివ్యవిమానం కంటికి కనబడదు. అందువల్ల స్వామి పుష్కరిణీ పవిత్ర తీరంలో సూర్య సమాన

తేజస్సు గల విమానాన్ని (ఆలయ గోపురాన్ని) భక్తులు నిర్మిస్తారు. అది సాటిలేనిది. దాని మాహాత్మ్యాన్ని చెబుతాను విను. ఆశ్చర్యకరమైన ఆ విమానాన్ని దేవతలు పూజిస్తారు. దేవదేవుని దివ్యసాన్నిధ్యంలో అది విరాజిల్లుతుంది. ఇందుకు సందేహం లేదు. ఆ విమానం యొక్క మాహాత్మ్యాన్ని వివరంగా చెప్పాలంటే దేవతలకు కూడా అనేక వందల సంవత్సరాలకు కూడా సాధ్యం కాదు. అక్కడ దేవాధిదేవుడైన శ్రీహరి శ్రీ దేవి, భూదేవి సమేతుడై తన భక్తులకు మేలు చేకూర్చడానికి, ముల్లోకాలను అనుగ్రహించడానికి వేంచేసి ఉంటాడు.

**యత్రదేవాధిదేవోసౌ సాన్నిధ్యం కురుతే హరిః ।**
**స్వభక్తానాం హితార్థాయ త్రైలోక్యానుగ్రహాయ చ ।**
**శోభితం దేవదేవేన శ్రీ భూమి సహితే న తత్ ॥**

– వామనపురాణం, అ.42, శ్లో.8,9.

పాపాన్ని పరిహరింపజేసే ఆ విమానాన్ని దర్శించే మానవులు శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో సంసారబంధములన్నింటిని వీడి పరబ్రహ్మ యొక్క శాశ్వత నివాసస్థానమైన పరమపదాన్ని పొందుతారు. కలియుగంలో ఆ విమానాన్ని చూడగోరి దేవతలందరు వస్తారు. ఇంకను సిద్ధులు, చారణులతో పాటు ఋషులు, గంధర్వులు, యక్షులు, నాగులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, అష్టదిక్పాలకులు, ఏకాదశ రుద్రులు, మరుత్తులు, చతుర్ముఖ బ్రహ్మ, శంకర భగవానుడు మొదలైన వారంతా ఇంకా ఇతరులు కూడా మిక్కిలి భక్తియుక్తులై ఆ దేవదేవుని సేవిస్తారు.

మానవులు స్వామి పుష్కరిణీ తీర్థంలో స్నానం చేసి నిరామయుడు, జగత్ప్రభువు, దేవదేవుడైన శ్రీమన్నారాయణుని ఆ విమానంలో నివసిస్తున్న పురుషోత్తముడైన గోవిందుని రాత్రి, పగలు దివ్యములైన స్తోత్రములతో స్తుతిస్తు నమస్కరిస్తారు. మహాపాపాత్ములైన వారు కూడా సర్వశ్రేష్ఠము, పుణ్యప్రదము సకల దుఃఖ నివారకము, సర్వరోగ ప్రశమనము అయిన ఆ విమానాన్ని దర్శించినంత మాత్రముననే సర్వపాపములనుండి విముక్తులవుతారు. ఇందు కేమాత్రం సందేహం లేదు.

మానవుడు ఏ దేశంలో ఉన్నప్పటికి ఏ ప్రాంతంలో ఉన్నప్పటికి ఆ విమానం వైపు తిరిగి వేంకటాద్రికి నమస్కరించినచో వెంటనే అతడు పాపముల నుండి విముక్తుడౌతాడు.

**యత్ర క్వాపి వసన్ దేశే విమానాభిముఖం నరః ।**
**వేంకటాద్రిం నమస్కృత్య సద్యః పాపైర్విముచ్యతే ॥**

– వామనపురాణం, అ.42, శ్లో.18,19.

మహారాజా! ఈ విమాన మాహాత్మ్యాన్ని నీకు సంగ్రహంగా చెప్పాను. మహత్తరమైన పరమ పుణ్యప్రదమైన ఆ విమానము యొక్క మరిన్ని విశేషాలను నీ యందలి స్నేహంవలన నీవు అడగకుండగనే నేనే స్వయంగా చెబుతాను విను. మహారాజా! ఇది రహస్యంలో కెల్లా రహస్యతరమైనది. మహత్తరమైనది, మహాశ్చర్యకరమైనది, పరమాద్భుతమైనది.

ఆ నారాయణ పర్వతంలో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు స్వయంగా నెలకొని ఉన్నాడు. ఆయన ఆ పర్వత గుహలన్నిటి యందు, పర్వత శిఖరములన్నిటియందు, లోయలన్నిటి యందు, గుహలన్నిటిలోను, పవిత్రములైన, శుభప్రదములైన సెలయేళ్ళయందు, తీర్థములందు, జలపాతములందు నెలకొని ఉన్నాడు. ఆ దేవాది దేవుడైనటువంటి భగవంతుడు ఆ పర్వత పైభాగమంతా వ్యాపించి ఉన్నాడు.

**నారాయణగిరౌ తస్మిన్ ఆస్తే నారాయణః స్వయమ్ ।**
**గుహాసు చాపి సర్వాసు సర్వేషు శిఖరేషు చ ॥**
**కందరేషు చ సర్వేషు నిర్ఝరేషు శుభేషు చ ।**
**భగవాన్ దేవదేవేశః సర్వస్మిన్ గిరిమూర్ధని ॥**

– వామనపురాణం, అ.42, శ్లో.22,23.

ఆ దేవదేవుడు ఆ పర్వతంపై అనేక రూపాలతో సంచరిస్తూంటాడు. ఒక్కొక్కప్పుడు దేవతారూపంతోను, మరొకప్పుడు మానవ రూపంతోను, ఇంకొకప్పుడు మృగరూపంతోను, వేరొకప్పుడు వృక్షాదుల రూపంతోను ఉంటాడు.

**నానావిధాని రూపాణి బిభ్రద్విహరతి స్వయమ్ ।**
**క్వచిచ్చ దేవరూపేణ క్వచిన్మానుషరూపతః ॥**
**క్వచిచ్చ మృగరూపేణ క్వచి ద్వృక్షాదిరూపతః ॥**

– వామనపురాణం, అ.42, శ్లో.24-25

దివ్యమైన ఆ పర్వతంలో ఎక్కడో అక్కడ కూర్చొని దేవదేవుడైన ఆ జనార్దనుని చక్కగా ఆరాధించి ఉపాసించేవారు ఆ శ్రీహరి దివ్యసాన్నిధ్యాన్ని పొందుతారు. ఆ వృషభాద్రియందు ఒక ఘడియ కాలం (24 నిమిషాలు) నివసిస్తే ఏడు జన్మలలో చేసిన పాపం క్షణంలో నశిస్తుంది.

**వృషభాచల భూభాగే ఘటికామపి యోవసేత్ ।**
**సప్తజన్మకృతం పాపం తత్క్షణాదేవ నశ్యతి ॥**

– వామనపురాణం, అ.42, శ్లో.27

అజ్ఞానం వల్ల ఆ వేంకటాచలంలో ఎవరైతే పాపం చేస్తారో వారందరిని శస్త్రములు ధరించిన గంధర్వులు బుద్ధిమంతుడైన విష్వక్సేనుని ఆజ్ఞచేత సంహరిస్తారు. కావున ఆ పర్వతంపై మానవులు పాపమాచరించరాదు.

ఆ పర్వతంలో ఒక చెట్టుగాని, ఒక పక్షిగాని, ఒక మృగంకాని ప్రకృతి సిద్ధంగా పుట్టినవి కావు. వారంతా దేవతలే ఆయా రూపాల్లో ఉన్నారు. వారంతా ఆ దేవదేవుని సేవించుటకై ఆయన సన్నిధిలో ఎల్లప్పుడు ఉంటున్నారు అని ఈ విధంగా పూర్వం మునిశ్రేష్ఠుడైన అగస్త్య మహర్షి చెప్పారు.

**న హి తత్ర గిరౌ కశ్చిత్ వృక్షః పక్షే మృగోథ వా ।**
**ప్రాకృతో చాయతే దేవాః సర్వే తద్రూపిణస్తథా ॥**
**తస్య దేవస్య సేవార్థం సాన్నిధ్యం కుర్వతే సదా ।**
**ఏవం ప్రాహ పురాగస్త్యో భగవాన్ మునిసత్తమాః ॥**

– వామనపురాణం, అ–42, శ్లో.30,31.

పూర్వం గంధమాదనపర్వతంలో నేనడుగగా అగస్త్య మహర్షి పరమాద్భుతమైన ఈ నారాయణగిరి మాహాత్మ్యాన్ని నాకు చెప్పాడు. నేను దానిని సవివరంగా చెప్పాను. మహారాజా! నీవు అడుగని ఇతర విషయాలు కూడా నేను చెబుతాను. ఆ పర్వతంపై దానం చేసే వారికి కలిగే పుణ్యం గురించి చెబుతాను అనగా జనకుడు వామదేవ మహర్షిని ఇలా అడిగాడు–

## స్వామి పుష్కరిణీ తీరంలో అన్నదానాదుల ఫలం

జనక మహారాజు వాసుదేవ మహర్షిని ఇలా ప్రశ్నించాడు – ఓ మునిశ్రేష్ఠా! మీరు చెప్పిన ఉపాఖ్యానాన్ని నేను శ్రద్ధగా విన్నాను. సర్వజ్ఞుడు, పరబ్రహ్మ అయిన ఆ పరాత్పరుని గురించి ఇంకా తెలుసుకుందాం. ఓ తపస్వి శ్రేష్ఠా! క్షేత్రఖండంలో మీరు పుణ్యక్షేత్రాలన్నిటి గురించి చెప్పారు. అలాగే నిర్మలములైన పవిత్ర తీర్థముల గురించి ఆయా తీర్థములలో చేయదగిన శ్రేష్ఠమైన దానముల గురించి చెప్పారు. ఓ మునిశ్రేష్ఠా! ఈ నారాయణగిరిలో ఉత్తమమైన దానాన్ని చేసిన మానవుడు తన పాపరాశిని పోగొట్టుకొని ఏ ఉత్తమ ఫలితాన్ని పొందుతాడో తెలుసుకోవాలని, మీ ద్వారా వినాలని నాకు చాలా కుతూహలంగా ఉన్నది. కావున ఓ మహామునీ! తాము దయతో నాకు దానిని గురించి తెలియజేయండి! అని మహాత్ముడైన జనక మహారాజు అడుగగా ఆ మునిపుంగవుడు ఆ నారాయణాద్రిలో దానం చేసేవారికి కలిగే పుణ్యఫలాన్ని గురించి సవివరంగా చెప్పనారంభించాడు.

జనక మహారాజా! నీవడిగిన విషయాన్ని చెబుతాను. సావధానంగా విను. ఈ నారాయణగిరిలో స్వామి పుష్కరిణీ తీరంలో అన్నదానం చేయడం చాలా ప్రశస్తమైనది. దానాలన్నింటిలోకి అన్నదానం ఉత్తమోత్తమమైనది.

**నారాయణగిరావస్మిన్ స్వామి పుష్కరిణీ తటే ।**
**అన్నదానం ప్రశస్తం హి దానానాం దానముత్తమమ్ ॥**

– వామనపురాణం, అ.43, శ్లో.7.

ప్రతిరోజు ఇక్కడ నివసించేవారికి అన్నపానాదులను సమకూర్చేవాడు ఈ జన్మలోనే శీఘ్రంగా సకల రోగములనుండి విముక్తుడౌతాడు. ఇక భూదానం, గోదానం, స్వర్ణదానం, వస్త్రదానం, చందనాదుల దానం, కన్యాదానం, తిలాదానం



(నువ్వులు) చేసే మానవులు ఉత్తమలోకాలను పొంది పుణ్యకర్మలు చేసేవారు పొందే పుణ్యలోకాలలో కల్పాంతం వరకు నివసిస్తారు. ఆ తరువాత భగవంతునియందు మిక్కిలి భక్తిని పొంది విష్ణులోకంలో పూజించబడతారు.

స్వామిపుష్కరిణీ తీరంలో నిష్కామంగా (ఏ కోరికా లేకుండా) అన్నదానం చేసే వారికి సకల సంపదలు సమకూరుతాయి. అతను ప్రసన్న మనస్కుడై విష్ణుభక్తిని కలిగి ఉంటాడు. అతడు అచిరకాలంలోనే విష్ణుభక్తి వలన పరమయోగాన్ని పొంది మహర్షి చెప్పిన పరమపదాన్ని పొందుతాడు. స్వామిపుష్కరిణీ తీరంలో స్నానంచేసి, ఆ తీర్థాన్ని త్రాగినవారు సకల పాపములనుండి విముక్తులై విష్ణులోకంలో పూజించబడతాడు.

అక్కడ తమతమ శక్తిననుసరించి బంగారాన్ని గాని, గోవునుగాని, వస్త్రములను గాని, భూమినిగాని, తిలలను (నువ్వులను)గాని, చందన తాంబూలాది ద్రవ్యములనుగాని దానం చేసిన వారు దీర్ఘాయుష్మంతులై ఆరోగ్యాన్ని పొందుతారు. వారి సకల కోరికలు నెరవేరుతాయి. సకల భోగాలను సంపూర్ణంగా, పరిపూర్ణంగా వారు అనుభవిస్తారు. వారు సర్వపాపముల నుండి విముక్తులై పరమగతిని పొందుతారు.

## బ్రహ్మదేవుడు చెప్పిన స్వామిపుష్కరిణీ మాహాత్మ్యం

పూర్వం ఈ పర్వతంపై జరిగిన ప్రాచీన చరిత్రను పరమేష్ఠియైన బ్రహ్మదేవుడు నాకు చెప్పాడు. నేను దానిని యథాతథంగా నీకు చెపుతాను విను. మహారాజా! పూర్వం నేను ఈ పర్వతంపై కమలాసనుడైన బ్రహ్మదేవుని గూర్చి అనేక వందల సంవత్సరాలు తీవ్ర తపస్సు చేశాను. చాలాకాలం తరువాత నా తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు నా ముందట సాక్షాత్కరించాడు. ఆ చతుర్ముఖ బ్రహ్మ నాయందు ప్రసన్నుడై

స్వయంగా నన్ను మేఘగంభీరమైన వాక్కులతో సంబోధించి ఇలా అన్నాడు.

'ఓ ద్విజోత్తమా! వాసుదేవా! నీ తపస్సు చేత నేను సంతుష్టుడనయ్యాను. నీవు కోరిన వరాన్ని ఇవ్వడానికి నేనిక్కడకు వచ్చాను. ఓ మహామునీ! నీకిష్టమైన వరం కోరుకో. నీకు శుభమగుగాక!' మహాత్ముడైన బ్రహ్మదేవుడు నాయందు అనుగ్రహంతో ఇలా చెప్పగా 'ఓ రాజా! నేనీ విధంగా ఉత్తమమైన వరాన్ని కోరాను. ఈ పర్వతరాజంలో ఇక్కడ ఉన్న ఈ స్వామి పుష్కరిణి యొక్క మహాత్మ్యాన్ని యథార్థంగా తెలియగోరుచున్నాను. దీని దర్శనం వలన దీనిలో స్నానం చేయటం వలన, ఈ తీర్థపానం వలన, దీని తీరంలో చేసే దానాదుల వలన ఏ ఏ ఫలితాలు కలుగుతాయో దీని మాహాత్మ్యాన్నంతా నాకు తెలియజేయండి' అని అడిగాను. అపుడు బ్రహ్మదేవుడు ఇలా చెప్పాడు-

పూర్వం పాలసముద్రం నుండి పుట్టిన చంద్రుడు ఈ పుష్కరిణి తీరంలో సువర్ణాభరణాన్ని దానంచేసి పరమ లావణ్యాన్ని పొందాడు. అలాగే మన్మథుడు కన్యాదానం చేసి పరమ సుందరుడయ్యాడు. కుబేరుడు స్వర్ణదానం చేసి ధనాధిపతయ్యాడు. ఈ స్వామి పుష్కరిణీ తీరంలో ఇంద్రుడు షోడశ (16) దానాలుచేసి జయింపశక్యం కాని బలవంతులైన రాక్షసులను జయించాడు.

పూర్వం ఈ పర్వతంపైకి 'కావ్యవిత్తు' అనే బ్రాహ్మణోత్తముడు బ్రహ్మజ్ఞానం పడయగోరి వచ్చాడు. నేను స్వయంగా అతనిని పిలిచి ఉత్తమమైన బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించాను. ఓ మహామునీ! అతడు పరమధర్మాత్ముడై బృహస్పతి వంటి జ్ఞాని అయ్యాడు. ఈ భూలోకంలో భగవంతుడు విశేషించి వేంకటాద్రిపై నిత్యనివాసం చేస్తున్నాడు. కాబట్టి మానవులందరు అక్కడే మహాదానాలన్నీ చేయాలి. స్వామిపుష్కరిణీ తీరంలో ఏ కొంచెం దానంచేసినా పుణ్యకర్మలు చేసేవారు పొందే ఉత్తమ లోకాలను పొందుతారు.

**ధరణ్యాం నిత్యసాన్నిధ్యం వేంకటాద్రౌ విశేషతః ।**
**తస్మాత్తత్రైవ కార్యాణి మహాదానాని పార్థివైః ॥**
**యత్కించిచ్చ మునే! తస్మిన్ స్వామి పుష్కరిణి తటే ।**
**దద్యాదనుత్తమాన్ లోకాన్ ఆప్నుయాత్పుణ్య కర్మణామ్ ॥**

– వామనపురాణం, అ.43, శ్లో.31,32

## బ్రహ్మోత్సవ వైభవం

పవిత్రమైన భాద్రపదమాసం శుక్లపక్షంలో స్వామి పుష్కరిణీ తీరంలో దేవదేవుడు పరాత్పరుడైన శ్రీహరి ప్రీతికై పూర్వం నేను ఉత్సవం చేశాను. పుణ్యాత్ములు నిర్మలులు అయిన మానవులు ఆయా యుగాల్లో స్వామి పుష్కరిణీ తీరంలో శ్రీమహావిష్ణువుకు ఉత్సవాలు చేస్తారు. ఈ భాద్రపద మాసంలో చేసే మహోత్సవంలో భగవంతుని కొద్దిగా ఆరాధించినప్పటికీ విష్ణుమూర్తి సంప్రీతుడై సకల లోకవాసులకు మిక్కిలి దుర్లభములైన వరాలను ప్రసాదిస్తాడు.

**కించిదారాధనేనైవ విష్ణుర్భాద్రపదోత్సవే ।**
**దదాతి సర్వలోకానాం వరానత్యంతదుర్లభాన్ ॥**

– వామనపురాణం, అ.43, శ్లో.35,36.

దేవదేవుని ఉత్సవాల్లో నారాయణాద్రికి వెళ్ళే పుణ్యాత్ములైన మానవులకు కలిగే ఫలితాన్ని చెబుతాను విను. ఈ ఉత్సవాలలో మానవులు, భక్తులు తమతమ గృహముల నుండి నారాయణాద్రికి వెళ్ళుటకు ఎన్ని అడుగులైతే వేస్తారో క్రమంగా వారు వేసే ప్రతి అడుగుకు ఒక్కొక్క యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది. వారు కొన్ని అడుగులు వేసినప్పటికీ ఈ వేంకటాచల యాత్ర చేసేవారు మహత్తరమైన ఫలితాన్ని పొందుతారు.

**యాని త్వాదధతే పదాని చ మునే! నారయణాద్రిం ప్రతి**
**స్తోకం స్తోకమపి ద్విజాఅపి జనాస్తేషాం ఫలంయచ్ఛను ।**
**యావద్వేంకటశైలమాత్మగృహతస్తావత్పదానాం క్రమాత్**
**ప్రాయశ్చైవ పదేపదే క్రతుఫలం భూయాద్భువి ప్రాణినామ్ ॥**

– వామనపురాణం, అ.43, శ్లో.37.

దేవదేవుని దివ్యోత్సవంలో భగవంతుని సేవించుటకై వృషాద్రికి వచ్చే భక్తజనులను యథాశక్తి ఎవరైతే ఆదరిస్తారో, సేవిస్తారో వారికి భగవంతుడు అభీష్టాలను ప్రసాదిస్తాడు. లోభం వలన ఆ వచ్చిన భక్తులకు ఏ కొంచమన్నా ఉపకారం కాని సహాయంకాని ఏ రూపంలోనైనా చేయనివారు కల్పాంతం వరకు ఘోరమైన, భయంకరమైన రౌరవాది నరకంలో ఉంటారు.

**యే సేవార్థముపాగతాన్ వృషగిరౌ దేవస్య దివ్యోత్సవే**
**యాచ్ఛక్త్యుపలాలయంతి భగవాంస్తేషామభీష్టప్రదః ।**
**యస్తేషాముపకారమీషదపి వా కుర్యాన్న లోభాదినా**
**తస్యాకల్పమవస్థితిః శృణుమునే! ఘోరౌ మహారౌరవే ॥**

– వామనపురాణం, అ.43, శ్లో.38.

స్వామి పుష్కరిణీ తీరంలో పుష్పోద్యానాలను నిర్మిస్తే వారు కల్పాంతం వరకు స్వర్గలోకంలోని నందనోద్యానంలో ఉంటారు. పెక్కుమాటలెందుకు? స్వామి పుష్కరిణీ తీరంలో ఏ కొంచెం పుణ్యం చేసినా దాని ఫలితాని కంతమే లేదు.

**యః స్వామి సరసస్తీరౌ పుష్పోద్యానాని కారయేత్ ।**
**నందనోపవనే తస్య యావత్కల్పమవస్థితిః ॥**
**కిమనేన బహూక్తేనయః స్వామి సరసస్తటే ।**
**యత్కించిత్కురుతే పుణ్యం తస్యాంతో నైవ విద్యతే ॥**

– వామనపురాణం, అ.43, శ్లో.39,40.



సర్వలోక పూజ్యుడు, సకల సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు ఈ విధంగా చెప్పి అంతర్ధానం చెందాడు. ఈ విధంగా పూర్వం బ్రహ్మదేవుని ద్వారా నేనీ విషయాలను విన్నాను అని వామదేవ మహర్షి జనక మహారాజుకు సమస్త విషయాలను వివరంగా చెప్పాడు. మహాతేజశ్శాలియైన జనక మహారాజు ఆ వృత్తాంతమంతా విని పులకితగాత్రుడై ఆనందంతో విప్పారిన నేత్రములు కలవాడై పరమ సంతోషంతో నారాయణాద్రికి బయలుదేరాడు. ఆ మిథిలాధిపతియైన, మహాత్ముడైన జనక మహారాజు యజ్ఞాన్ని పూర్తిచేసి రాజ్యభారాన్ని మంత్రికప్పగించి వృషాద్రి శిఖరంపై నున్న భగవంతుని దర్శించుటకై స్వయంగా బయలుదేరి వెళ్ళాడు.

## స్వామి పుష్కరిణీ తీర్థకాలం

వామదేవ మహర్షి చెప్పిన స్వామి పుష్కరిణీ మాహాత్మ్యాన్ని విన్న జనక మహారాజు సంతోషంతో తన పురోహితుడైన శతానందుని 'ఓ మహామునీ! లోకంలోని తీర్థాలన్నీ కూడా స్వామి పుష్కరిణీ జలాలలో ఎలా వచ్చి చేరుతాయి? అసలలా ఎందుకు వస్తాయి? నాకు తెలియచేయండి' అని అడిగాడు. అంతట శతానందుడు ఇలా చెప్పసాగాడు.

పూర్వం గంగానదీ తీరంలో మార్కండేయ మహర్షి సకల విశ్వసృష్టికర్త యైన బ్రహ్మదేవుని గూర్చి తీవ్రనిష్ఠతో గొప్ప తపస్సు చేశాడు. చాలాకాలం తరువాత లోకపితామహుడైన బ్రహ్మదేవుడు సంప్రీతుడై ధీమంతుడైన మార్కండేయునికి సాక్షాత్కరించాడు. బ్రహ్మదేవుడు మార్కండేయునితో 'ఓ మహామునీ! నీకిష్టమైన వరం కోరుకో! ప్రసాదిస్తాను' అని అన్నాడు.

అపుడు మార్కండేయుడు బ్రహ్మదేవుని శ్రద్ధతో, భక్తితో ఇలా వరం కోరాడు - 'ముల్లోకాలలో ఎన్ని పుణ్యతీర్థాలున్నాయో ఆ తీర్థాలన్నింటిని సేవించుటకై యాత్ర చేయుటకై తగిన శక్తిని ప్రసాదించు' అని వరం కోరాడు. అది విని చతుర్ముఖ బ్రహ్మ తపస్సంపన్నుడైన మార్కండేయునితో నవ్వుతూ ఇలా అన్నాడు -

'లోకంలోని తీర్థాలన్నింటిలో స్నానం చేయడానికి వందల సంవత్సరాలకు కూడా నాకుగాని, పరమశివునికిగాని సాధ్యంకాదు. ఓ మునిశ్రేష్ఠా! నీకు మరొక ఉపాయం చెబుతాను. ఇక్కడికి దక్షిణం వైపున రెండు వందల యోజనాల దూరంలో శ్రీవేంకటాచలమనే ప్రసిద్ధమైన శ్రేష్ఠపర్వతమున్నది. ద్రవిడ దేశంలో ఉన్న ఆ మహాపుణ్యప్రదమైన పర్వతాన్ని దేవతలు సేవిస్తుంటారు. దానిపైన పరమపావనమైన, మహాపుణ్యప్రదమైన , పాపపరిహారకమైన, సర్వాభీష్టప్రదమైన స్వామి పుష్కరిణి ఉన్నది. అది మూడు లోకాల్లోని తీర్థాలకు 'స్వామిని' (రాణి) వంటిది. మార్గశిరమాసంలో శుక్లపక్షంలో ద్వాదశినాడు అరుణోదయ సమయంలో ముల్లోకాలలో ప్రసిద్ధిచెందిన మూడున్నరకోట్ల తీర్థాలు ఈ స్వామి పుష్కరిణీ జలాలలో వచ్చి చేరుతుంటాయి.

**మాసే తు మార్గశీర్షాభ్యే ద్వాథ్యాం పూర్వపక్షతే ।**

**అరుణోదయ వేఆలాయాం త్రిషు లోకేషు విశ్రుతాః ॥**
**తిస్రః కోట్యోర్ధకోటీశ్చ తీర్థానాం సుమహామతే ।**
**సాన్నిధ్యం తత్ర కుర్వంతి స్వామిపుష్కరిణీ జలే ॥**

– వామనపురాణం, అ.44, శ్లో.13-15.

లోకంలోని పాపాత్ములు తమయందు వదలిన పాపములను ఆ తీర్థములు స్వామి పుష్కరిణిలో కలిసి పోగొట్టుకుంటున్నాయి. మార్కండేయా! నీవు అక్కడకు వెళ్ళి స్వామి పుష్కరిణిని సేవించి ముల్లోకాల్లోని తీర్థాలలో స్నానం చేసిన ఫలితాన్ని పొందు అది అన్ని తీర్థాలకు 'అధినాయకి'. సర్వశ్రేష్ఠమైనది కాబట్టి దానికి 'స్వామిపుష్కరిణి' అని పేరొచ్చింది.

మార్కండేయా! నీకు మరొక ధర్మరహస్యాన్ని చెబుతాను. ఏది తెలుసుకుంటే ఇంకా తెలుసుకోవలసింది ఏమీ ఉండదో అట్టి ధర్మాన్ని విను. ఈ భూలోకంలో గంగాది పుణ్యతీర్థాలెన్నున్నాయో మేరుపర్వత శిఖరంపైన, కైలాస పర్వతంపైన, మందర పర్వతంపైన, పాతాళంలోన, సముద్ర తీరాలలోను, అలాగే ద్వీపాంతరాలలోను కల పుణ్యతీర్థాలలో చేసే దానాలు, వ్రతాలు, జపాలు, హోమాల యొక్క ఫలితాలు అనేక విధాలుగా వేదాలయందు, ధర్మశాస్త్రములయందు, పురాణములయందు చెప్పబడింది. ఆ మొత్తం ఫలితాన్ని ఒకేసారి పొందగోరేవారు మార్గశిర శుద్ధ ద్వాదశి నాడు నియమంతో మహాపుణ్య ప్రదమైన వేంకటాద్రిలో స్వామి పుష్కరిణీ తీరంలో వేదపండితుడైన విప్రునికి విష్ణుభక్తునికి, శాంత స్వభావునికి , దరిద్రునికి, అసూయ లేనివానికి షోడశదానాలలో ఏ ఒక్కదానం చేసినప్పటికిని అన్ని తీర్థాలలో ఆ దానం చేసిన ఫలితం లభిస్తుంది. ఇందుకు సందేహం లేదు.

మునీశ్వరులు షోడశమహాదానాలు గురించి చెప్పారు. వాటిలో స్వామి పుష్కరిణీ తీరంలో జితేంద్రియుడై మార్గశిర శుద్ధద్వాదశినాడు ఏ ఒక్కదానమైనా చేస్తే సకల తీర్థాలలో షోడశదానాలు చేసిన ఫలితం ఒకేసారి వస్తుంది. మార్కండేయా! ఇది ఎంత మహాశ్చర్యకరమైన విషయం! ధనుర్మాసం శుక్లపక్షం ద్వాదశినాడు అరుణోదయ సమయంలో సకలతీర్థాలు స్వామి పుష్కరిణీ జలాలతో వచ్చి చేరుతాయి.

**ధనుర్మాసే సితౌ పక్షే ద్వాథ్యా మరుణోదయే ।**
**ఆయాంతి సర్వతీర్థాని స్వామి పుష్కరిణీ జలే ॥**

– వామనపురాణం, అధ్యాయం 44, శ్లోకం 27.

'ఈ మంత్రాన్నుచ్చరిస్తూ స్నానం చేస్తే సకల తీర్థ స్నాన ఫలితం పొందుతారు. ఈ రహస్యాన్ని పూర్వం విష్ణుభగవానుడు నాకు చెప్పాడు' - అని చెప్పి బ్రహ్మదేవుడు మార్కండేయుడు చూస్తుండగానే అదృశ్యమయ్యాడు.

అంతట మార్కండేయుడు ఆశ్చర్యచకిత మనస్కుడై సంతోషంతో నారాయణాద్రికి వెళ్ళాడు. ఆ పుణ్యప్రదమైన పర్వతంలో శుభప్రదమైన స్వామి పుష్కరిణిని దర్శించి, దానిలోని నిర్మలములైన జలాలతో స్నానం చేసి దాని తీరంలో భగవంతుడైన జనార్దనుని, హృషీకేశుని నిర్మల చిత్తంతో ఆరాధిస్తూ ధ్యానిస్తూ మూడు సంవత్సరాలు ఆ పర్వతంపై ఉన్నాడు.

శ్రీమహావిష్ణువు అనుగ్రహం వలన మార్కండేయుడు ప్రతి సంవత్సరం పైన చెప్పిన పర్వదినమున సకల తీర్థాలు స్వామి పుష్కరిణిలో వచ్చి చేరుటను చూసి పరమానందాన్ని అనంతమైన, శాశ్వతమైన ఆనందాన్ని పొందాడు.

మహారాజా! ఈ స్వామి తీర్థ వైభవాన్ని మార్గశిర శుద్ధ ద్వాదశినాడు ఎవరైతే వినిపిస్తారో, ఎవరైతే భక్తి శ్రద్ధలతో వింటారో వారికి భగవంతుడు ప్రసన్నుడై సర్వాభీష్టాలను ప్రసాదిస్తాడు. వేంకటాచలంలో ఏకాదశినాడు ఉపవసించి, ద్వాదశినాడు యథావిధిగా స్వామి పుష్కరిణిలో స్నానం చేసి దాని తీరంలో నివసిస్తున్న జగత్ప్రభువైన శ్రీనివాసునికి నమస్కరించే మానవులు ఆ భగవంతుని అనుగ్రహం వలన పాపరాశిని పోగొట్టుకొని శాశ్వతమైన పరమపదాన్ని బ్రహ్మపదాన్ని పొందుతారు.

## శ్రీవేంకటాచలానికి జనకుని రాక

శాస్త్రాలన్నిటిలో వేదము ఉత్కృష్టమైనది. దేవతలలో శ్రీహరి పరమోత్కృష్టుడు. తీర్థాలన్నిటిలో స్వామి పుష్కరిణి శ్రేష్ఠమైన తీర్థం.

**శాస్త్రాణాం పరమో వేదో దేవానాం పరమో హరిః ।**
**తీర్థానాం పరమం తీర్థం స్వామి పుష్కరిణీ కృప! ॥**

– వామనపురాణం, అ.44, శ్లో.38.

కావున 'ఓ రాజేంద్రా! నీవు నారాయణాద్రికి వెళ్ళి నిశ్చల చిత్తంతో స్వామి పుష్కరిణీ జలాల్లో స్నానం చేసి దాని తీరంలో నివసిస్తున్న దేవదేవుడు సకల ప్రాణులకు శరణు పొందదగినవాడు అయిన శ్రీమన్నారాయణుని చక్కగా ఆరాధించి సకలాభీష్టాలను పొందగలవు' అని శతానందుడు చెప్పగా విని జనక మహారాజు చాలా సంతోషించి మంత్రులతో పాటు వెంటనే వృషభాద్రికి వెళ్ళి స్వామి పుష్కరిణీ జలంతో స్నానం చేసి శ్రీదేవీ, భూదేవీ సహితుడైన దేవదేవుని దర్శించి చాలాకాలం ఇక్కడే ఉండి సర్వాభీష్టాలను పొంది మరల మిథిలా నగరానికి తిరిగి వచ్చి ఈ భూమిని పరిపాలించాడు అని వ్యాసమహర్షి చెప్పాడు.

ఇది వామనపురాణాంతర్గత శ్రీవేంకటాచలమాహాత్మ్యము
సంపూర్ణము

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## సర్వ భూపాల వాహనం

బ్రహ్మోత్సవాల్లో నాల్గవనాటి రాత్రి మలయప్ప స్వామి శ్రీదేవి – భూదేవిలతో సర్వభూపాల వాహనంపై తిరుమల మాడ వీధుల్లో విహరిస్తారు. మేలిమి బంగారంతో, అచ్చెరువొందే శిల్పకళా సోయగంతో, ఇంద్రభవనాన్ని తలపించే రాజప్రాసాదాన్ని ఈ వాహనంపై ఆవిష్కరిస్తారు. అన్ని వాహనాల్లోకెల్లా అత్యంత బరువైన ఈ సర్వభూపాల వాహనం వెయ్యి కిలోలకు పైగా ఉంటుంది.

''సర్వభూపాల'' అంటే ''రాజులందరూ'' అని అర్థం. దిక్కులను కాచే అష్టదిక్పాలకులు కూడా ఈ కోవకే చెందుతారు. విష్ణు అంశ లేనిదే రాజభోగం లభించదు. ''రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే'' అనే వేదస్మృతి ననుసరించి, శ్రీహరి రాజాధిరాజు. మిగిలిన రాజులందరూ శ్రీనివాసుణ్ణి తమ భుజస్కంధాలపై మోస్తూ ఆదరిస్తున్నారు. లోకపాలకులందరూ శ్రీవారి పాదాక్రాంతులై, వారి కనుసన్నల్లో మెలుగుతూ ఉన్నట్లుగా ఈ ఉత్సవం ద్వారా మనకు గోచరిస్తుంది. సమస్త లోకాలలో ఉన్న రాజులందరికీ విశేషమైన అధికారాలుంటాయి. వాటి సహాయంతో, దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావిస్తూ మనోరంజకంగా పరిపాలన కొనసాగిస్తూ ఉంటారు. ఆ అధికారం దుర్వినియోగం కాకుండా ఉండాలంటే, వారు శ్రీవారి పట్ల అపరిమితమైన భయభక్తులు కలిగి ఉండాలి. సర్వభూపాల వాహన వీక్షణం ద్వారా రాజులందరూ ఈ సద్గుణాలను పుణికిపుచ్చుకొనటం వల్ల పరిపాలన సజావుగా సాగుతుంది. ఈ సేవను దర్శించడం ద్వారా భక్తులు తమ అహంకారం నశింపచేసుకుని, శాశ్వత ఫలితాన్ని పొందుతారు. ఇతిహాసాల్లో చెప్పబడినట్లు, సాటి నరుడు కోపిస్తే రాజు రక్షిస్తాడు. రాజు కోపిస్తే దేవుడు రక్షిస్తాడు. అంటే, దేవుని కృప ఉంటే వేరెవ్వరూ మనకేమాత్రం హాని తలపెట్టలేరు.

ఈ వాహనం దర్శించడం ద్వారా దేవదేవుని కృపను సంపూర్ణంగా పొందవచ్చు.

## మోహిని అవతారం

ఐదవ నాటి ఉదయం శ్రీవేంకటేశ్వరుడు మోహిని రూపం ధరించి, రాక్షసులను మోహింప చేసిన జగన్మోహినిగా బంగారు పల్లకిలో సోయగాలు ఒలకబోస్తూ దర్శనమిస్తాడు. శ్రీకృష్ణుడు దంతపు పల్లకిపై స్వామివారిని అనుసరిస్తూ ఊరేగుతాడు. మోహిని అవతారం ప్రత్యేకత ఏమిటంటే మిగతా అన్ని వాహనాలు వాహన మండపం నుండి మొదలైతే, ఈ వాహనం మాత్రం శ్రీవారి ఆలయం నుండి ప్రారంభమవుతుంది.

శ్రీమహావిష్ణువు యొక్క మోహిని అవతార ప్రసక్తి పురాణాల్లో అనేకసార్లు గోచరిస్తుంది.

- మొదటగా, క్షీరసాగర మథనంలో శ్రీహరి జగన్మోహిని వేషధారియై రాక్షసులను తన ముగ్ధమోహన అవతారంతో

మైమరపింపచేసి అమృతభాండాన్ని అమరులకు అందజేస్తాడు.

- మరోసారి, భోళాశంకరుడిచ్చిన వరగర్వంతో విర్రవీగుతూ ముల్లోకాలలో కల్లోలం సృష్టించిన భస్మాసురుణ్ణి శ్రీహరి జగన్మోహన రూపంతో సమ్మోహింప చేసి ఆ దానవుడి పీచమణుస్తాడు.
- మూడవసారి, దారుకావనము నందు జగన్మోహిని రూపంలో ఉన్న విష్ణువును చూసి మోహించిన శివునితో జరిగిన సంగమం వల్ల శాస్తా ఉద్భవం జరిగింది.

మోహిని అవతారంలో, మలయప్పస్వామి కూర్చున్న భంగిమలో కనిపిస్తారు. స్త్రీలు ధరించే సర్వాభరణాలు శ్రీవారికి అలంకరింపబడతాయి. మోహిని వేషధారణలో ఉన్న మలయప్పస్వామికి పట్టుచీర, రవిక, కిరీటం స్థానంలో రత్న ఖచితమైన సూర్య-చంద్ర-సావేరిలను అలంకరిస్తారు. స్వామివారికి వజ్రపు ముక్కుపుడక, ముత్యాల బులాకీని సైతం ధరింపచేస్తారు. సాధారణంగా, వరదభంగిమలో ఉండే స్వామివారి కుడిచెయ్యి మోహిని అలంకరణలో కొన్నిసార్లు రాచిలుకతోను, మరికొన్నిసార్లు అభయ హస్తంగాను దర్శనమిస్తుంది.

జగత్తంతా మాయా మోహానికి లొంగబడి ఉంటుంది. తన భక్తులు కానివారు మాయాధీనం కాక తప్పదని గీతలో శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చారు. మాయాపూరితమైన ఈ ప్రపంచం నుండి తన భక్తులను రక్షించడానికి తిరుమలేశుడు మోహిని వేషధారియై తిరువీధుల్లో దర్శనమిస్తున్నాడు.

''బలగర్వితులు, అహంకారులు కార్యఫలితాన్ని పొందలేరని, వినయ విధేయతలతో భగవంతుని ఆశ్రయించిన వారే కృషి ఫలితాన్ని సంపూర్ణంగా పొందగలరనే'' సందేశం మోహిని అవతారం ద్వారా ప్రకటితమవుతుంది.

## గరుడవాహన సేవ

**కపిలాక్షం గరుత్మంతం సువర్ణసదృశ ప్రభమ్ ।**
**దీర్ఘ బాహుం బృహత్ స్కంధం వందే నాగాంగ భూషణం ॥**

తిరుమల బ్రహ్మోత్సవాలలో ఐదవనాటి రాత్రి జరిగే గరుడోత్సవం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ ఉత్సవంలో మలయప్పస్వామివారు ఒక్కరే, వారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడవాహనం ఒక్కటీ ఒక ఎత్తు. ఈ వాహనసేవను వీక్షించడానికై తిరుమల క్షేత్రానికి విచ్చేసిన అశేష భక్తజన సందోహాన్ని చూస్తుంటే ఒడలు పులకరించి పోతుంది.

''గరుడ గమన గోవిందా! గరుడ గమన గోవిందా!! గరుడ గమన గోవిందా!!!



బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు గరుత్మంతుడు ఉత్సవాలను పర్యవేక్షిస్తూ, ఉత్సవ నిర్వాహకుడైన బ్రహ్మకు సహాయకుడిగా ఉంటాడు.

గరుత్మంతుని ఇరు రెక్కలు కర్మ-భక్తికి సంకేతాలు. నాసిక-జ్ఞానానికి ప్రతిరూపం. ఇలా కర్మ-భక్తి-జ్ఞాన సంయోగమైన వేదమే ఆ గరుత్మంతుని రూపంలో స్వామివారిని మోస్తున్నది. స్వామివారు వేదమయుడు. వేదరూపుడు. వేదవేదాంత వేద్యుడు. కనుక వేదమే ఆయనను భరిస్తోందన్నమాట.

''ఓం పక్షి స్వాహా!'' అన్న గరుడ పంచాక్షరి మంత్రంలో ఐదు అక్షరాలు ఉన్నాయి. కనుక ''పంచవర్ణ రహస్యం''గా పేర్కొనబడే ఈ గరుడోత్సవం, బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు జరగటం శ్రీవారి సంకల్పమే కానీ, యాదృచ్ఛికం కాదు.

''శ్రీశైల గరుడాచల వేంకటాద్రి నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యాం'' అంటూ, శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో కీర్తించబడే సప్తగిరులలో 'గరుడాచలం' ఒకటి. అలిపిరి నుంచి తిరుమలకు వెళ్ళే రోడ్డు మార్గంలో, వినాయకుని మందిరం సమీపాన, ఓ పర్వతసానువు ''గరుడపక్షి'' ఆకారంలో కనిపిస్తుంది. కొనదేలిన నాసిక, విశాలమైన నుదురు, రెక్కలు, చెవులు ఈ విధంగా, గరుత్మంతుడి శరీర భాగాలన్న ఆ పర్వతశిఖర పార్శ్వ భాగాన గోచరిస్తాయి. ''శ్రీనివాసుడు గరుడాద్రిపై కొలువై ఉన్నాడు'' అని చెప్పటానికి ఇంకేం ఆధారం కావాలి?

**"కృతే వృషాద్రిం పక్షంతి త్రేతాయాం గరుడాచలమ్ ద్వాపరే శేషాచలం చ వేంకటాద్రి కలౌ యుగే"**

అన్న సంస్కృత శ్లోకాన్ని బట్టి శేషాచలానికి, త్రేతాయుగంలో గరుడాద్రి అనే పేరు ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. పౌరాణిక మూలాల్లోకి వెళితే, కృతయుగంలో శ్రీమహావిష్ణువు మరో అవతారమైన ఆదివరాహ రూపం ఆదేశం మేరకు వైకుంఠంలోని క్రీడాచల పర్వతాన్ని తెచ్చి, సువర్ణముఖి నది ఉత్తరతీరాన నిలిపింది 'గరుడుడే'. అందువల్లనే వేంకటాద్రిని గరుడాద్రిగా వ్యవహరిస్తారని మార్కండేయ పురాణంలోని ఈ శ్లోకం వివరిస్తుంది –

**వైకుంఠ లోకాత్ గరుడేన విష్ణోః**
**క్రీడాచలో వేంకట నామధేయః**
**ఆనీయ చ స్వర్ణముఖీ సమీపే**
**సంస్థాపితో విష్ణునివాస హేతోః**

గరుత్మంతుడు తన తల్లి వినత యొక్క దాస్యాన్ని, క్లేశాన్ని పోగొట్టడం కోసం స్వర్గలోకానికి వెళ్ళి అక్కడి వారందరినీ చాకచక్యంగా ఏమార్చి, అమృత భాండాన్ని చేజిక్కించుకుంటాడు. అమృతసేవనంతో జరా మరణాలు ఉండవని తెలిసి కూడా, స్వయంగా సేవిద్దామనే ప్రలోభానికి ఏమాత్రం లోను కాకుండా, తన తల్లి దాస్య విముక్తే ఏకైక లక్ష్యంగా కార్యోన్ముఖుడవుతాడు. ఎంతో నిర్లిప్తంగా మాతృకార్యాన్ని నిర్వహించిన గరుత్మంతుని కార్యదీక్ష, త్యాగనిరతి, వినయశీలత, శారీరక దృఢత్వం వంటి మంగళకరమైన లక్షణాలకు ముగ్ధుడైన శ్రీమహావిష్ణువు ఏదైనా వరం కోరుకోవలసిందిగా సెలవిస్తాడు. అప్పుడు గరుత్మంతుడు కోరుకున్న కోరిక పరమాద్భుతం. అమృతం సేవించకపోయినా, జరామరణాలు లేకుండా, తానెంతటి బలవంతుడైనప్పటికీ పరమ వినయ విధేయతలతో విష్ణుమూర్తి సేవ చేసుకునే భాగ్యం కలగాలని కోరుకుంటాడు. గరుత్మంతుని నిస్వార్థ సేవాభావానికి అచ్చెరువొందిన వైకుంఠనాథుడు అతనికి రెండు వరాలిస్తాడు. వాటిననుసరించి గరుడుణ్ణి విష్ణుమూర్తి తన వాహనంగా స్వీకరించి, తన పతాకంపై ఎల్లప్పుడూ గరుడుని చిహ్నం ఉంచుకుంటాడు. ''తాను అత్యంత ప్రీతిపూర్వకంగా అధిరోహించే వాహనం గరుత్మంతుడే'' అని కూడా శ్రీహరి పలుమార్లు పెక్కు సందర్భాల్లో పేర్కొన్నాడు.

శ్రీమహావిష్ణువు ఆదేశం మేరకు గరుత్మంతుడు శ్రీవారి సన్నిధిలో, సరిగ్గా బంగారు వాకిలికి ఎదురుగా, నమస్కార ముద్రలో నిలుచుని; భక్తులకు శ్రీవారి దర్శన మార్గాన్ని, విధానాన్ని సూచిస్తుంటాడు.

శ్రీమహావిష్ణువు వరాలొసగిన నాటినుండి వైనతేయుడు శ్రీమహావిష్ణువుకు దాసునిగా, ప్రియసఖుడిగా, విసనకర్రగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజపటంగా అనేకానేక సేవలు అందిస్తున్నాడు.

**"దాసో మిత్రం తాళ వృంతం వితానం**
**పీఠం వాసో వాహనం చ ధ్వజశ్చ**
**ఏవం భూత్వా అనేకధా సర్వథా సః**
**శ్రీ శం శ్రీమాన్ సేవతే వైనతేయః"**

గరుత్మంతుడు విష్ణువుకు ధ్వజపటం కూడా అవ్వటం చేత బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమై ధ్వజావరోహణంతో ముగుస్తాయి.

ఇప్పుడు గరుడుని అధిరోహించిన స్వామివారిని అవలోకిద్దాం.

స్వామివారు స్వర్ణకిరీటం ధరించి శోభాయమానంగా దర్శనమిస్తుంటారు. ఆ కిరీటం మధ్యభాగంలో మిలమిలా మెరుస్తున్న పచ్చ, కిరీటానికి వ్రేలాడుతున్న ముత్యాలు, కిరీటానికి పొదిగినటువంటి రత్నాలు; కంఠసీమ యందు కేవలం గరుడోత్సవం నాడు తప్ప తక్కిన సర్వకాల సర్వావస్థల యందు మూలమూర్తికి మాత్రమే పరిమిత మయ్యిందే – శ్రీవేంకటేశ్వర సహస్ర నామమాల, మకరకంఠి, లక్ష్మీహారాలు; ఉదరభాగాన మరో అందమైన పచ్చ, దివ్యంగా అలంకరింపబడిన పూలమాలలు – ఇలా స్వామి నయనానందకరంగా, భక్తజన రంజకంగా అలరారుతుంటారు. గరుత్మంతుడు కొనదేలిన నాసికతో, పదునైన చేతిగోళ్ళతో, తిరునామాలతో ఓ ప్రక్క వైభవోపేతంగా, మరోపక్క అరివీర భయంకరంగా దర్శనమిస్తారు.

ఒక్క గరుడసేవలో మాత్రమే శ్రీవారు ఈ ఆభరణాలన్నింటినీ ధరిస్తారు. గరుడసేవలో, ధ్రువమూర్తి అయిన శ్రీవేంకటేశ్వరస్వామికి – ఉత్సవమూర్తి అయిన మలయప్పస్వామికి వ్యత్యాసం లేదన్న విశ్వాసం కారణంగా, ఆనాడు మాత్రం మూలమూర్తికి అలంకరింపబడే ఆభరణాలన్నీ మలయప్పస్వామి చెంత చేరుతాయి.

**గోదా సమర్పిత సుభాషిత పుష్పమాలాం**
**లక్ష్మీహార మణిభూషిత సహస్రనామ్నాం**
**మాలాం విధార్య గరుడోపరి సన్నివిష్టః**
**శ్రీవేంకటాద్రి నిలయో జయతి ప్రసన్నః**

తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో గోదాదేవికి అలంకరించి తొలగించిన పూమాలలను తిరుమలకు తెప్పించి స్వామివారి బ్రహ్మోత్సవాలలో ప్రధానమైనటువంటి గరుడసేవ నాడు స్వామివారికి అలంకరిస్తారు. శ్రీకృష్ణదేవరాయలు స్వామికి సమర్పించిన స్వర్ణాభరణాలు, మడిమాన్యాలు చాలావరకు కనుమరుగైనప్పటికీ వారిలో ప్రవేశపెట్టబడిన ఆముక్తమాలల సమర్పణ, అలంకరణ సంప్రదాయాలు

మాత్రం నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయి. ''ఆముక్త మాల''లంటే, రాయల విరచిత ''ఆముక్తమాల్యద'' గ్రంథంలో పేర్కొన్నట్టి ''గోదాదేవి అలంకరించుకొని తీసివేసి శ్రీరంగనాథునికి ధరింపచేసిన పూలమాలలు'' అని అర్థం.

రాష్ట్ర ప్రభుత్వం తరపున సమర్పించే నూతన పట్టు వస్త్రాలను కూడా గరుడసేవ నాడు స్వామివారికి అలంకరిస్తారు. అలాగే, గరుడోత్సవం నాడు చెన్నపట్టణం లోని హిందూ ధర్మార్థ సమితి వారు నూతన ఛత్రాలకు విశేష పూజలు గావించి, చెన్నై నుండి కాలి నడకతో ఊరేగింపుగా తిరుమలకు తీసుకొని వచ్చి స్వామివారికి భక్తి శ్రద్ధలతో సమర్పిస్తారు. ఈ గొడుగులతో పాటుగా, శ్రీవారికి పూలంగి కపాయి, కొల్లాయి; వక్షస్థల లక్ష్మీదేవికి పావడాలు; తిరుచానూరు పద్మావతి అమ్మవారికి గొడుగులు, పసుపు, కుంకుమ, చందనం మొదలైన వాటిని ''శ్రీవారి సారె''గా పేర్కొంటూ ఒక వెదురుబుట్టలో పెట్టి శాస్త్రోక్తంగా సమర్పిస్తారు.

అంగరంగ వైభోగంగా సాగుతున్న గరుడోత్సవ వైభవాన్ని చూచి పులకించిన అన్నమాచార్యులు ఉత్సవశోభను ఈ విధంగా వర్ణించాడు –

**"పల్లించి గరుడునిపై నీవుబ్బున నెక్క..**
**బంగారు గరుడునిపై నీవు వీధులేగ**
**చెంగట శ్రీవేంకటేశ్వర సిరులు మూగే**
**సంగతి నలమేల్మంగ సంతసాన విర్రవీగే**
**పొంగారు దేవదుందుభులు పై పై వాగె"**

గరుడోత్సవంలో, విష్ణుమూర్తి, గరుడుని మందార వర్ణపు చిగుళ్ళ పొట్లాల వంటి రెండు అరచేతులపై ఎర్రతామరల వలె ఉన్న తన రెండు పాదాలను పెట్టి వైభవం ఒలకపోస్తూ దర్జాగా కూర్చుని ఉంటాడు.

గరుడ వాహనారూఢుడైన విష్ణుదేవుని దర్శించి మైమరచిపోయిన పెరియాళ్వార్ (విష్ణుచిత్తుడు) ''పల్లాండు-పల్లాండు'' అంటూ మంగళాశాసనం చేశాడు.

''గరుడగమనా రారా! నన్ను కరుణ నేలుకోరా!'' అంటూ రామదాసు ప్రార్థించాడు.

గరుడసేవ రోజున తిరుమలక్షేత్రం అంతా లక్షలాది భక్తులతో క్రిక్కిరిసి ఉంటుంది. కొండ నిండిపోవడంతో ఇక రావద్దంటూ తి.తి.దే అధికారులు మొత్తుకుంటున్నా భక్తులు మెట్ల మార్గాల ద్వారా, ఆర్టీసి బస్సులు, సొంత వాహనాలపై తిరుమలకు పోటెత్తుతూనే ఉంటారు. ఎటు చూసిన అలౌకిక ఆధ్యాత్మికానుభూతికి లోనై హారతులిస్తున్న భక్తులతో, తిరుమల జనసంద్రంగా గోచరిస్తుంది. గోవింద నామస్మరణతో సప్తగిరులు మార్మోగిపోతాయి. తిరుమల పట్టణమే కాకుండా, దాదాపుగా చిత్తూరు జిల్లా అంతా పండుగ వాతావరణం ఉట్టిపడుతుంది.

దేశ విదేశాల నుండి కళాకారుల బృందాలు తరలివచ్చి తమ తమ కళాకృతుల్ని ముగ్ధమోహనంగా ప్రదర్శిస్తాయి.

దాదాపు రెండు లక్షల మంది పట్టే మాడ వీధుల్లోని ప్రేక్షక గ్యాలరీలన్నీ వాహన వీక్షణ కోసం ఎండనక, వాననక నిరీక్షిస్తున్న భక్తజనులతో పొంగి పొరలుతుంటాయి. ఆ రోజు ఉదయం నుండి, గంటల తరబడి భక్తులు శ్రీవారికై ఎదురుచూస్తూ, కళావిన్యాసాలను తిలకిస్తూ ఉంటారు. గరుడోత్సవం నాడు ఇంద్రుడు, వరుణుడు చిరుజల్లులతో స్వామివారిని తప్పక దర్శించుకుంటారని స్థానికుల నమ్మకం. అందుచే తిరుపతి నుంచి, తిరుమలకు వెళ్ళే భక్తులందరూ తమతో పాటుగా ఛత్రాలు తీసుకెళ్తారు. గరుడవాహనం, వాహన మండపం నుంచి బయలుదేరగానే కొన్ని గరుడ పక్షులు గగనతలం మీద విహరిస్తూ స్వామివారిని చూసి తరిస్తాయి. పోయిన ఏడాది గరుడోత్సవం నాడు తిరుమల కొండపై జడివానలో పులకరిస్తూ, గరుడుల విహంగ వీక్షణాన్ని చూసి తరించుకునే భాగ్యం మాకు కలగటం మా పూర్వజన్మ సుకృతం.

గరుడోత్సవం నాడు ఆకాశంలో కలిగిన అలజడిని చూసి అన్నమయ్య ఇలా వర్ణించాడు –

**ఇటు గరుడని నీవెక్కినను ।**
**పటపట దిక్కులు బగ్గన బగిలె ॥**
**ఎగసిన గరుడని ఏపున 'థా' యని**
**జిగిదొలక చెబుకు చేసినను**
**నిగమాంతంబులు నిగమసంఘములు**
**గగనము జగములు గడగడ వడికె ॥**

గరుడ వాహనం నాడు భోజన ఏర్పాట్లు, ప్రసాదాల తయారీ, భద్రతా సేవలు, క్యూల నియంత్రణ, వైద్య సదుపాయాలు మొదలైనవన్నీ అత్యంత భారీ ఎత్తున, ఏవిధమైన లోటుపాట్లు లేకుండా చేపడతారు. మాడవీధుల్లో, తిరుమల పట్టణమంతా పెద్ద పెద్ద వెండి తెరలు ఏర్పాటు చేసి ఉత్సవ విశేషాలన్నింటినీ ప్రత్యక్ష ప్రసారం గావిస్తారు.

గరుత్మంతుడు మాతృభక్తికి, విష్ణుభక్తికి, పరోపకార గుణానికి, నిష్కల్మషత్వానికి ప్రతీక. వైష్ణవ సంప్రదాయంలో గరుడ వాహనాన్ని ''పెరియ తిరువడి'' వాహనంగా కీర్తిస్తారు. ఈ వాహనసేవను దర్శించినవారు, కాలసర్పదోషం నుంచి, సంతానలేమి నుంచి, ఆలస్య వివాహం నుంచి ముక్తులై, కష్టాల కడలి నుంచి గట్టెక్కుతారు.

శ్రీస్వామివారు ''సర్వకాల సర్వావస్థల యందు మీ రక్షణకై శంఖు-చక్రాయుధాలను ధరించి, గరుడ వాహనారూఢుడనై, సదా సన్నద్ధునిగా ఉంటాను. నా శరణు వేడి, నా పాదాలను

ఆశ్రయించి, మీ రక్షణ భారం నాకు వదిలేయండి. తప్పక రక్షింపబడతారు'' అన్న హితాన్ని ఈ గరుడవాహన సేవ ద్వారా ఉపదేశిస్తారు.

గరుడ వాహన దర్శనం సర్వపాపహరం. సకల సంపత్కరం. శ్రేయోదాయకం.

## హనుమంత వాహనం

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటి ఉదయం వరదహస్తం దాల్చిన శ్రీవారు, హనుమంతుణ్ణి వాహనంగా చేసుకుని మాడ వీధుల్లో ఊరేగుతూ, ''త్రేతాయుగం నాటి శ్రీరామచంద్రుణ్ణి నేనే'' అని ప్రకటిస్తున్నట్లు వేంకటాద్రి రాముడిగా దర్శనమిస్తారు.

''కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే! ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్'' అంటూ, ప్రతిరోజూ ఆ శ్రీరాముని పేరుతోనే మేలుకొలుపులు పాడించుకుంటున్న శ్రీనివాసుడు ''త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుణ్ణి నేనే'' అన్న విషయాన్ని భక్త జనులకు పదే పదే జ్ఞాపకం చేయడం కోసం, హనుమద్వాహనారూఢుడై వేంకటరామునిగా ఉత్సవ సేవలో పాల్గొంటారు.

హనుమ, భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. శ్రీమద్రామాయణంలో ఆంజనేయుని పాత్ర అద్వితీయమైనది. వేదవేదాంగ పారంగతునిగా, రావణ దర్ప దమనునిగా, భక్తాగ్రేసరునిగా వినుతికెక్కాడు.

కేసరి భార్య అంజనాదేవి వేంకటాద్రి లోని ఆకాశగంగ సమీపాన ఉన్న ''జాబాలి తీర్థం''లో తపస్సు చేసింది. ఆ తపః ఫలితంగా ఆంజనేయుడు జన్మించాడు. అంజనాదేవి తపస్సు చేయటం వల్ల ఆ పర్వతం ''అంజనాద్రి''గా వినుతికెక్కి సప్తగిరుల్లో ఒకటిగా భాసిల్లుతోంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా, శృంఖలా బద్ధుడైన ''బేడి ఆంజనేయస్వామి'' ఆలయాన్ని నేడూ చూసి తరించవచ్చు. అంజనాదేవి పుత్రుడు అంజనాద్రీశునికి వాహనం అయినాడు.

ఆంజనేయుడు లేనిదే రామాయణం లేదు. శ్రీరామునితో పాటుగా, రామ పరివారమంతటికీ ఆంజనేయుడు ఎనలేని మేలు గావించాడు. లక్ష్మణునికి ప్రాణదాత. జానకీశోక వినాశకుడు. అతని చేతుల్లో రక్కసిమూకలు దోమల్లా నలిగిపోయారు. హనుమంతుడు లోకాల్లో రామరాజ్య స్థాపనకు దోహద పడ్డాడు. రామ-రావణ సంగ్రామంలో రావణుడు రథంపై నుండి యుద్ధం చేస్తుండగా, శ్రీరాముడు మాత్రం హనుమంతుని భుజస్కంధాల నధిరోహించి రావణుని పరిమార్చాడు.

భగవంతుని కంటే భగవన్నామ స్మరణమే ముక్తిదాయకమని ఆంజనేయుడు చాటిచెప్పాడు. భారతదేశ నలుదిక్కులలో ఏ ఊరు వెళ్ళినా, ఏ దిక్కు చూసినా హనుమంతుని చిన్నా, పెద్దా విగ్రహాలు లెక్కకు మిక్కిలిగా మనకు దర్శనమిస్తాయి. భారతదేశంలోని కోట్లాది కుటుంబాల్లో ''హనుమాన్ చాలీసా'' నేడు కూడా నిత్యం పఠిస్తారు.

దాస్యభక్తుల్లో మేటియైన హనుమంతుడు, వేదవేదాంగాలు, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాలు క్షుణ్ణంగా తెలిసినవాడు. హనుమంతుణ్ణి స్మరిస్తే బుద్ధి, బలం, యశస్సు, నిర్భయత్వం, ఆరోగ్యం, వాక్పటిమ సిద్ధిస్తాయి. హనుమంతుడు తన భక్తులతో ''మీకు కావలసిన భౌతిక, ఆధ్యాత్మిక, ధార్మిక ఫలాలన్నీ నేనే ఇస్తా. మోక్షం మాత్రం నా స్వామి రామయ్యను సేవించి పొందండి'' అంటూ, తాను సర్వశక్తి సంపన్నుడైనప్పటికీ, ''రాముడే దేముడ''నే విషయాన్ని వినయంగా లోకానికి చాటి చెప్పాడు. తన బలాన్ని స్వయంగా తెలుసుకోలేనంత నిగర్వి, వినయశీలి హనుమంతుడు. జాంబవంతాదులు నుడివిన తర్వాతనే ఆ వాయుపుత్రునికి తాను సాగరాన్ని లంఘించగలననే విషయం తేటతెల్లమైంది. మూర్ఛిల్లిన లక్ష్మణుడు తెప్పరిల్లగానే, యుద్ధ పరిసమాప్తి కాకుండానే ఎంత వేగంతో సంజీవని పర్వతాన్ని తీసుకుని వచ్చాడో, అంతే వేగంగా దాన్ని యథాస్థానంలో చేర్చేశాడు. భావితరాల ఔషధావసరాల రీత్యా, ఆ పర్వతరాజాన్ని సత్వరమే స్వస్థలానికి చేర్చిన, అపారమైన దూరదృష్టి కలవాడు హనుమంతుడు. ఈనాడు మనం చెప్పుకునే ''పర్యావరణ సమతౌల్యత'' ఆవశ్యకతను ఆనాడే క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని, అమలు పరచిన దార్శనికుడు.

ఈనాటి వాహనమైన హనుమంత దర్శనంతో, ఇహలోక వాంఛలు సిద్ధించటమే కాకుండా, మోక్షం కూడా లభిస్తుంది.

తాళ్ళపాక అన్నమయ్య హనుమంతుని సముద్రలంఘన, రావణవధ ఘట్టాల్ని ఇలా వర్ణించాడు –

**ఇతడే యతడు గాబోలేలిక బంటు నైరి**
**మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు**
**జలధి బంధించి దాటె హనుమంతుడు**
**అలరి ఊరకే దాటె హనుమంతుడు**
**అలుకతో రావణుని దండించె నితడు**
**తలచి మైరావణుని దండించె నితడు**

హనుమద్వాహన విధమైన క్షణంతో ప్రతి భక్తుడు ఆంజనేయునిలా నిష్కళంక హృదయం, నిస్వార్థ సేవాతత్పరత, ప్రభుభక్తి పరాయణత్వం, సచ్ఛీలత, భావితరాల సంక్షేమం పట్ల నిబద్ధత వంటి సద్గుణ సంపద కలిగి, స్వామి కృపకు సదా పాత్రులవుతారు.

(సశేషం)

# నవవిధ భక్తిమార్గాలు

– డా|| కూర్మాచలం శంకరస్వామి

## ఆత్మనివేదనం

నవవిధ భక్తిమార్గాలలో 'ఆత్మ నివేదనం' ఒకటి. ఇది చివరిదే అయినా అత్యంత పవిత్రమైన భక్తిమార్గం. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, సఖ్యం, చిట్టచివరిది 'ఆత్మ నివేదనం'. క్రమ క్రమంగా భక్తిభావం పెరిగి చివరికి భక్తుడు తనకు తాను ఆ భగవంతునికి సమర్పించుకోవడమే ఆత్మనివేదనం. భక్తి తాదాత్మ్యంతో ఆ భగవంతునికి తన్ను తాను సమర్పించుకోవడమే ఈ ఆత్మనివేదన ప్రధాన లక్ష్యం. దీనికి ప్రతీకగా దైత్యోత్తముడైన బలిచక్రవర్తి ఉదంతాన్ని పేర్కొన్నారు.

బలిచక్రవర్తి దైత్యులలో ఉత్తముడు, మహాబలవంతుడు, మహాదాత. సముద్ర మథనంలో వచ్చిన అమృతాన్ని దేవతలే స్వీకరించడంతో కోపోద్రిక్తుడై, అమరావతి అధిపతియైన ఇంద్రుణ్ణి, మిగతా దేవతలందరినీ తన పరాక్రమంతో తరిమికొట్టి అమరావతి రాజధానిగా పరిపాలన కొనసాగిస్తూ తన కులగురువైన శుక్రాచార్యుని సలహాలతో యజ్ఞయాగాదులు నిర్వహిస్తూ, యజ్ఞ హవిస్సులు దేవతలకు ఇవ్వకుండా తానే ఆరగిస్తూ, ఇంద్రుణ్ణి ఇతర దేవతలను పదవీచ్యుతులను చేసి తానే ముల్లోకాలకు అధిపతి కావాలని శుక్రాచార్యుని సలహాతో యాగం చేస్తుండగా దేతల కోరిక మేరకు బలిచక్రవర్తి యొక్క బలగర్వాన్ని అణచివేసి తాను కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి ఇచ్చుటకు విష్ణుమూర్తి వామనమూర్తి రూపంలో బలిచక్రవర్తి యాగశాలకు వచ్చాడు. వామనును చూచి అక్కడివారు ఇతడెవ్వడు? శివుడో విష్ణువో, బ్రహ్మయో, సూర్యుడో, అగ్నియో మారు వేషమున వచ్చి యుండవచ్చు. ఈ ప్రపంచంలో ఇంతటి తేజోమయుడు, మనోహర సుందరుడైన బ్రాహ్మణుడెక్కడున్నాడు అని తలచుచు ఆ బ్రహ్మచారిని చూచి అక్కడివారు తమలో తాము గుసగుసలాడారు.

"గుజగుజలు వోవు వారును
గజిబిజి పడువారు చాల గలకల పడుచున్
గజిబిజియైరి సభాస్థలి
బ్రజలెల్లను బొట్టి వడుగు పాపని రాకన్"

ఆ వామనమూర్తి మృదువుగా, మందముగా, బుడిబుడి అడుగులు వేసికొంటూ, మధ్య మధ్యలో అక్కడక్కడ కాసేపు ఆగుతూ, అతని అడుగులకు భూమి కృంగినట్లుగను, ముద్దు



ముద్దుగ మాటలాడుచు తొట్రుపాటుతో తడబడు అడుగులతో బలిచక్రవర్తిని చేరెను. ఆ తరువాత బలిని సంబోధిస్తూ, 'ఓహో! ఇతడేనా! ఆ దానవ చక్రవర్తి. యెవ్వడైతే ఆ దేవేంద్ర, అగ్ని, యమాది దిక్పాలకుల గర్వమును తొలగించిన ధీరుడు, ఇతడేనా? లోభమును పూర్తిగా నిర్మూలించుకున్న త్యాగధనుడు. ఇతడేనా అనేకమైన యజ్ఞ యాగ వ్రత దానాది సత్కర్మలను చేసిన పుణ్యమూర్తి. ఇతడేనా దేవతా రమణుల మానస సాగరములలో పూర్ణచంద్రునివలె కల్లోలములు కల్గించిన వీరుడు. ఇతడేనా సత్యము, దయ, ధర్మములతో విలసిల్లే సౌజన్యమూర్తి అంటూ బలిచక్రవర్తికి వామనుడు ఇట్లు స్వస్తి వచనాలు పలికెను. స్వస్తి అనగా శుభమగుగాక అని అర్థము. వామనుడు పలుమార్లు ఈ పదాన్ని ఉచ్చరించడం విశేషం. ముల్లోకాలను శాసించు దానవ చక్రవర్తికి స్వస్తి. ఇంద్రుని ఓడించి మహోన్నత పదవి నలంకరించి నిర్వహించువానికి స్వస్తి. మునులచే స్తుతించబడి మంగళకరములగు యాగములు జరిపించు వానికి స్వస్తి. దేవతా సతుల మంగళసూత్రములను పోగొట్టువానికి స్వస్తి. నీకు సర్వదా శుభమగుగాక అని వామనుడు స్వస్తి వచనములు పలుకగానే బలిచక్రవర్తి ఒకింత గర్వముతో పొంగిపోయి

వామనునితో ఇట్లనెను.

**"వడుగా! యెవ్వరివాడ వెవ్వడవు సంవాస స్థలం బెయ్యది**
**య్యెడకున్ నీ వరుదెంచుటన్, సఫలమయ్యెన్ జన్మమున్**
**గడు ధన్యాత్ముడనైతి నీ ముఖము యోగ్యంబయ్యె నా కోరికల్**
**గడతేఱెన్ సుహుతంబులయ్యె శిఖులం గళ్యాణ మిక్కాలమున్"**

అంటూ బలిచక్రవర్తి వామనునికి స్వాగతం పలికి నీవెవరు అని ప్రశ్నిస్తూ మరియు ఇలా అన్నాడు. ఓ భూసురోత్తమా! నీకు ఏమి కావలయును? మేలైన పట్టు వస్త్రములా? బంగారమా? ఫలములా? వనసంపదలా? గోవులు, గుఱ్ఱములు, రథములా, రతనములా? మృష్టాన్న భోజనములా? గృహములు, రాజ్యములు, భూములూ, ఏనుగులు, కన్యలు లేక నీకు కావలసినదేదైననూ కోరుకొనుము. దానిని నేను నీకు ఇచ్చెదను. ఆ మాటలు విన్న వామనుడు చిరునవ్వులు చిందిస్తూ ఇలా అన్నాడు. ఓ దానవేంద్రా! ''ఇది'' నా చోటని నేనెట్లు చెప్పగలను? నేను అన్నిచోట్లా నిండియుందును, ఎవ్వనికి చెందిన వాడనని నేనేమని చెప్పగలను? నాకు చెందినవాడను నేనెయై మేలగుచుందును. ఇది నా సంచరించు తావని నేనెట్లు చెప్పగలను? కోరి మూడు లోకములలో సంచరించగలను. ''అది'' నేర్చుకొంటిని, ''ఇది'' నేర్చుకొంటిని అని చెప్పనేలా? అన్ని విద్యలు నేనే నేర్చుకొంటిని. నాకు ఎవ్వరూ పరులు కాదు. అందరికీ నేను ఆత్మీయుడనే. నేను ఒంటరివాడను. నాకు చుట్టాలు ఎవరూ లేరు. ఒకప్పుడు నాకు ''సిరి'' యుండెను. నా యొక్క నివాస స్థానము చెప్పెద వినుము. నేను ఎల్లప్పుడు సజ్జనుల మధ్యమున లేదా ఉత్తమ భక్తుల హృదయ గుహలందు ఉంటాను.

**"ఒంటివాడ నాకు నొకటి రెండడుగుల**
**మేర యిమ్ము సొమ్ము మేర యొల్ల**
**గోర్కె దీర బ్రహ్మ కూకటి ముట్టెద**
**దానకుతుక సాంద్ర! దానవేంద్ర!"**

ఘనమైన ధనకాంక్ష గల దానవేంద్రా! నేను ఒంటరి వాడను. నాకు ఒకటి రెండడుగుల స్థలమునిమ్ము. నాకు ధనము, గౌరవము వద్దు. నేనడిగిన నేలనిచ్చిన నేను బ్రహ్మ యొక్క శిరస్సును చేరగలనని భావింతును. ఓ దానవరాజా! బ్రహ్మచారినైన నేనెక్కడ? భూములు, ఏనుగులు, అశ్వములు, అందాల భామలు లాంటివన్నీ యెక్కడ? అయినా వాటితో నాకేమి పని? గొడుగో, జంధ్యమో, కమండలమో, దండమో, దర్భల మొలత్రాడో ఇలాంటివే నా యొక్క నిత్య కర్మలకు పనికి వచ్చునవి. నేను కోరిన మూడడుగుల నేల నిచ్చిన నాకదే బ్రహ్మానందమగును.

**"వ్యాప్తిం బొందక వగవన్**
**ప్రాప్తంబగు లేశమైన బదివేలనుచున్**
**దృప్తిం జెందని మనుజుడు**
**సప్తద్వీపములనైన జక్కంబడునే?"**

ఓ దానవరాజా! ఏదైనను లభించినదని అతిశయింపక, స్వల్పమని కించపడక, లభించినదెంత తక్కువైనను అదియే పదివేలని తృప్తి చెందని మనుజుడు సప్తద్వీపములకు పోయినను, తృప్తిపడునా, బాగుపడునా? ఆశాపాశము మిక్కిలి పొడుగైనది. దానికి అంతము లేదు. సముద్రముచే నావృతమైన భూమండలమంతయు తమదేయైయున్న కొందరు ఈ ఆశాపాశముచే కట్టబడినవారై, వ్యర్థమైన యాతనలనే పొందిరి గాని తమ అర్థ కామాశము తొలగించుకొనగలిగారా? తమ ఆశ యొక్క అంతము చూడగల్గిరా? అని పలికిన వామనుని మాటల్లోని మర్మం గ్రహించిన రాక్షస గురువు శుక్రాచార్యుడు బలిచక్రవర్తితో ఇలా అన్నాడు.

ఓ దనుజేంద్రా! ఈ బ్రహ్మచారి సామాన్యుడు కాడు. అవ్యయుడైన విష్ణువు దేవతా కార్యమును సాధించుటకు వచ్చినవాడు. అదితి-కశ్యపుల కుమారుడు. అయ్యో! తెలియక నీవితనికి కోరిన దానము నిచ్చెదనని ఒప్పుకుంటివి. దీనివలన దైత్య సంతతి నశించును. మీ యొక్క సిరిసంపదలు, తేజస్సు, రాజ్యము, ఐశ్వర్యం అన్నియును నిన్ను వంచించి ఇతడు ఆ ఇంద్రునికిచ్చును. ఈతడు మూడు పాదములతో అన్ని లోకములను ఆక్రమించగలడు. నీకున్న సర్వసంపదలను ఈతనికి దానం చేసి శక్తిహీనుడవై నీవెట్లు బ్రతుకగలవు?

**"ఒక్క పదంబు భూమియు**
**ఒక్కటద్రి దివంబు ద్రొక్కి యున్నత మూర్తిన్**
**దిక్కులు గగనము దానై**
**వెక్కసమై యున్న నెట్లు వెడలెదు చెప్పుమా"**

అని చెబుతూ, ఓ రాజా! ఇచ్చిన మాట తప్పినా ఏ నరకమూ సంభవించదు. నీ శక్తిచేత దేనినైనా సాధించగలవు. ఏ దానము వలన నాశనము సంభవించునో అది దానము కాదని, తత్త్వవిధులు చెప్పిరి. దానము, యజ్ఞము, తపము, కర్మములు తాను ధనవంతుడై యున్నప్పుడే దానము చేయలయును. తన ఇంట నున్న ధనము నంతటిని ఐదు సమభాగములుగా విభజించి, ఒక భాగం కోరికలను తీర్చుకొనుటకు, ఒక భాగము అర్థసంచయునకు, ఒక భాగము ధర్మకార్యముల కొరకు, ఐదవ భాగము ఆశ్రిత జనుల కొరకై వెచ్చించవలయును. అట్లు చేయు మనుజుడు ఇహ పరముల యందు ఆనందముగా నుండును. స్త్రీలనుఒప్పించెడిసందర్భములోను,పరిహాసములాడునప్పుడు, వైవాహిక, వినోద వేడుకలయందును, ప్రాణాపాయ స్థితిలోను, తమ గౌరవమునకు భంగము వాటిల్లునప్పుడు, గోవులను, బ్రాహ్మణులను రక్షించునప్పుడు అసత్యమాడినను దోషము కాదు. కనుక ఆ దానము చేయకుండా ఈ బ్రహ్మచారిని

పంపివేయుము అని పలికిన శుక్రాచార్యునితో బలిచక్రవర్తి ఇట్లు బదులిచ్చెను.

ఓ ఆచార్యదేవా! ఆదినుండి ఎందరెందరో రాజులు కాలేదా? ఎన్నెన్నో సామ్రాజ్యములు వారికి సిద్ధించలేదా? ఆ రాజ్యాధీశులు ఎంత గర్వముతో బతికారు? మరి వారంతా ఇప్పుడెక్కడ ఉన్నారు? ఈ భూమిపై వారి పేరైనను కలదా? శిబి చక్రవర్తి వంటి మహా దాతలు – కీర్తి కాములై ప్రేమతో అడిగిన వారి కోరికలు తీర్చలేదా? వారిని ఈనాటికీ ఎవ్వరైననూ మరచిపోగలరా?

ఓ మహానుభావా! తెంపు లేని క్రతువులు, వ్రతములు చేసిననూ యెవ్వని రూపమునైనను గాంచవలను పడదో అట్టి దొడ్డవాడు కురుచవాడై నా వంటి సామాన్యుని కడకు వచ్చి అడిగినచో అతని ఇష్టార్థమును తీర్చవలయును కదా!

**"ఆదిన్ శ్రీ సతి కొప్పుపై దనువుపై నంసోత్తరీయంబుపై**
**బాదాబ్జంబులపై గపోల తటిపై బాలిండ్లపై నూత్నమ**
**ర్యాదంజెందు కరంబు గ్రిందగుట మీదైనా కరంబుంటమే**
**ల్గాదే రాజ్యము గీజ్యము సతతము కాయంబు నాపాయమే"**

గురుదేవా! మొదట శ్రీదేవి యొక్క కురులను సవరించుచు, శరీరమును నిమురుచు, పైట చెంగులను లాగుచూ, పాద పద్మములు పట్టుకొనుచూ, చెక్కిళ్ళను స్పృశించుచు, పాలిండ్లతో నాడుచు, నిత్యము ఆరాధించబడుచుండు ఆ శ్రీహరి యొక్క చేయి నన్ను యాచించుచు క్రిందిది యగుటయు, దానమిచ్చుచు నా చేయి మీది దగుటయు ఆహా! ఎంతటి అదృష్టము! శ్రేయస్కరము కాదా! ఈ రాజ్యము, గీజ్యము ఏమైనా శాశ్వతమైనట్టివా? ఈ శరీరం మాత్రం పోకుండా ఉండిపోవునా?

ధీవర్యా! నాకు నరకమే ప్రాప్తించినా, నేను బంధింపబడినను, భూమండలము నిర్మూలమైనను, నాకు దుర్మరణము సంభవించినను, కులాంతమైనను, నిజానికి ఏది రానున్నదో అది రానిమ్ము. ఏది జరగనున్నదో అది కానిమ్ము. ఇప్పుడు అభ్యాగతుడై వచ్చినవాడు శివుడైనను, హరియైనను, బ్రహ్మదేవుడైనను, ఇంకెవ్వడైనను కానిమ్ము, రానిమ్ము. మాట ఇచ్చిన నా నాలుక మరి వెనుకకు తిరుగదు. ఈ విషయముపై వేయి మాటలెందుకు?

**"మేరువు తలక్రిందైనను**
**బారావారంబు లింకబారిన లోలో**
**ధారుణీ రజమైపోయినా**
**దారాధ్వము బద్ధమైన దప్పక యిచ్చున్"**

ఓ గురుశ్రేష్ఠా! మేరు పర్వతము తలక్రిందులైనను, సముద్రములు ఎండిపోయనను, భూమండలము లోలోపలనే చూర్ణమైనను, మిన్ను విరిగి మీదపడినను నేను ఈ దానమును ఇచ్చి తీరుదును. ఈ చిన్న పాపడు ఎన్నడూ ఇతరులను యాచించలేదట, ఏకాకియట, కన్నవారు గాని, అన్నదమ్ములు గాని ఎవ్వరూ లేరట. ఈతడు చేతులొగ్గి యాచించినప్పుడు నేనెట్లు కాదనగలను అంటూ –

**"బ్రతుకవచ్చు గాక బహు బంధనములైన**
**వచ్చు గాక లేమి వచ్చు గాక**
**జీవధనములైన జెడు గాక**
**మాట దిరుగలేరు మానధనులు"**

అంటూ బలిచక్రవర్తి దానమివ్వదలచుకొని వామనునితో ఇట్లనెను. ఓ బాలక శ్రేష్ఠమా! ఇటు రమ్ము. లెమ్ము. నీ వాంఛితమును ఇచ్చెదను. నీ పాదములను కడుగవలెను కావున నీ అడుగులను ఇటు రానిమ్ము. ఆలస్యమ చేయనేల? అంటూ బలిచక్రవర్తి తన రెండు చేతులతో జల ప్రక్షాళనము చేయుట కొరకై శ్రీహరి తన పాదములను ముందుకు సాచెను. ఆ పాదము లెట్టివి? యోగులు, దేవతలు నిత్యం ప్రార్థించునట్టివి. సిరులను కురిపించునట్టివి. రమాదేవి లలాటమునకు పూయబడిన కస్తూరి చందనములు, ఆమె వంగి నమస్కరించినప్పుడు స్వామి పాదములకు అంటుకున్నవి. వేద స్వరూపములైన పాదములను కడిగెన్.

**"సురలోక ముద్ధరణము**
**నిరత శ్రీ కరుణమఖిల నిగమాంతాలం**
**కరణము భవసంహరణము**
**హరిచరణము నీట గడిగె నసురోత్తమున్"**

బలిచక్రవర్తి శ్రీహరి పాదములు కడిగి దానము చేయబోగా శుక్రాచార్యుడు మరొక ప్రయత్నం చేసి విఫలం కాగా వామనుడు చేయి సాచగా బలి దైత్యేంద్రుడు పవిత్ర జలాక్షతలను విడిచి దానము చేసెను.

**"మునిజన నియమా ధారను**
**జనితాసుర యువతి నేత్ర జలకణ ధారన్**
**దనుజేంద్ర నిరాధారను**
**వనజాక్షుడు గొనియె బలి వివర్ధిత ధారన్"**

అలా బలి చక్రవర్తి నుండవి మూడడుగుల నేలను గ్రహించి, ఒక అడుగు భూమిపై, మరొక అడుగు ఆకాశము నాక్రమించి, మూడవ అడుగు బలి తలపై మోపి అతనికి మోక్షం కలిగించాడు శ్రీహరి. రాక్షస శత్రువైన విష్ణువే దానమడుగ వచ్చెనని తెలిసియు, తనకు కష్టకాలము రానున్నదని తెలిసియు, గురుదేవుల హెచ్చరికను సైతం లక్ష్యపెట్టక, అంతా సర్వనాశనమని తెలిసియు దానమిచ్చి చివరకు ఆత్మను సైతం ఆ పరమాత్మునికే నివేదించిన బలిచక్రవర్తి చరితము ఆచంద్ర తారార్కము. ఇదే నిజమైన ఆత్మ నివేదనమని దేవతలు సైతం బలిచక్రవర్తిపై పుష్పవృష్టి కురిపించారు.



# జగన్నాథుని రథయాత్ర

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

ప్రతిసంవత్సరం ఆషాఢ మాసంలో శుక్ల పక్ష విదియ నాడు జగన్నాథుని రథయాత్ర ప్రారంభమవుతుంది.

**"త్వయి సుప్తే జగన్నాథ! జగత్సుప్తం భవేదిదం**
**విభుద్దే త్వయి బుధ్యేత తత్సర్వం స చరాచరమ్"**

జగమును పాలించే ఓ జగన్నాథ! శ్రీహరీ ఈ భూమండలమును సర్వ శ్రేయోదాయక పాలన చేయుచున్న నీకు నమస్కరించుచున్నాను. అని శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ రథయాత్రకు ఏర్పాట్లకు శ్రీకారం చుడతారు నిర్వాహకులు.

రథయాత్రకు సరిగ్గా అరవైరోజుల ముందు, వైశాఖ బహుళ విదియనాడు పూరీ మహారాజు పూజారులను సంప్రదించి కలప సేకరించాల్సిందిగా ఆదేశిస్తాడు. సామంతరాజు అప్పటికే కలపకి అవసరమైన వృక్షాల్ని గుర్తించి ఉంటాడు. వాటికి వేదపండితులు శాంతి నిర్వహించాక దానిని జాగ్రత్త రథంగా 1,072 కాండలను పూరీకి తరలిస్తారు. రథాల నిర్మాణానికి 13వేల ఘనపుటడుగుల కలప అవసరం. ప్రధాన పూజారి నేతృత్వంలోని శిల్పుల బృందం అక్షయ తృతీయ నాడు రథాల తయారీకి శుభ శ్రీకారం చుడుతుంది. ముందు వృక్ష కాండాన్ని 2,188 ముక్కలు చేస్తారు. వాటిలో 832 ముక్కలను జగన్నాథుడి రథం కోసం, 763 ముక్కలుగా బలభద్రుడి రథం కోసం, 593 ముక్కలు సుభద్రా దేవి రథం కోసం వినియోగిస్తారు. తయారీ సమయంలో యంత్రం వాడకుండా రూపొందిస్తారు.

జగన్నాథుడి రథం నందిఘోష, ఎత్తు సుమారు 46 అడుగులు, పదహారు చక్రాలు ఉంటాయి. ఒక్కో రథం ఎత్తు ఆరు అడుగులు. సారథి పేరు దారుక. బలభద్రుడి రథం తాళధ్వజం. సుభద్రాదేవి రథం దేవదళన్. నిర్మాణం పూర్తి అయ్యాక రథాల్ని యాత్రకి ఒకరోజు ముందుగా ఆలయ తూర్పుభాగంలోని సింహద్వారం దగ్గర నిలబెడతారు. లాగుడు వీలుగా ఒక్కో రథానికీ 250 అడుగుల పొడవు, ఎనిమిది అంగుళాల మందం కలిగిన తాళ్ళను కడతారు.

రథయాత్రకు రెండురోజుల ముందుగా అమావాస్య నాడు, నూతన దేవతామూర్తుల నేత్రోత్సవం జరుగుతుంది. యథావిధిగా పూజలు ప్రారంభం అవుతాయి. మరుసటి రోజు నవయవ్వన దర్శనం లభిస్తుంది. ఆషాఢ శుక్ల విదియనాడు

పాండాలు మేళతాళాలతో ఉద్యమాల పూజలు నిర్వహించి 'మనిమా' అంటే జగన్నాథ! అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ విగ్రహాన్ని కదిలిస్తారు.

ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా అత్యంత కోలాహల వాతావరణంలో ఊరేగిస్తూ రథం వెనుక భాగం నుంచి తీసుకువచ్చి రత్న పీఠం మీద అలంకరింపజేస్తారు. ఈ ఉత్సవాన్ని ' పహండీ' అంటారు. ఈ దశలో కలమత భేదాలకు తావులేకుండా అందరూ పాల్గొంటారు. గుండిచా ఆలయానికి వెళ్ళేందుకు సిద్ధమైన సుభద్ర, జగన్నాథ బలభద్రులు, రథారూఢులై ఉండగా ' ఇకపై నడిచే విష్ణువు'గా గౌరవాభిమానాన్ని అందుకునే పూరీరాజు పల్లకీలో అక్కడకి చేరుకోవడంతో సంరంభాలు మిన్నంటుతాయి. మహాత్ముని ముందు సేవకుడిగా మారిన ఆ మహారాజు బంగారు చీపురుతో రథం లోపల ఊడిచి శుభ్ర పరుస్తాడు. దీనినే " చెరా పహారా" అంటారు.

రథానికున్న తాళ్ళను లాగడంలో ప్రపంచ ప్రఖ్యాత రథయాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్ర సమయంలో జగన్నాథుని ' పతితపావనుడు'గా భావిస్తారు. ఆ రథంపై కొలువైన స్వామిదర్శనం చేసుకుంటే మనం చేసిన పాపాలు హరిస్తాయని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. ఆ క్షణం కోసమే ఎదురుచూసే భక్తకోటి ఒక్క సారిగా రెట్టింపు ఉత్సాహంతో ముందుకు దూకుతారు. జయజయధ్వానాల మధ్య రథాలు భారంగా కదులుతాయి. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరుకోడానికి 12 గంటల సమయం పడుతుంది. గుండీచా వనం చేరుకున్నాక, ఆ రాత్రి ఆలయం బయట రథాల్లోనే మూలవిరాట్టుకు విశ్రాంతినిస్తారు. మరునాటి ఉదయం మేళతాళాలతో గుడిలోపలకి తీసుకువెళతారు. శ్రీకృష్ణుడు గోకులం నుండి మథుర యాత్ర గా పరిగణించబడుతుంది. ప్రధాన ఆలయం నుంచి మొదలైన యాత్ర గుండిచా ఆలయం చేరుకోవడం లో ఈ యాత్ర హిందూదేశం లో జరిగే గొప్ప కమనీయ వేడుక. మర్నాడు ఉదయం మేళతాళాలతో గుడిలోపలికి తీసుకువెళతారు. స్వామి అక్కడ ఏడురోజుల పాటు ఉంటాడు. ఈ సమయంలో ఐదవరోజున ఓ ఆసక్తికరమైన విశేషం జరుగుతుంది. ఆలయంలోకి శ్రీనాథుడు తనతోపాటు లక్ష్మీదేవిని తీసుకువెళ్ళ లేదని అలిగి, గుండీచా మందిరం బయట నుంచే జగన్నాథుని ఓరకంట చూసి, పట్టలేని కోపంతో స్వామిరథాన్ని కొంతమేర ధ్వంసం చేసి వెనక్కివెళ్ళిపోతుంది. ఈ ముచ్చట అంతా అమ్మవారి పేరిట పూజారులే జరిపిస్తారు. ఆ రోజును 'హీరాపంచమి' అంటారు. వారంరోజులు గుండీచా ఆతిధ్యం స్వీకరించిన



సుభద్ర, బలభద్ర, జగన్నాథులు దశమినాడు తిరుగు ప్రయాణం చేస్తారు. దీనినే ' బహుదాయాత్ర' అంటారు. జగన్నాథుడు మాత్రం మధ్య లో ' అర్ధాసని' మౌసీ మా గా ప్రసిద్ధి చెందిన గుడి దగ్గర ఆగి తియ్యటి నైవేద్యం స్వీకరించిన తరువాత మధ్యాహ్ననికి మూడు రథాలూ ఆలయానికి చేరుకుంటాయి. మరునాటి ఏకాదశినాడు స్వామివార్లను స్వర్ణ ఆభరణాలతో( సునాబెడా గ చెప్పబడుతుంది) అలంకరించి దర్శనానికి అనుమతిస్తారు. ఆ దృశ్యం అద్వితీయం. ఆ దర్శన భాగ్యము పుణ్య కర్మలచేతనే లభిస్తుంది. ద్వాదశినాడు మరల విగ్రహాలను రత్న సింహాసనంపై ప్రతిష్ఠించడంతో రథయాత్ర పూర్తవుతుంది. స్వామి లేక చిన్న బోయిన పూరీ, జగన్నాథ దేవాలయము తిరిగి కొత్త కళతో చైతన్య వంతమైన వెలుగులు చిమ్ముతుంది.

ఎక్కడ, ఏ దేవాలయంలోనూ కనిపించని సోదరీ, సోదరులు జగన్నాథ, బలభద్ర, సుభద్రల దేవతామూర్తులు సమాజానికి అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ అనుబంధాన్ని స్ఫూర్తిగా అందిస్తోంది.

ఈ రథయాత్ర జరిగే రోజుల్లో సోదర సోదరీ కుటుంబాల కలయిక మధుర వంటకాలతో కలసి భోజనం చేయడం విశేషం. మనంకూడా ఇటువంటి సంప్రదాయం పాటిద్దాం. సంతోషంగా ఉందాం.

పూరీలో జగన్నాథ రథయాత్ర 12 రోజుల పాటు జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు జరిపే యాత్రలో పాల్గొనే భక్తులు గానీ లేదా పూరీకి వెళ్ళలేని భక్తులు తమ గృహమందే 12, 9, 7 రోజులపాటు ప్రతినిత్యం విష్ణుమూర్తిని విశేష స్తుతి చేస్తే ఈతిబాధలు పోయి సుఖశాంతులు లభిస్తాయి.

# మీ ప్రశ్న - మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. సత్సాంగత్యం నిజంగా గొప్పదని అంటారా?**

**– కౌసల్య డి. ఓం అకాడమీ, అనంతపురం**

జవాబు – మంచి ప్రశ్న. బుద్ధి శక్తిని పటిష్ఠపరచుకోవాలంటే సత్సాంగత్యం అంటే సత్పురుషుల, సజ్జనుల స్నేహంతో మన మనసు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి వైపుకు వెళుతుంది. సత్సాంగత్యం, నిస్సాంగత్యానికి, నిస్సాంగత్యం, నిర్మోహత్వానికి, నిర్మోహత్వం, పరతత్త్వ జ్ఞానానికి, పరతత్త్వ జ్ఞానం జీవన్ముక్తికి హేతువులవుతాయి. తనువు, మనసు, ఆత్మ మూడూ సత్సాంగత్యంతోనే లాభపడతాయి.

**2. మన జీవితాల్లో అర్థవంతమైన, ఉన్నతమైన, అత్యంత ప్రయోజనకరమైన మార్పు రావాలంటే ఏం చేయాలి?**

**– విజయలక్ష్మి బసవ, ముషీరాబాద్.**

జవాబు: 1. మన జీవితం మనకు దేవుడు ప్రసాదించిన గొప్ప వరం. దీన్ని సదుపయోగం చేసుకుంటాను, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి నేను వెళ్ళి తీరుతాను అనే దృఢమైన సంకల్పం ముందు తీసుకోవాలి.

2.సత్సంగం, సద్గ్రంథ పఠనం, సద్గురు సమాశ్రయణం, సన్మార్గ గమనం... వీటని ప్రతిరోజు ఆచరణలో పెట్టుకోవాలి.

3.ఎవరో వచ్చి మనకు ఏదో చేస్తారనో, మన జీవితంలో ఏదో అద్భుతం జరిగి, మనకు ఏదో లాభం కలుగుతుందనో భావించరాదు. ఎవరికివారే తమను ఉద్ధరించుకోవాలి. ఎవరి నావకు వారే నావికులు.

4.కర్మను వదలక, తన కర్తవ్యాన్ని చక్కగా ఆచరిస్తూ కర్మ ఫలితాన్ని దైవానికి వదిలిపెట్టాలి.

5.ప్రతివారూ తమ జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, తానే పని చేస్తున్నా దాన్ని దైవపరంగా భావించాలి. కర్త, కర్మ, క్రియ అంతా ఆ దేవుడే అని అనుకోవాలి.

6.మహాత్ముల, మహితాత్ముల జీవిత చరిత్రలు చదివి, వారు ఏయే పరిస్థితులలో ఎలా ప్రవర్తించారో, వారెలా ఆదర్శ వ్యక్తులైనారో గ్రహించి, వారి అడుగు జాడలలో నడవాలి.

7. కాలాన్ని సదుపయోగం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు తన చర్యలను విశ్లేషించుకుంటూ, తన గురించి తక్కువగాను, ఇతరుల మేలు గురించి ఎక్కువగాను ఆలోచించాలి.

8.మానవ విలువలను పాటిస్తూ, ధర్మమార్గంలో నడవాలి.

9.శరీరం, మనసు, ఆత్మ – ఈ మూడింటినీ బలోపేతం చేసుకుంటూ పవిత్రమైన జీవితం గడపాలి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

### 102 వ కళ్యాణం

ఇది తేది 06-06-2026 శనివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఫ్లాట్ నెం.1088, పద్మశాలి టౌన్ షిప్, కాప్రా, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ మాచూరు నరేందర్ రెడ్డి, జ్యోతి దంపతులు నిర్వహించారు.

### 103 వ కళ్యాణం

ఇది తేది 18-06-2026 గురువారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఎవెలోన్ ఎగ్జిక్యూటివ్ లీవింగ్, ఫ్లాట్ నెం.405, రోడ్ నెం.21, అయ్యప్ప సొసైటీ, మాదాపూర్ హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ ఇల్లూరి నరసింహ, జయమ్మ దంపతులు నిర్వహించారు.



### 104 వ కళ్యాణం

ఇది తేది 21-06-2026 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది ఆనర్ అక్వాంటీస్ డ్రైవ్ వే, సి-బ్లాక్, తెల్లాపూర్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని ఆనర్ అక్వాంటీస్ నివాసితులు నిర్వహించారు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము.

శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

అమ్మవారి ఆరాధన చేయుట వలన గృహశాంతి కలుగును. ఇష్టదైవ ఆరాధన ద్వారా కోరికలు అనుకూలంగా నెరవేరుటకు సరైన కాలము. అమ్మ దయ ఉంటే అన్ని విధములుగా అనుకూలత కలుగును. ఈ మాసంలో ఎవరికీ హామీలు ఉండుట మంచిది కాదు.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

సామాన్య ఫలితములు. ప్రతి విషయంలో ప్రతిపక్ష భావంతో మాట్లాడుట వలన బంధుమిత్రుల మధ్య విరోధములు కలగవచ్చును. మనోభీతి, అశాంతి నివారణకు శ్రీలక్ష్మీ గణపతి–సుదర్శన హోమములు చేయుట శ్రేయస్కరం.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. మానసిక ఒత్తిడి వలన తొందరపడి మాట్లాడి శత్రుత్వములు ఏర్పడగలవు. కొంతవరకు అనుకూలత కనిపించినప్పటికీ, తెలియని అనారోగ్య సూచనలు ఉండును. “ఓం నమో నారాయణాయ” జపము చేయవలెను.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ మాసమున కొంతమేర సమస్యలు ఎదురైనను ఆందోళన చెందక ధైర్యంగా, నిబ్బరంగా ఉండవలెను. వారాహి అమ్మవారి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ఆచరించుట వలన మార్పు గమనించగలరు. ఆర్థికంగా అనుకూలత కలుగును.

## సింహరాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

సామాన్య లాభములు ఉన్నప్పటికీ ఋణబాధలు, అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది పెడతాయి. అధికారుల ఒత్తిడి మానసికంగా కుంగదీయవచ్చు. కుటుంబంలో పిల్లల కారణంగా విరోధాలు తలెత్తవచ్చు. పరిహారం: వారాహి అమ్మ పూజలు, గ్రామదేవత ఆరాధన చేయుట వలన ఉపశమనం.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల సమయం. ప్రతి విషయంలో అమ్మవారి అనుగ్రహం ఉంటుంది. మంచి కాలమని నిర్లక్ష్యం చేయరాదు. గ్రామదేవతల పూజలు, వారాహి నవరాత్రి ఆరాధన చేయుట వలన శుభఫలితములు కలుగును.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. బంధు–మిత్రుల విరోధములు, అప్పు ఇచ్చినవారి ఒత్తిడి కలుగగలదు. మానసిక ఆందోళనకు లోనుకాకుండా నిగ్రహంగా ఉండాలి. గ్రామదేవత పూజలు, వారాహి నవరాత్రి ఆరాధన చేయుట వలన సమస్యలకు పరిష్కారములు లభించును.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూలం. గ్రామదేవత, అమ్మవారి అనుగ్రహం వలన అనుకున్న పనులు నెరవేరుతాయి. అభివృద్ధి, ప్రమోషన్లు, మనోబలంతో గౌరవ–మన్ననలు లభిస్తాయి. ఆర్థికంగా నిలదొక్కుకొనుటకు అనుకూల రోజులు.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశివారికి సామాన్య ఫలితములు. గ్రహ కలయికల లోపం వలన అనారోగ్యం, ఆర్థిక ఒత్తిడి, అర్థంకాని సమస్యలు ఎదురయ్యే సూచనలు ఉన్నాయి. చిక్కులు, చికాకులు కలుగవచ్చు. లక్ష్మీనారాయణుల పూజలు, గజలక్ష్మీ దేవి ఆరాధన చేయుట వలన సమస్యలు నివారణ పొందగలరు.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశివారికి అనుకూల ఫలితములు. విజయం వరించగలదు. గ్రామదేవత ఆరాధన, వారాహి మాత నవరాత్రులు చేయుట వలన విశేష ఫలితం ఉంటుంది. “మీరు అమ్మ పనిని చేస్తే అమ్మ మీ పనిని చేస్తుంది” అనే విశ్వాసమే మీ ఆయుధం.

## కుంభరాశి

ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ మాసమున కొంతమేర అనుకూలత ఉంటుంది. మానసిక ఒత్తిడి ఉన్నా కొంత ఉపశమనం లభిస్తుంది. మాటలలో నియంత్రణ అత్యవసరం. అవసరం లేని విషయాలను విననివిననట్లుగా వదలాలి. ఒప్పందాలు చేయకూడదు. వారాహి అమ్మ ఆరాధన చేయండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి వారికి సామాన్య ఫలితములు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు, నవగ్రహ ఆరాధన వలన కుటుంబ సౌఖ్యం పెరుగుతుంది. ఆర్థికంగా బలం ఏర్పడుతుంది. ఆకస్మిక ధనలాభం, ఆర్థిక సంతృప్తి లభిస్తుంది. భార్య అనారోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా. లలితవాణి

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదిలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

**ఈ కింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి**

1. శూర్పణఖ ఎవరిగా జన్మించింది?
2. గోవిందదాసు ఎంత స్థలాన్ని స్వామివారికి సమర్పించారు?
3. అత్రి మహర్షి కంటి నుండి ఎవరు పుట్టారు?
4. పాదుకా పట్టాభిషేకం ఎక్కడ జరిగింది?
5. గోవిందదాసు చెల్లెలి పేరేమిటి?
6. అత్రి మహర్షి పేరు మీదుగా ఉన్న గ్రామమేది?
7. గీతగోవిందం వ్రాసిందెవరు?
8. పినాకపాణి – ఎవరు?
9. విష్వక్సేనుని మంత్రి ఎవరు?
10. రామదాసు కాలంలో గోల్కొండ ప్రభువు ఎవరు?
11. బ్రహ్మోత్సవాలలో శ్రీవారు ఎక్కి ఊరేగే వాహనాలెన్ని?
12. గురువు మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు ఏ నదికి పుష్కరం వస్తుంది?
13. వేదవ్యాసుడు జన్మించింది ఎక్కడ?
14. అత్రి, గౌతముల వాదాన్ని తీర్చిందెవరు?
15. జనక మహారాజుకి శ్రీవారి మహిమలను చెప్పిందెవరు?

| | |
|---|---|
| 1 | |
| 2 | |
| 3 | |
| 4 | |
| 5 | |
| 6 | |
| 7 | |
| 8 | |
| 9 | |
| 10 | |
| 11 | |
| 12 | |
| 13 | |
| 14 | |
| 15 | |

పేరు: ______________________________

చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్‌కోడ్: ______________ ఫోన్: ______________


# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. రత్నమాల
2. 25 రోజులు
3. వరాహస్వామి
4. శివుని
5. భాద్రపద మాసంలో
6. అగస్త్యముని
7. హనుమంతుడు
8. బ్రహ్మదేవుడు
9. బలరాముడు
10. మ్లేచ్ఛులను
11. కల్కి భగవానుడు
12. సిద్ధులు
13. అచ్యుతరాయలు
14. మంచాల గ్రామం
15. బద్దంపెట్ట

## సరైన సమాధానాలు రాసినవారు

1. పి. యశోద
2. జె. ఇందిర
3. చింతలపాటి శివశంకర శాస్త్రి
4. చిల్లర సీతారామారావు

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**జె. ఇందిర**


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy,** Cell: **93482 12354.** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com



RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



**If Un Delivered Please Return to:**
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq